ఆదివారం
1•12•2019
కరీంనగర్
• వెల. రూ. 8
• సంపుటి 9 • సంచిక 156
• పేజీలు : 14 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




# రాక్షసంపై ఆగ్రహం

## వెటర్నరీ డాక్టర్ హత్యోదంతంపై పెల్లుబికిన నిరసనలు

- తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు
- ఉన్మాదులను ఉరితీయాలంటూ ఆగ్రహం
- షాద్‌నగర్ ఠాణాకు తరలివచ్చిన జనసందోహం
- నిందితులను తామే శిక్షిస్తామంటూ నినాదాలు
- తాసిల్దార్ ఎదుట నిందితుల హాజరు
- 14 రోజులపాటు రిమాండ్.. చర్లపల్లి జైలుకు తరలింపు
- నిందితులకు న్యాయసహాయం చేయబోమన్న షాద్‌నగర్ బార్ అసోసియేషన్
- నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

**రాక్షసత్వంపై** ప్రజాగ్రహం పెల్లుబికింది. నిరసనజ్వాలలు వెల్లువెత్తాయి. అత్యంత పాశవికంగా.. కిరాతకంగా వెటర్నరీ డాక్టర్ ఉసురుతీసిన నిందితులను తక్షణం శిక్షించాలంటూ జనమంతా హోరెత్తారు. శనివారం ఉదయం ఎవరూ పిలుపునివ్వకుండానే.. స్వచ్ఛందంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు రోడ్లమీదకు వచ్చిన ప్రజలు తీవ్ర స్వరంతో తమ నిరసనలు వ్యక్తంచేశారు. నిందితుల సొంత ఊళ్లల్లో సైతం ఆందోళనలు జరిగాయి. పలుచోట్ల కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. నిందితులను ఉంచిన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు ఉదయాన్నే తరలివచ్చిన ప్రజావాహిని.. వాళ్లను తమకే అప్పగించాలని.. తామే శిక్షిస్తామని ఆగ్రహంతో ఊగిపోయింది. అందరినోటా ఒకటే ఆక్రందన.. వెటర్నరీ డాక్టర్ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలనే.. ఆమెకు జరిగిన అన్యాయం మరొకరికి జరుగరాదన్న ఆవేదన ప్రతి ఒక్కరిలోనూ కనిపించింది. మరోవైపు ఇంతటి దారుణానికి ఒడిగట్టినవారికి వెంటనే శిక్షపడేలా చేయాలన్న తపన పోలీసుల్లోనూ వ్యక్తమైంది. వేలమంది ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చినా.. పోలీసులు అత్యంత సంయమనంతో వ్యవహరించారు. ప్రజలతో మాట్లాడి వారిని సముదాయించడానికి ప్రయత్నించారు. ప్రజల ఆగ్రహం చల్లారకపోవడంతో ఫరూక్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తాసిల్దార్‌ను రప్పించి నిందితులను ప్రవేశపెట్టి.. గట్టి బందోబస్తు నడుమ నేరుగా చర్లపల్లిజైలుకు తరలించారు. మరోవైపు వెటర్నరీ డాక్టర్ తండ్రి ఫిర్యాదును స్వీకరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు పోలీసులపై హైదరాబాద్ కమిషనర్ సస్పెన్షన్ వేటువేశారు.


వెటర్నరీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య కేసులో నిందితులను తామే శిక్షిస్తామంటూ షాద్‌నగర్ ఠాణాలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలు

**హైదరాబాద్/ సిటీ బ్యూరో/ రంగారెడ్డి జిల్లా, నమస్తే తెలంగాణ:**

వెటర్నరీ డాక్టర్ హత్యోదంతంపై నిరసనలు వెల్లువెత్తాయి. 'సేవ్ గర్ల్స్, సేవ్ సొసైటీ' అనే నినాదాలతో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ శనివారం నిరసన ర్యాలీలు తీశారు. ఉన్మాదులను ఉరితీయాలని డిమాండ్‌చేస్తూ నిందితులను ఉంచిన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళలు, ప్రజాసంఘాలు, స్థానికులు, విద్యార్థులు నిరసనకు దిగడంతో ఆ ప్రాంతం అట్టుడికిపోయింది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ఘటనపై మహిళా, ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. పలుచోట్ల పెద్ద ఎత్తున ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఈ నలుగురు నిందితులకు న్యాయసహాయం చేయబోమని బార్ కౌన్సిల్ ప్రకటించింది. హత్యకు పాల్పడిన మహ్మద్ అరీఫ్, శివ, నవీన్, చెన్నకేశవులను బహిరంగంగా ఉరితీయాలని ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులు ఉన్నారని తెలుసుకున్న స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని బైఠాయించారు. ఉదయం 9 గంటల నుంచి నిందితులను చర్లపల్లి జైలుకు తరలించేవరకు కూడా నిరసనకారులు నినాదాలు చేశారు. బారికేడ్లను తొలగించారు. పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించారు. రోడ్డుపైనే బైఠాయించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి షాద్‌నగర్‌కు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు

మిగతా 2వ పేజీలో

## నేడు ఆర్టీసీ కార్మికులతో సీఎం

# ఆత్మీయ సమావేశం

### ప్రతి డిపో నుంచి ప్రగతిభవన్‌కు ఐదుగురు కార్మికులు

- వారిలో ఇద్దరు చొప్పున మహిళా సిబ్బందికి ప్రాతినిధ్యం
- కార్మికులు, ఉద్యోగులు కలిపి దాదాపు 750 మంది హాజరయ్యే అవకాశం
- తొలుత కార్మికులతో కలిసి సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజనం
- అనంతరం సంస్థ స్థితిగతులపై కూలంకషంగా చర్చ
- ముందస్తుగా ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీ కార్మికులతో సీఎం కేసీఆర్ ఆదివారం ప్రగతిభవన్‌లో సమావేశమవుతున్నారు. ఒక్కో డిపో నుంచి ఇద్దరు మహిళా సిబ్బంది సహా ఐదుగురు చొప్పున మొత్తం 97 డిపోల నుంచి కార్మికులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఈ సమావేశం ప్రారంభం కానుండటంతో 12 గంటల్లోగానే సిబ్బంది ప్రగతిభవన్‌లోకి వచ్చేలా అధికారులు శనివారం సాయంత్రం నుంచే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరిన తర్వాత వారితో సమావేశమవుతానని గత క్యాబినెట్ సమావేశానంతరం ప్రకటించిన సీఎం కేసీఆర్.. ఆ మాట ప్రకారం వారిని ప్రగతిభవన్‌కు పిలిపించుకొని కూలంకషంగా మాట్లాడనున్నారు. కార్మికులతో కలిసి భోజనం చేసిన తర్వాత సీఎం కేసీఆర్ వారితో సమావేశమై సంస్థ స్థితిగతులను, ఆర్థిక పరిస్థితులను వివరించనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ పరిస్థితి ఎలా ఉండేది? తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎలాంటి పరిస్థితులున్నాయి? ఆర్టీసీని కాపాడేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నది? తదితర అంశాలను ముఖ్యమంత్రి చెప్పనున్నట్లు



తెలుస్తున్నది. సమ్మె కాలంలో ఆర్టీసీకి జరిగిన నష్టంతోపాటు, కార్మికసంఘాల నేతల తీరును వారికి వివరించి.. క్షేత్రస్థాయిలో ఆర్టీసీ పరిస్థితిని, సంస్థలో ఉన్న లోటుపాట్లను స్వయంగా కార్మికుల నుంచి తెలుసుకోనున్నారు. సంస్థను లాభాలబాట పట్టించేందుకు కార్మికుల నుంచి

మిగతా 2వ పేజీలో

# బలపరీక్ష నెగ్గిన ఠాక్రే

### విశ్వాస పరీక్షకు అనుకూలంగా 169 మంది ఓటు

ప్రొటెం స్పీకర్ మార్పుపై బీజేపీ నిరసన • 105 మంది ఎమ్మెల్యేలు వాకౌట్
కాంగ్రెస్ కొత్త మెలిక! • డిప్యూటీ సీఎం పదవి కోసం పట్టు
స్పీకర్ పదవికి నానా పటోలే పేరు ఖరారు


శనివారం మహారాష్ట్ర అసెంబ్లీలో బలపరీక్షలో విజయం సాధించిన అనంతరం అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే

**మహారాష్ట్రలో** ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం బలపరీక్షలో నెగ్గింది. శనివారం అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ దిలీప్ వాల్సే విశ్వాసతీర్మానాన్ని ప్రవేశపెట్టగా శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ కూటమికి చెందిన 169 మంది ఎమ్మెల్యేలు అనుకూలంగా ఓటేశారు. సభ నిర్వహణ అనైతిక పద్ధతిలో సాగుతున్నదంటూ బీజేపీకి చెందిన 105 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ప్రభుత్వం ఓటమి భయంతోనే బీజేపీకి చెందిన ప్రొటెం స్పీకర్‌ను తొలిగించి, ఎన్సీపీకి చెందిన దిలీప్‌ను నియమించిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఫడ్నవీస్ ఆరోపించారు. మొత్తం 288 మంది సభ్యులకుగానూ నలుగురు ఎమ్మెల్యేలు సభకు హాజరుకాలేదు. విశ్వాస పరీక్ష నెగ్గడంతో సీఎం ఉద్ధవ్ ఠాక్రే త్రిపక్ష కూటమి ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు పదవుల పంపకంపై కాంగ్రెస్ అలిగింది. తమకు స్పీకర్ పదవితోపాటు డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నది. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు స్పీకర్ పదవికి నామినేషన్ వేయబోమని భీష్మించినట్టు ఎన్సీపీ వర్గాలు తెలిపాయి. ఎన్సీపీ నేతల బుజ్జగింపుల అనంతరం కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి నానా పటోలే పేరును ఖరారు చేసింది. ఎన్సీపీ నేత అజిత్‌పవార్ మాత్రం కాంగ్రెస్‌కు స్పీకర్ పదవిమాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు.

5

# ఇదీ ఆర్టీసీ వాస్తవ స్థితి

### ఆగస్టు నెలాఖరుకే రూ.5,269.25 కోట్ల నష్టాల్లో సంస్థ

ఈ ఆర్థిక సంవత్సరంలో నష్టం రూ.1,200 కోట్లకు పెరిగే అవకాశం
తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం నుంచి రూ.4,239.95 కోట్ల సాయం
ఆర్టీసీ కార్మికులకు అందజేసేందుకు బుక్‌లెట్ సిద్ధం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీ ఏర్పాటు నాటినుంచి ఇప్పటివరకు సంస్థ స్థితిగతులపై అధికారులు పూర్తి నివేదికను రూపొందించారు. నిజాం కాలంలో ప్రారంభమైన రోడ్డు రవాణా సంస్థ, ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటైన ఏపీఎస్ ఆర్టీసీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత వచ్చిన టీఎస్‌ఆర్టీసీ గురించి ఈ నివేదికలో సంక్షిప్తంగా వివరించారు. ప్రస్తుతం టీఎస్‌ఆర్టీసీలో ఉన్న బస్సుల సంఖ్య, సంస్థ ఆర్థిక పరిస్థితి, ఇప్పటివరకు నమోదైన నష్టాలు, చెల్లించాల్సిన రుణాలు, ప్రభుత్వం నుంచి పొందిన సహాయం, ప్రస్తుతం చెల్లించాల్సిన బకాయిలు, బస్సుల రిప్లేస్‌మెంట్ విధానం, ఉద్యోగుల వివరాలు, సంవత్సరాలవారీగా పదవీ విరమణచేసిన ఉద్యోగుల వివరాలను ఈ నివేదికలో పొందుపరిచారు. తెలుగులో రూపొందించిన ఈ బుక్‌లెట్‌ను ఆర్టీసీ కార్మికులకు అందజేయనున్నారు.

**కార్మికులకు అందజేసే నివేదికలోని ముఖ్యాంశాలు :**

2018-19లో టీఎస్‌ఆర్టీసీ రూ.4,882.72 కోట్ల ఆదాయాన్ని (ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.662.39 కోట్లు ఆర్థికసాయంగా లభించింది) ఆర్జించింది. వ్యయం రూ.5,811.39 కోట్లుగా ఉన్నది. అంటే రూ.928.67 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఆర్టీసీ ఆదాయంలో ఉద్యోగుల జీతాలకు రూ.2,829.00 కోట్లు (58 శాతం) ఖర్చువుతున్నది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో సంస్థ నష్టం రూ.1,200 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరునాటికి టీఎస్‌ఆర్టీసీ రూ.5,269.25 కోట్ల నష్టాల్లో ఉన్నది. ఈ ఏడాది నవంబర్ 21 నాటికి టీఎస్‌ఆర్టీసీ తీసుకొన్న రూ.2,958.57 కోట్ల రుణాల్లో ప్రభుత్వ రుణాలు రూ.845.09 కోట్లున్నాయి. ప్రభుత్వ రుణాలను మినహాయిస్తే సంస్థ చెల్లించాల్సిన రుణాలు రూ.2,113.48 కోట్లుగా ఉన్నాయి. ఉద్యోగులకు ఇచ్చిన బాండ్ల విలువ రూ.280 కోట్లు. ఈ మొత్తాన్ని వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి చెల్లించాలి. వడ్డీతో కలిపి 2024 నవంబర్ నెలాఖరునాటికి మొత్తం రూ. 2,784.30 కోట్లు చెల్లించాలి. ఇక బకాయిల రూపంలో మొత్తం రూ.2,209.66 కోట్లు చెల్లించాల్సి ఉన్నది.

**ప్రభుత్వం అందించిన సహాయం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం నుంచి రూ.3,903.55 కోట్లు, జీహెచ్‌ఎంసీ నుంచి రూ.336.40 కోట్లు కలిపి టీఎస్‌ఆర్టీసీ

మిగతా 2వ పేజీలో

## జార్ఖండ్‌లో 64.72% పోలింగ్

తొలి విడుతలో 13 అసెంబ్లీ స్థానాలకు ముగిసిన ఎన్నికలు
చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం 5
బిష్ణుపూర్‌లో వంతెనను పేల్చేసిన మావోయిస్టులు

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 94.00 | రిటైల్ లైవ్ | 116.00 |
| డ్రెస్డ్ | 168.00 | స్కిన్‌లెస్ | 191.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 441.00 | రంగారెడ్డి | 441.00 |
| మెదక్ | 441.00 | కరీంనగర్ | 444.00 |
| వరంగల్ | 444.00 | చిల్లర ధర | 5.00 |



వెటర్నరీ డాక్టర్‌పై అఘాయిత్యం చేసిన నిందితుడు నవీన్ బైక్

- నేరస్థుల ప్రవర్తనను పసిగట్టవచ్చు!
- పిల్లలతో పేరెంట్స్ స్నేహితులుగా ఉండాలి
- పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలి
- వారి సమస్యలను షేర్‌చేసుకోవాలి
- సైకాలజిస్టుల సూచనలు

# డేంజర్ బెల్స్!

### పరిమితులు లేని స్వేచ్ఛ • అపరిమితమైన అడ్వెంచరిజం

యువత మెదళ్లను తొలిచేస్తున్న 'స్మార్ట్' వైరస్ • అశ్లీలం.. హింస.. వేగం.. ఉన్మాదం
వ్యక్తిత్వాల్ని నాశనంచేస్తున్న సాంకేతికత • విశృంఖలంగా పెరుగుతున్న నేరప్రవృత్తి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

వాడు.. తన బైక్‌పై 'డేంజర్' అని బోర్డుపెట్టుకుంటాడు! పంజా విసిరేందుకు సిద్ధంగా ఉన్న పులి బొమ్మ స్టిక్కర్ అంటించుకుంటాడు. మరొకడు తన ఫేస్‌బుక్ ఖాతాలో ముసుగు దొంగ ముఖాన్ని ప్రొఫైల్ పిక్చర్‌గా ఉంచుతాడు. వాట్సప్ చాటింగ్‌లో ఉద్వేగం కలిగించే కామెంట్లు పోస్ట్‌చేస్తాడు. ఇన్‌స్టాగ్రాంలో ఒళ్లు గగుర్పొడిచే చిత్రాలు పెడతాడు. వీడియో గేమ్స్ ఆడితే అతివేగం.. హింసాప్రవృత్తి.. బీభత్సమైన ధ్వని కాలుష్యంతో కూడినవే ఇష్టపడతాడు. సినిమాల్లో సూపర్ హీరోలను.. గ్రాఫిక్ హీరోయిజాన్ని ఆసక్తిగా చూస్తాడు.. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, సినిమాలు.. ఒకటేమిటి.. అందుబాటులో ఉన్న ప్రతి మాధ్యమమూ ఇవాళ యువ మెదళ్లలోకి భయంకరమైన వైరస్‌ను ఎక్కిస్తున్నది. పరిమితులు లేని స్వేచ్ఛ వాళ్లను అసాధారణంగా మార్చేస్తున్నది. వాళ్ల వ్యక్తిత్వాన్ని విషపూరితం చేస్తున్నది. పాఠశాలల్లో పాఠాలు చెప్పడం తప్ప వ్యక్తిత్వ వికాసంకోసం చేస్తున్న ప్రయత్నాలు లేవు. తల్లిదండ్రులు హోంవర్క్‌లు చేయించడం తప్ప.. స్కూలు దాటి బయట సమాజంలోకి పోతే మన నడత ఎలా ఉండాలో చెప్పే పరిస్థితులు లేవు. చదువుకుంటున్నామన్న పేరుతో గది తలుపులు మూసుకొని లోపల ఏం చేస్తున్నారో తెలియదు. ఎవరి ఫోన్లు వారివి. ఎవరి టీవీలు వారివి.. ఎవరి జీవితాలు వారివన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. వయసుకు మించిన పనులు వాళ్లను తప్పుదారి పట్టిస్తున్నాయి. పరిమితికి మించిన అడ్వెంచరిజం వాళ్ల ప్రవర్తనను పక్కదారి పట్టిస్తున్నది. వీటన్నింటితోపాటు వయసుతో నిమిత్తంలేకుండా మద్యం, సిగరెట్లు, అశ్లీల చిత్రాలు మన పిల్లలను మనకు కాకుండాచేస్తున్నాయి. రాక్షసులుగా మారుస్తున్నాయి. పర్యవసానంగా ఆటవిక హింసాప్రవృత్తి ప్రబలి నేరాలు పెరుగుతున్నాయి. శంషాబాద్‌లో వెటర్నరీ డాక్టర్‌పై అఘాయిత్యం.. వరంగల్‌లో యువతి దారుణ హత్య ఉదంతాల్లో నిందితుల నేర

మిగతా 9వ పేజీలో

## రాష్ట్రంలో రోడ్లు బాగుపడాలి

సీఎం కేసీఆర్ లక్ష్యం మేరకు పనిచేయాలి
ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
రూ.571 కోట్లు మంజూరుపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు 3

## అయ్యయ్యో.. ఆర్థిక వ్యవస్థ!

5 లక్షల కోట్ల డాలర్ల లక్ష్యం నెరవేరేనా?
క్రమేణా క్షీణిస్తున్న దేశ జీడీపీ
ప్రధాని కల కల్లలు?
భవిష్యత్తుపై తగ్గుతున్న భరోసా 7



శంషాబాద్‌లో మృతురాలి తల్లిని ఓదార్చుతున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సత్వరన్యాయం

గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

శంషాబాద్ బాధితురాలి కుటుంబసభ్యులకు పరామర్శ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శంషాబాద్ తొండుపల్లిలో యువవైద్యురాలిపై జరిగిన సామూహిక లైంగికదాడి, హత్య ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆవేదన వ్యక్తంచేశారు. కేసులోని నిందితులకు సత్వరమే కఠినశిక్ష విధించడానికి వీలుగా కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. శనివారం బాధితురాలి కుటుంబసభ్యులను గవర్నర్ పరామర్శించి వారికి ధైర్యంచెప్పారు. వ్యవస్థలో ఏదైనా లోపాలుంటే సరిదిద్దుకుని యువతులు, మహిళలకు పూర్తిరక్షణ కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఆమె ప్రభుత్వం తరపున భరోసా ఇచ్చారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి



చార్మినార్ వద్ద శంషాబాద్ మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం



# రాక్షసంపై ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి...

తీసుకొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. షాద్‌నగర్ ఏసీపీ సురేందర్, సీఐ శ్రీధర్‌కుమార్ నేతృత్వంలో పోలీసు బలగాలను మోహరించారు. పోలీసులు ఎంత నచ్చజెప్పినా ఆందోళనకారులు వినకపోవడంతో కొంత తోపులాట జరిగింది. స్వల్ప లాఠీచార్జీ చేయాల్సి వచ్చింది. ఆరుగంటలపాటు తీవ్రస్థాయిలో నిరసనలు తెలిపినా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు.

### ఉదయం 7 గంటల నుంచే విచారణ

వెటర్నరీ డాక్టర్ హత్య కేసు విచారణలో భాగంగా పోలీసులు శనివారం ఉదయం 7 గంటలకు నిందితులు మహ్మద్ అరీఫ్, శివ, నవీన్, చెన్నకేశవులను షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సైబరాబాద్ కమిషనర్ సూచన మేరకు నిందితులను ఐదు గంటలపాటు విచారించారు. అనంతరం షాద్‌నగర్ సర్కారు దవాఖాన ప్రధాన వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. షాద్‌నగర్ న్యాయస్థానం న్యాయమూర్తులు అందుబాటులో లేకపోవడంతో, మధ్యాహ్నం 3 గంటలకు ఫరూఖ్‌నగర్ తాసిల్దార్ పాండునాయక్, షాద్‌నగర్ కోర్టు సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. నిందితులను తాసిల్దార్ ముందు ప్రవేశపెట్టడంతో ఆయన వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. సాయంత్రం 4 గంటలకు భారీ బందోబస్తు మధ్య నిందితులను చర్లపల్లి జైలుకు తరలించారు. జైలు అధికారులు నిందితుల్లో ఆరిఫ్‌కు 1979, శివకు 1980, కేశవులుకు 1981, నవీన్‌కు 1982 ఖైదీ నంబర్లను కేటాయించి హై సెక్యూరిటీ బ్యారక్‌లో ఉంచారు. నిందితులను తీసుకువచ్చే క్రమంలో జైలు వద్ద కూడా విద్యార్థిసంఘాలు నిరసన తెలిపాయి.



నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ శనివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్దకు భారీగా తరలివచ్చిన ప్రజలు

### ముగ్గురు పోలీసులపై వేటు

వెటర్నరీ డాక్టర్ అదృశ్యం, హత్యోదంతంలో ముగ్గురు పోలీసులపై వేటుపడింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు, సకాలంలో స్పందించకపోవడం, ఎఫ్‌ఐఆర్ నమోదుచేయని కారణంగా శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ముగ్గురు పోలీసులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ శనివారం ఉత్తర్వులిచ్చారు. శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న ఎం రవికుమార్, ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుళ్లు పీ వేణుగోపాల్‌రెడ్డి, ఏ సత్యనారాయణగౌడ్‌ను సస్పెండ్ చేశారు. సైబరాబాద్ పరిధిలో పనిచేస్తున్న పోలీసులంతా అధికారపరిధితో సంబంధం లేకుండా ఫిర్యాదులు రాగానే స్వీకరించాలని, కేసులను నమోదుచేయాలని, ఎవరైనా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

### న్యాయపరమైన సేవలు అందించేది లేదు: బార్ అసోసియేషన్

వెటర్నరీ డాక్టర్ హత్య కేసు నిందితులకు షాద్‌నగర్ న్యాయస్థానంలో న్యాయపరమైన సేవలకు ఎలాంటి సహాయ సహకారాలు అందించబోమని షాద్‌నగర్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు నడికుడ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చెట్ల శంకర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు తెలిపారు. ఇలాంటి తరహా ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. నిందితులకు తెలంగాణ, ఏపీలోని జిల్లా బార్ అసోసియేషన్లలోని ఏ ఒక్క న్యాయవాది కూడా సహకరించవద్దని ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, పాలమూరు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి విజ్ఞప్తి చేశారు.

### ప్రముఖుల స్పందన

వెటర్నరీ డాక్టర్ హత్యోదంతంపై రాజకీయనాయకులు, సినీ ప్రముఖులు, మేధావులు, సామాన్యులు ఇలా అన్ని వర్గాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. హీరోయిన్ పూనమ్‌కౌర్ స్పందిస్తూ.. వెటర్నరీ డాక్టర్‌ను హత్యచేసినవారిని చంపి తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధమంటూ సోషల్‌మీడియాలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సినీనటి అనుష్క కూడా తీవ్రంగా స్పందించారు. బాధితురాలి కుటుంబానికి సానుభూతి తెలిపారు. వెటర్నరీ వైద్యురాలి ఘటన చాలా బాధాకరమని, వారి ఇంట్లో జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని సినీనటుడు అలీ అన్నారు. ఇంతటి ఘోరానికి పాల్పడినవాళ్లకు మానవ హక్కులు వర్తించబోవని వైఎస్సార్సీపీ నేత రోజా అన్నారు. తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, పట్టణ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు జరిగాయి. దేశరాజధానిలో పార్లమెంట్ గేటు వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న దుబే అనే యువతిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్, ఆ పార్టీ అనుబంధ సంఘాలు జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించాయి.

# బలవంతంగా తాగించాం

**మేము ఫోన్‌లు వాడలేదు.. లారీ నంబర్ రికార్డు కాలేదు**

- పోలీసులకు దొరకబోమనే ధీమా
- వాంగ్మూలంలో నిందితుల వెల్లడి
- చివరకు బాధితురాలితో ఆడిన అబద్ధమే పట్టించింది
- పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు!

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వెటర్నరీ వైద్యురాలిపై లైంగికదాడి సమయంలో కిరాతకులు బలవంతంగా ఆమెకు మద్యం తాగించినట్లు నలుగురు నిందితుల్లో ఒకరు పోలీసులకు తెలిపినట్టు సమాచారం. శనివారం ఉదయం నుంచి దాదాపు అయిదు గంటలపాటు నిందితులను విచారించిన పోలీసులకు దిగ్భ్రాంతికరమైన అంశాలు వెల్లడైనట్లు తెలిసింది. నిందితుల్లో ఒకరైన నవీన్ మినహా ఎవరూ ఫోన్లు వాడలేదని.. అందువల్ల తాము దొరికే అవకాశం లేదన్న ధీమాతో ఉన్నారని పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. అంతేకాకుండా లారీ చీకట్లో ఉన్నందున దాని నంబర్‌ను సీసీ కెమెరాలు రికార్డు చేయలేదని భావించారు. కానీ.. బాధితురాలితో స్కూటీ పంక్చర్ అయినట్లు చెప్పిన అబద్ధమే.. నిందితులను పట్టించింది. ఘాతుకానికి ఒడిగట్టిన బుధవారం మధ్యాహ్నం నుంచే నిందితులు మద్యంమత్తులో ఉన్నారని తేలింది. రెండు బాటిళ్లు మద్యాన్ని సేవించారని తెలిసింది. పోలీసులు ఘటనాస్థలం నుంచి ఒక పెద్ద, ఒక చిన్న మద్యం బాటిళ్లను సేకరించారు. దానికి సంబంధించిన బార్‌కోడ్ ఆధారంగా పోలీసులు తొండుపల్లి సమీపంలోని వైన్‌షాపును గుర్తించి అక్కడ సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. దాంట్లో ఈ నలుగురు ఇంపీరియల్ బ్లూ మద్యాన్ని కొన్నట్లు తేలింది. ఇప్పుడు అది కూడా ఒక సాక్ష్యంగా మారింది. దుండగులు బాధితురాలి మృతదేహాన్ని లారీ క్యాబిన్‌లో తీసుకువెళ్లడంతో క్లూస్ బృందం ఆ క్యాబిన్‌లో శాస్త్రీయంగా బాధితురాలి రక్తపు మరకలు, వెంట్రుకలను సేకరించింది.

### ఆ అబద్ధమే పట్టించింది

వెటర్నరీ డాక్టర్ స్కూటీలో గాలి తీసి టైర్ పంక్చర్ అయిందని చెప్పిన అబద్ధమే నిందితులను పోలీసులకు పట్టించింది. బుధవారం సాయంత్రం 6 గంటలకు టోల్‌ప్లాజా దగ్గర పార్క్‌చేసిన స్కూటీలో గాలి తీసేసిన నిందితులు.. బాధితురాలు తిరిగి వచ్చినప్పుడు పంక్చర్ అయిందని.. తాము చేయించి తెస్తామని తొండుపల్లి టోల్‌ప్లాజాకు సమీపంలో ఉన్న షంషీర్ పంక్చర్ షాపు వద్దకు వెళ్ళి గాలి కొట్టించుకొని వచ్చాడు. తన షాపునకు వచ్చిన వ్యక్తి ఎరుపురంగు చొక్కా వేసుకుని ఉన్నాడని గాలి కొట్టించుకుని టోల్‌ప్లాజా వైపు వెళ్ళాడని అతని షర్టు రంగును కారు వెలుతురులో చూశానని చెప్పడంతో పోలీసులు సీసీ కెమెరాల్లో అన్వేషించారు. ఆ గాలింపులో భాగంగా తొండుపల్లి టోల్‌ప్లాజా సర్వీస్‌రోడ్డులో ఓ లారీ కదలికలను గమనించారు. అక్కడ లారీనంబర్ స్పష్టంగా రాలేదు. ఆ లారీ తొండుపల్లి టోల్‌ప్లాజా వద్దకు చేరుకోవడానికి ప్రయాణించిన మార్గాన్ని ఉదయం సమయంలో రికార్డైన దృశ్యాలను జల్లెడ పట్టడంతో పోలీసులకు లారీ నంబర్ కనిపించింది. దాని ఆధారంగా యజమాని శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నిస్తే డ్రైవర్ ఆరిఫ్.. అతని ప్రవర్తన గురించి తెలిసింది. దీంతో 28వ తేదీ గురువారం రాత్రి నారాయణపేట్ జక్రేల్ గ్రామంలో ఆరిఫ్‌ను.. పోలీసులు అతని ఇంటికి వెళ్లి విచారించడంతో మొత్తం వ్యవహారం బయటపడింది. శాస్త్రీయంగా, సాంకేతికంగా చేసిన సైబరాబాద్ పోలీసుల దర్యాప్తు 24 గంటల్లోనే దుండగులను పట్టుకునేలా చేసింది. మరో 48 గంటలపాటుచేసిన దర్యాప్తులో నిందితులకు చట్టపరంగా ఉరిపడేలా పోలీసులు అభియోగాలను నమోదుచేయడంతోపాటు వాటిని రుజువు చేసే సాక్ష్యాధారాలను పటిష్ఠంగా సేకరించారు. వెటర్నరీ వైద్యురాలు ఆ సమయంలో నాలుగు అడుగులు ముందుకువేసి ఉంటే ఈ ఘటన జరిగేదికాదని నిందితులు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పినట్లు తెలిసింది. ఆమె హెల్ప్.. హెల్ప్.. అని అరిచిందని.. కానీ ఆమెలోని భయం ఆ గొంతును గట్టిగా బయటికి రానివ్వకుండా చేసిందని.. లేదంటే తాము అప్పుడే దొరికిపోయేవాళ్లమని స్వయంగా దుండగులు పోలీసులకు వివరించారు. తన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్ళిపోతారనే భయపడి అక్కడే ఉండిపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.

# మానవత్వంతో స్పందించాలి

- కేసు నమోదు, దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన అధికారులపై విచారణకు ఆదేశించాం
- జాతీయ మహిళాకమిషన్ సభ్యురాలు కుందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫిర్యాదుచేసేందుకు వచ్చేవారిపట్ల పోలీసులు మానవీయకోణంలో స్పందించాలని జాతీయ మహిళాకమిషన్ సభ్యురాలు శ్యామల ఎస్ కుందర్ సూచించారు. శంషాబాద్ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులపై దర్యాప్తుచేసి తగిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించినట్టు తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కమిషన్ సభ్యురాలు శ్యామల ఎస్ కుందర్.. శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం టూరిస్టు ప్లాజా హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పెట్రోకార్ సిబ్బందితోపాటు ఫిర్యాదు నమోదు, దర్యాప్తు విషయంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన పోలీసు సిబ్బందిపైనా విచారణకు ఆదేశించినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వానికి సూచిస్తామని తెలిపారు.

### మంత్రుల పరామర్శలు

**శంషాబాద్:** శంషాబాద్ తొండుపల్లిలో సామూహిక లైంగికదాడి, హత్యకు గురైన యువడాక్టర్ కుటుంబసభ్యులను పలువురు శనివారం పరామర్శించారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి బాధితురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బ్రిటిష్‌కాలం నాటి ఐపీసీ, సీఆర్పీసీ చట్టాల మార్పుకు మూడురోజుల్లో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. హైకోర్టులో స్టే తెచ్చుకోవడం, శిక్ష పడకుండా తప్పించుకొనే అవకాశాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో చట్టాలను కఠినతరం చేసేలా మార్పుకు కృషిచేస్తామని చెప్పారు. రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, గీతారెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, బీజేపీ నేత లక్ష్మణ్, సినీనటుడు అలీ తదితరులు పరామర్శించారు. వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్ అన్నారు.

### చిలుకూరు బాలాజీ దర్శనం నిలిపివేత

**మొయినాబాద్:** షాద్‌నగర్‌లో వైద్యురాలి హత్యకు నిరసనగా శనివారం చిలుకూరు బాలాజీ ఆలయంలో కొద్దిసేపు భక్తులకు దర్శనం నిలిపివేశారు. ఆలయం చుట్టూ భక్తులతో ఒక మహాప్రగాఢ ప్రదక్షిణ చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించాలని స్వామివారిని ఆలయ అర్చకుడు రంగరాజన్, భక్తులు మొక్కుకున్నారు.



హైదరాబాద్‌లో యువతిపై లైంగికదాడి, హత్యకు నిరసనగా ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్‌లో రోడ్డు పక్కన ధర్నాకు దిగిన యువతిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం.

# నిందితుల గ్రామాల్లో నిరసనలు

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ర్యాలీలు



ప్రధాన నిందితుడి స్వగ్రామం నారాయణపేట జిల్లా జక్లేర్‌లో విద్యార్థుల ఆందోళన

**నారాయణపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** శంషాబాద్‌లో యువతి హత్యకేసులోని నిందితుల స్వగ్రామాల్లో శనివారం నిరసనలు వెల్లువెత్తాయి. ప్రధాన నిందితుడు అహ్మద్‌పాషా గ్రామమైన నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని జక్లేర్‌లో, మరో నిందితుడు చెన్నకేశవులు స్వగ్రామమైన గుడిగండ్లలో విద్యార్థులు, పలు సంఘాల ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. తమ గ్రామాలకు కళంకం తెచ్చేలా వ్యవహరించిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. తమ కుమారులు ఘోరమైన నేరానికి పాల్పడ్డారని, వారిని కఠినంగా శిక్షించాలని నిందితుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శంషాబాద్‌తోపాటు షాద్‌నగర్, షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, యాచారం, హఫీజ్‌పేట, రాజేంద్రనగర్, మణికొండ, తుక్కుగూడ తదితర ప్రాంతాల్లో పలు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. నిందితులను ఉరితీయాలని ముక్తకంఠంతో నినదించారు. మృతురాలి ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థనలు చేశారు. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు క్యాండిల్ ర్యాలీ చేపట్టారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.33 గంటలకు

సూర్యాస్తమయం: 5.32 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం పంచమి రాత్రి 7.14 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉదయం 9.41 వరకు, తదుపరి శ్రవణం, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: సాయంత్రం 4.08 నుంచి 5.32 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.04 నుంచి 4.48 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.01 నుంచి 3.45 వరకు.

**లోకం పోకడ**



మీ వైవాహిక జీవితంలో ప్రేమ ఈ మొక్కలా చిగురించి, పూలు, పళ్ళలాంటి సంతానంతో మీ సంసారం పచ్చగా వుండాలని కోరుకుంటున్నాను!

# ఇదీ ఆర్టీసీ వాస్తవ స్థితి

మొదటిపేజీ తరువాయి...

మొత్తం రూ.4,239.95 కోట్ల ఆర్థికసాయాన్ని పొందింది.

### వెంటనే పరిష్కరించాల్సినవి..

ఈ ఏడాది డిసెంబర్ 17 నాటికి టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు రూ.200 కోట్లు చెల్లించాలని హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు జారీచేసింది. ప్రావిడెంట్ ఫండ్‌లో ఉద్యోగుల వాటాకు సంబంధించి కనీసం రూ.332.31 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని పీఎఫ్ అధికారులు ఆదేశించారు. దీని ప్రకారం.. యాజమాన్య వాటా కింద రూ.455.99 కోట్లు చెల్లించాల్సిన టీఎస్‌ఆర్టీసీ.. పీఎఫ్‌కు మొత్తం రూ.788.30 కోట్లు చెల్లించాల్సి ఉన్నది.

### ఒక్కో బస్సుకు 5.30 మంది ఉద్యోగులు

టీఎస్‌ఆర్టీసీలో 18,432 మంది డ్రైవర్లు, 20,217 మంది కండక్టర్లు, 5,745 మంది గ్యారేజ్ స్టాఫ్, 987 మంది సూపర్‌వైజర్లు, 293 అధికారులు, 4,059 మంది ఇతరులు కలిపి మొత్తం 49,733 మంది సిబ్బంది ఉన్నారు. మొత్తం ఉద్యోగుల్లో డ్రైవర్లు, కండక్టర్లు కలిపి 77.11 శాతం ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు లెక్కల ప్రకారం ఒక్కో బస్సుకు ఉద్యోగుల నిష్పత్తి 5.30గా ఉన్నది. మొత్తం సిబ్బందిలో 41 నుంచి 55 ఏండ్ల వయస్సువారు 21,638 మంది ఉన్నారు.

| | |
|---|---|
| రుణాలు | రూ.2,209.66 కోట్లు |
| బకాయిలు | రూ.2,113.48 కోట్లు |
| వడ్డీ చెల్లింపులు | రూ.390.82 కోట్లు |
| బాండ్ల చెల్లింపులు | రూ.280.00 కోట్లు |
| **మొత్తం** | **రూ.4,993.96 కోట్లు** |

# సిద్దులగుట్టలో మహిళది ఆత్మహత్యే!

**ధూల్‌పేటకు చెందిన గృహిణిగా గుర్తింపు**



**అబిడ్స్, నమస్తే తెలంగాణ:** శంషాబాద్ సిద్దులగుట్టలో కాలిబూడిదైన మహిళది ఆత్మహత్యేనని పోలీసులు భావిస్తున్నారు. మతిస్థిమితం సరిగాలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. చనిపోయిన మహిళను ధూల్‌పేటలోని బంగ్లాదేశ్ ప్రాంతానికి చెందిన కవితా బాయి (35)గా గుర్తించారు. కవితాబాయికి భర్త సంతోష్‌సింగ్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమెకు మతిస్థిమితం సరిగాలేకపోవడంతో మూడేండ్ల నుంచి వైద్యం అందిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఆమె శుక్రవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లే ముందు పిల్లలు, భర్త వద్దని వారించినా.. ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిందని పేర్కొన్నారు. గతంలోనూ పలుమార్లు ఆమె చెప్పాపెట్టకుండా ఇంటినుంచి బయల్దేరి తిరిగి రెండు గంటల్లో ఇంటికి వచ్చేదని చెప్పారు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె.. సిద్దులగుట్టలో శవమై కనిపించిందని తెలిపారు. ఉస్మానియాలో కవితబాయి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తికాగానే, పోలీసులు మృతదేహాన్ని ధూల్‌పేటకు రాకుండా నేరుగా పురానాపూల్ శ్మశానవాటికకు తరలించినట్టు బంధువులు ఆరోపిస్తున్నారు.

# నాకు తుపాకి లైసెన్స్ కావాలి!

వరంగల్ సీపీకి ఓ ఉద్యోగిని దరఖాస్తు

**వరంగల్ క్రైం:** దేశంలో, రాష్ట్రంలో నిత్యం ఏదో ఒకచోట మహిళలపై జరుగుతున్న లైంగికదాడులు, హత్యల నేపథ్యంలో ఆందోళనకు గురైన ఓ మహిళాఉద్యోగి ఆయుధం ఉంటే అడ్డుకోవచ్చనే ఆలోచనతో తుపాకి లైసెన్స్ కోసం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో శనివారం రాత్రి దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్‌లో వెటర్నరీ డాక్టర్‌తోపాటు హన్మకొండలో ఇటీవల ఓ యువతిపై జరిగిన లైంగికదాడులు, హత్యల నేపథ్యంలో తనను తాను రక్షించుకోవడానికి తుపాకి కావాలని సీపీకి విన్నవించారు. ఇటీవల ఓ యువతి శవమై కనిపించిన వరంగల్ హంటర్‌రోడ్డులో నివాసముండే సదరు మహిళాఉద్యోగి ఖమ్మంలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కలవరపడిన ఆమె తుపాకి ఉంటే ఇబ్బందులులేకుండా రాకపోకలు సాగించవచ్చని, దయచేసి తుపాకి లైసెన్స్‌కు అనుమతి ఇవ్వాలని దరఖాస్తులో పేర్కొన్నారు. ఈ విషయంపై సీపీ రవీందర్‌ను వివరణ కోరగా.. తుపాకి లైసెన్స్ కావాలని కమిషనరేట్‌లోని సిబ్బందికి మహిళ దరఖాస్తు చేసుకున్న మాట వాస్తవమేనని చెప్పారు.

# నేడు ఆర్టీసీ కార్మికులతో సీఎం ఆత్మీయ సమావేశం

మొదటిపేజీ తరువాయి...

సూచనలు తీసుకోనున్నారు. దీంతోపాటు ఆర్టీసీ స్థితిగతులపై తెలుగులో రూపొందించిన నివేదికను కార్మికులకు అందజేయనున్నారు. కార్మికులతోపాటు ఈడీలు, ఆర్‌ఎంలు, డీఎంలు ఇతర ఉన్నతాధికారులు కలిపి మొత్తం 750 మందికిపైగా ఆత్మీయ సమావేశంలో పాల్గొననున్నట్టు తెలుస్తున్నది.

### కార్మికుల్లో ఉత్కంఠ

ఆత్మీయ సమావేశంపై ఆర్టీసీ కార్మికుల్లో ఉత్కంఠ మొదలైంది. ఆర్టీసీ భవిష్యత్తుపై సీఎం కేసీఆర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు? సంస్థను లాభాలబాట పట్టించేందుకు ఎలాంటి ప్రణాళిక అమలుచేస్తారు? అన్న ప్రశ్నలు కార్మికుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. సీఎంను కలిసేందుకు ఆహ్వానం అందిన కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ తమ పట్ల ప్రత్యేక శ్రద్ధచూపడమే కాకుండా ఏకంగా ప్రగతిభవన్‌కు పిలవటం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమంటున్నారు. సమ్మె వల్ల తీవ్రంగా నష్టపోయామని, సంస్థలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను సీఎం కేసీఆర్‌కు వివరించేందుకు మంచి అవకాశం లభించిందని చెప్తున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం గురించి ఆలోచించే సీఎం ఉండటం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు.

### ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ భేటీ

**ఆర్టీసీ** కార్మికులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్న సీఎం కేసీఆర్.. శనివారం ప్రగతిభవన్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం జరిగే ఆత్మీయ సమావేశంలో ఎలాంటి చర్చ చేయాలి? ప్రభుత్వంతోపాటు ఆర్టీసీ అధికారుల నుంచి కార్మికులు ఆశిస్తున్నదేమిటి? కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలేమిటి? అనే అంశాలపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్ శర్మ, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులు, సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రోడ్లు బాగుపడాలి

- సీఎం కేసీఆర్ లక్ష్యం మేరకు పనిచేయాలి
- ఆర్అండ్బీ అధికారులతో సమీక్షలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- రూ.571 కోట్లు మంజూరుపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని రోడ్లు, భవనాలశాఖ కేంద్రకార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని రహదారులు బాగుపడాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఏ శాఖకు ఇవ్వని అదనపు బడ్జెట్‌ను ఆర్అండ్‌బీకి ఇచ్చారని, ఆయన లక్ష్యం మేరకు అధికారులు పనిచేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. శనివారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని రోడ్లు, భవనాలశాఖ కేంద్ర కార్యాలయంలో ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో రూ.571 కోట్లు మంజూరుచేసినందుకు ఆర్అండ్‌బీ శాఖ, రాష్ట్ర ప్రజల తరపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.571 కోట్లతో 1500 కి.మీ. వరకు రోడ్ల మరమ్మతులు చేసుకోవచ్చని, బాగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. టెండర్ ప్రకారమే పనులు అప్పగించాలని, వర్కింగ్ సీజన్ అయినందున పనులు త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. మంత్రులు, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో జిల్లాల్లో పర్యటించి పనులను పరిశీలిస్తానని తెలిపారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థతో మాట్లాడి ఆ రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయన ఆదేశించారు.

**మేడారం రోడ్ల పనులు పూర్తిచేయాలి**

మేడారం జాతర దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా డిసెంబర్ చివరికల్లా రోడ్ల పనులు పూర్తిచేయాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారి వయా వంగపల్లి, ఆలేరు, జనగామ, వరంగల్ వెళ్లే దారిని నాలుగు బైపాస్‌లు పూర్తిచేసి.. పట్టణ కేంద్రాల్లోనూ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. మేడారం జాతర కోసం నర్సంపేట, మహబూబాబాద్ రోడ్, ములుగు రోడ్, వరంగల్ రోడ్, మహదేవపూర్–కాటారం–భూపాలపల్లి రోడ్ల మరమ్మతులు డిసెంబర్ చివరికల్లా పూర్తిచేయాలని పేర్కొన్నారు. సంగారెడ్డి– నాందేడ్ రోడ్‌లో సంగారెడ్డి నుంచి ఆందోల్ వరకు పాడైన రోడ్ల మరమ్మతు చేయాలని జాతీయ రహదారుల అథారిటీకి చెందిన కృష్ణప్రసాద్‌కు మంత్రి సూచించారు. జాతీయ రహదారుల్లో మన రాష్ట్రం ఆధ్వర్యంలోని కరీంనగర్– వరంగల్– ఖమ్మం రోడ్ల మరమ్మతుల పనులు జరుగుతున్నాయని, వీటిని ఈ నెలాఖరుకల్లా పూర్తిచేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, కృష్ణప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కపిల్ చిట్స్ మీ వెంట
ఆనందం మీ ఇంట
KAPIL GROUP
39 YEARS Safeguarding Trust
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం

## వాణిజ్య పన్నులశాఖ కమిషనర్‌గా నీతూకుమారి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ కమిషనర్‌గా నీతూకుమారి ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఈ పోస్టులో ఉన్న వీ అనిల్‌కుమార్ శనివారం పదవీ విరమణచేశారు. గతంలో కరీంనగర్ కలెక్టర్‌గా, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం పోస్టింగ్ కోసం వేచిచూస్తున్న నీతూకుమారికి ఈ బాధ్యతలు అప్పగించారు. దీంతోపాటు దేవాదాయశాఖ కార్యదర్శి, కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

## ఏ పోస్టును వదులుకుంటారో చెప్పండి

- రెండు ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెండు ఉద్యోగాలకు ఎంపికయిన అభ్యర్థులు ఒక పోస్టును ఎంపిక చేసుకొనేందుకు టీఎస్‌పీఎస్సీ అవకాశం కల్పించింది. గిరిజన, బీసీ సంక్షేమశాఖల్లో వసతిగృహ అధికారుల (గ్రేడ్–2) పోస్టులకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులు ఏ పోస్టును వదులుకుంటారనేది (రిలింక్విష్‌మెంట్) వెబ్ లింక్ ద్వారా తెలుపాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రెండుశాఖల్లోని పోస్టులకు గత ఏడాది నోటిఫికేషన్ జారీచేశారు. పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

## డిప్యుటేషన్‌లో ఉన్న ఉద్యోగులకు ఆన్‌డ్యూటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో డీఆర్డీఏ, డ్వామాతోపాటు పంచాయతీరాజ్ సంస్థల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులను ఇక నుంచి ఆన్‌డ్యూటీ (ఓడీ)గా పరిగణిస్తామని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ మేరకు శనివారం పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా, మండల పరిషత్ పరిధిలోని ఉద్యోగులు పలువురు డిప్యుటేషన్‌పై గ్రామీణాభివృద్ధి, డ్వామాతోపాటు పంచాయతీరాజ్ సంస్థల్లో పనిచేస్తున్నారు.

Ph.No. 040-27037266
E-Mail: atiepihyderabad@nic.in
Fax No. 040-27038982
Web: atiepihyderabad.gov.in


GOVERNMENT OF INDIA
MINISTRY OF SKILL DEVELOPMENT AND
ENTREPRENEURSHIP DIRECTORATE GENERAL OF TRAINING
NATIONAL SKILL TRAINING INSTITUTE
RAMANTHAPUR: HYDERABAD – 500 013.

NSTI – Ramanthapur, Hyderabad is going to recruit **04 Junior Consultants** on contract basis initially for a period of 06 months in the following disciplines. The eligible Indian nationals are requested to submit their application or bio data with all supporting documents to the DIRECTOR, RDSDE, NSTI – RAMANTHAPUR CAMPUS, HYDERABAD – 500 013.
Educational Qualifications :Diploma in Engineering (ECE/IT/CSE & BIOMEDICAL) With CITS OR Eqivalent Degree With 5 Years Of Teaching Or industrial experience in the relevant fields
OR
B.E / B.Tech (ECE/IT/CSE & BIO MEDICAL) or equivalent with 2 years of experience in the relevant fields.
Age limit: Less than 30 years on closing date. Age relaxation would be applicable as per Government of India Rules.
Remuneration: Consolidated Amount of Rs. 30,000/- P.M.
Mode of Selection: Written Test, Skill Test And Interview
NOTE 1: Candidates who have completed CITS in the concerned trades will be given the preference
2: Selected Candidates need to excute a Contract agreement on stamp paper of Rs. 100/- duly Notarized.
Last Date for submitting the application: 11.12.2019 By 5:00 P.M.


భాషా, సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
మరియు
ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
శ్రీమతి జె. ఈశ్వరీబాయి జయంతి ఉత్సవం
మరియు
ఈశ్వరీబాయి మెమోరియల్ అవార్డు - 2019 ప్రదానోత్సవం

స్వర్గీయ శ్రీమతి జె. ఈశ్వరీబాయి గారు
1.12.1918 - 24.02.1991
జస్టీస్ శ్రీ కె. జి. బాలక్రిష్ణన్ గారికి
మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీం కోర్టు మరియు మాజీ ఛైర్ పర్సన్, జాతీయ మానవ హక్కుల కమిషన్
తేది: 1, డిసెంబర్, 2019 సాయంత్రం గం॥ 5.30 ని॥లకు
వేదిక: రవీంద్ర భారతి, హైదరాబాద్

ముఖ్య అతిథి
శ్రీ బండారు దత్తాత్రేయ గారు
గౌ॥ గవర్నర్, హిమాచల్ ప్రదేశ్
జ్యోతి ప్రజ్వలన
శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ గారు
పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ & ప్రొహిబిషన్, క్రీడలు & యువజన సేవలు, పురావస్తు శాఖామాత్యులు, తెలంగాణ ప్రభుత్వం
గౌరవ అతిథులు
శ్రీ మహమ్మద్ మహమూద్ అలి గారు
హోం, జైళ్ళు, అగ్నిమాపక సేవల శాఖామాత్యులు, తెలంగాణ ప్రభుత్వం
శ్రీ కొప్పుల ఈశ్వర్ గారు
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం & సీనియర్ సిటిజన్స్ సంక్షేమం శాఖా మాత్యులు, తెలంగాణ ప్రభుత్వం
సభాధ్యక్షులు
శ్రీ డా. కె.వి. రమణాచారి గారు ఐఏఎస్ (రి)
ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ ప్రభుత్వం
ప్రత్యేక అతిథులు
శ్రీ బొంతు రామ్మోహన్ గారు
మేయర్, హైదరాబాద్
శ్రీ సి. పార్థసారథి గారు ఐఏఎస్
సెక్రటరీ YAT&C, తెలంగాణ ప్రభుత్వం
ఉదయం 9 గంటలకు
వెస్ట్ మారెడుపల్లి, సికింద్రాబాదులో గల ఈశ్వరీబాయి విగ్రహానికి పుష్పాలంకరణ
ఆహ్వానించువారు
శ్రీ మామిడి హరిక్రిష్ణ గారు
డైరెక్టర్, భాషా, సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
శ్రీమతి డా. జె గీతా రెడ్డి గారు
ఛైర్‌పర్సన్
ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్
తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు
డాక్యుమెంటరీ ఫిలిం ప్రదర్శన
అందరూ ఆహ్వానితులే
జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

సబ్‌కా విశ్వాస్ (పూర్వ పన్నుల వివాద పరిష్కారం) పథకము, 2019
సెంట్రల్ ఎక్సయిజ్ మరియు సేవా పన్నుల కొరకు
www.cbic.gov.in
ఈ పథకము యొక్క లాభాలు
ఈ పథకము ది. 31-12-2019 వరకు మాత్రమే
ఒక నూతన ఆరంభానికి నాంది పలకండి!
వ్యాజ్యము, విచారణ మరియు పరిశోధనల పెండింగ్‌లో వున్న కేసులు:
(ఎ) పన్ను బకాయి రూ. 50 లక్షల వరకు : పన్ను బకాయిలో 30% మాత్రమే చెల్లించండి.
(బి) పన్ను బకాయి రూ. 50 లక్షల పైబడి వున్నట్లయితే : పన్ను బకాయిలో 50% మాత్రమే చెల్లించండి.
పన్ను బకాయిల విషయములలో:
(ఎ) పన్ను బకాయి రూ. 50 లక్షల వరకు : పన్ను బకాయిలో 40% మాత్రమే చెల్లించండి.
(బి) పన్ను బకాయి రూ. 50 లక్షల పైబడి వున్నట్లయితే : పన్ను బకాయిలో 60% మాత్రమే చెల్లించండి.
మీరు గత బకాయిలను స్వచ్ఛందంగా వెల్లడించినట్లయితే :
అప్పుడు 100% డ్యూటీ మొత్తాన్ని మాత్రమే చెల్లించండి.
వడ్డీ, అపరాధ రుసుము, జరిమానా పూర్తిగా మాఫీ మరియు నేర విచారణ నుండి పూర్తి రక్షణ
సందేహాల నివృత్తికి మా ఫోన్ నెంబర్ : 7901243196

ఆర్థిక మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వము
జారీచేయువారు : మేడ్చల్ జీఎస్‌టి కమీషనరేట్, హైదరాబాద్
పాత ట్యాక్స్ బకాయిల పరిష్కారానికి సువర్ణావకాశం.
ఈ పథకము వివరముల కొరకు www.cbic-gst.gov.in

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం 1 డిసెంబర్ 2019
WWW.NTNEWS.COM

# బీజేపీ గుట్టు రట్టవుతుందా?

విశ్లేషణ



సిద్ధార్థ్ వరదరాజన్

ప్రధాని మోదీ, హోం మంత్రి చేతలపై వెలుగు ప్రసరించగలిగితే అమిత్ షా శివసేన-ఎన్సీపీ-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ఏర్పడటం భారత రాజకీయాల్లో మూల మలుపు. వీరిరువురు ఎన్నో తప్పిదాలు చేసిన క్రమంలో నిర్లక్ష్యంగా ఒక పెద్ద పొరపాటు చేశారు. మహారాష్ట్ర రాజకీయాల కోసం వారు రాష్ట్రపతిని వినియోగించుకున్నారు. క్యాబినెట్‌ను వాడుకున్నారు. అవినీతి కేసులను కూడా ఉపయోగించుకున్నారు. మీడియాను కూడా సాధనంగా వాడుకున్నారు. దొంగచాటుగా జరిగిన ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం ప్రసారాన్ని దూరదర్శన్‌కు కాకుండా ఎఎన్ఐ వార్తాసంస్థకు అప్పగించారు. కానీ ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని చూసుకోవాలనేది మరిచిపోయారు.

ఈ ఆధునిక చాణక్యులు మొత్తం రాజనీతిశాస్త్రం, ద్రవ్య ఆర్థికశాస్త్రం, చట్టం, ప్లాస్టిక్‌సర్జరీ, జ్యోతిశ్శాస్త్రం మొదలైన వాటిలో నిష్ణాతులు కావచ్చు. ఆర్యభట్ట వారసులుగా చెప్పుకున్నప్పటికీ, వారికి గణితశాస్త్రం ఒంటబట్టినట్టు లేదు. కానీ రసవత్తర నాటకం పేలవంగా ముగిసింది. 24 గంటల్లో అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోవాలని ఆదేశించినప్పుడు ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. తనకు మెజారిటీ లేదని ఆయనకు ముందే తెలుసు. ఎన్సీపీ, కాంగ్రెస్‌తో కూడిన కూటమి తరఫున శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మోదీ షా ఎక్కడ పొరపాటు పడ్డారు. మహారాష్ట్ర పరిణామాలు బీజేపీకి, ప్రతిపక్షానికే కాదు, ప్రజాస్వామ్యం నిలవాలని కోరుకునే వారందరికి ఈ పరిణామాలు గుణపాఠాల వంటివి. దేశ రాజకీయాల్లో మహారాష్ట్ర పరిణామం మూల మలుపు వంటిది.

దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సందర్భంగా మాట్లాడుతూ శివనసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ అవకాశవాద పొత్తు పెట్టుకున్నాయని విమర్శించారు. కానీ బీజేపీని వ్యతిరేకించేవారు మాత్రం ఫడ్నవీస్ శివసేనతో బెడిసికొట్టిన తర్వాత ఎన్సీపీతో పొత్తు పెట్టుకొని ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి ప్రయత్నించారని గుర్తుచేస్తున్నారు. ఏ పార్టీపై పోటీచేశారో ఆ పార్టీతోనే పొత్తు పెట్టుకోవడమేమిటి? ఏ పార్టీకి మెజారిటీ రాకుండా హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు ఇటువంటి కూటములు ఏర్పాటుకావడం సాధారణమే. అటువంటి కూటములు ఏర్పాటుకావాలె కూడా. అయితే ఈ కూటమి ఎటువంటిదై ఉంటుందనేదే ప్రధానం. భిన్న సిద్ధాంతాలు గల పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కూటమిగా ఏర్పడటం చాలా కష్టం. చర్చలు జరుపడానికి కొన్ని వారాలు పట్టవచ్చు. 2017 ఎన్నికల తర్వాత జర్మనీలో కూటమి కట్టడం ఎంత కష్టమంది! మహారాష్ట్రలో నాలుగు పెద్ద పార్టీలు ఆవిర్భవించాయి. దేనికీ మెజారిటీ లేదు. అటువంటప్పుడు కూటమి ఏర్పాటు తప్పనిసరి.

మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేన, కాంగ్రెస్ పార్టీలను ఏకతాటిపైకి తేవడానికి శరద్ పవార్ చాలా కష్టపడ్డారు. అయితే ఆయన ఈ ప్రయత్నాలను బహిరంగంగా చేశారే తప్ప రహస్యంగా కాదు. వైరుధ్యాలతో కూడిన పార్టీలు ఏకం కావడాన్ని కొందరు నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ఈ పార్టీలు కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసుకున్నాయి. ఆయా పార్టీల సొంత ఎజెండాలతో పాటు మహారాష్ట్ర ప్రజలకు అవసరమైన ఉమ్మడి ప్రణాళిక అందులో ఉన్నది. కానీ నరేంద్ర మోదీ, అమిత్ షా వ్యవహారసరళి ఇందుకు భిన్నంగా సాగింది. వారు చేసిన ప్రయత్నాలన్నీ రహస్యమైనవే. వారు ఎన్సీపీ నాయకులతో, ప్రత్యేకించి శరద్ పవార్‌తో బహిరంగంగా చర్చలకు రావలిసింది. 2014లో ఎన్సీపీ బీజేపీకి మద్దతు ప్రకటించలేదా! ఎన్సీపీతో ఉమ్మడి కార్యక్రమంపై చర్చించవలసింది. 2015లో బీజేపీ పీడీపీతో పొత్తు పెట్టుకున్నప్పుడు చర్చించినట్టే ఇప్పుడు కూడా చేయాల్సింది. కానీ మోదీ, షా ఆ విధంగా వ్యవహరించాలని అనుకోలేదు. అజిత్ పవార్ తమ పార్టీని, కుటుంబ సంబంధాలను తెంపుకొని ఫడ్నవీస్‌కు మద్దతు ఇవ్వడానికి ఎటువంటి బెదిరింపులు, ఒత్తిడులు వచ్చాయో దేవుడికే తెలువాలె. ఆయనపై ఉన్న అవినీతి కేసులను ఉపయోగించి ఉంటారు. ఫడ్నవీస్‌కు ఎన్సీపీ మద్దతు ఇస్తున్నట్టుగా ఉండే పత్రాలను అజిత్ పవార్ లోపాయికారిగా సంపాదించాడు. పత్రాలు ఇచ్చినంత మాత్రాన మద్దతు రాదని ఆయనకు తెలిసే ఉంటుంది. కానీ రెండువారాల గడువులోగా ఎమ్మెల్యేలను జమచేస్తామని బీజేపీ నాయకులు ధీమాగా చెప్పి ఉంటారు. చివరకు శరద్‌పవార్ చతురత, సంప్రదాయాన్ని కాదనడానికి సుప్రీంకోర్టు విముఖత మూలంగా ఈ మహారాష్ట్రలో సాగిన కుట్ర సాగలేదు. ఇప్పుడు మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ ప్రభుత్వం ఏర్పడ్డది. ఈ కూటమి సంకీర్ణ ధర్మం ప్రకారం నడుచుకోవలసి ఉన్నది.

మహారాష్ట్ర అధికార కూటమి ఏదోవిధంగా కూలిపోతుందని మోదీ- అమిత్ షా ఆశపడుతున్నారు. వారిలో విభేదాలు తలెత్తి కూలిపోవచ్చుననేది ఒక ఆశ. బీజేపీ వారిలో ముసలం పుట్టించి తమవైపు కొందరిని ఆకర్షించుకునే ప్రయత్నం చేయవచ్చు. కర్ణాటకలో మాదిరిగా సీబీఐ, ఈడీ వంటి సంస్థల చేత బెదిరింపులకు, వేధింపులకు పాల్పడి కూల్చివేయవచ్చు. తక్షణ అధికార కాంక్షను తీర్చుకోవడానికే శివసేన ఎన్డీయే నుంచి బయటకువచ్చిందనేది తెలిసిందే. కానీ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడున్న కూటమి నుంచి కూడా వైదొలగవచ్చు. ఒక అభిప్రాయం ప్రకారం.. శివసేన రెండు పులుల మీద సవారీ చేస్తున్నది. హిందువాదం, మహారాష్ట్ర ప్రాంతీయవాదం. హిందుత్వ వల్ల వచ్చే ప్రయోజనాలు తీరాయి. ట్రిపుల్ తలాఖ్, అయోధ్య, 370 అధికరణం వల్ల ఇక రాజకీయ ప్రయోజనాలుండవు. ఇంకా ఒకటీ అర నినాదాలు ఉండవచ్చు. కానీ అవి ఉపయోగకరమైనవి కావు. ఇక రెండవ అంశం. బీజేపీ తనను నిర్మూలించదలుచుకున్నదనేది శివసేనకు తెలుసు. ఈ లక్ష్యం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది. ఇక డ్రైవర్ సీట్లో కూర్చుంటే తప్ప తననుతాను రక్షించుకోలేదని భావించింది. బీజేపీతో తెగతెంపులు చేసుకుంటే ఫలితాలు ఎట్లా ఉంటాయోననే భయం శివసేనకు ఉండేది. కానీ అధికారం చేజిక్కించుకోవడానికి బీజేపీ గవర్నర్‌నే కాదు, రాష్ట్రపతి పదవిని ఉపయోగించుకున్న తీరు గమనించిన తర్వాత ఇక శివసేన వెనక్కుపోయే అవకాశం లేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ మహావికాస్ అఘాడీ కలిసి పోటీ చేస్తుందని భావించవచ్చు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గనుక ఓడిపోకపోతే భయానకంగా ప్రతీకారం తీర్చుకుంటుందనేది శివసేనకు తెలుసు. మోదీ-షా చావోరేవో అనే పరిస్థితిని సృష్టించారు కనుకనే శివసేనతో పాటు ఇతరపక్షాలు ఏకతాటిపైకి వచ్చాయి.

> ఎన్డీయే భాగస్వామిగా శివసేన ముఖ్యమంత్రి పదవి చేపట్టడాన్ని అమిత్ షా ఎందుకంత బలంగా వ్యతిరేకిస్తున్నారనేది ఆలోచించవలసిన విషయం. ఉద్ధవ్ ఠాక్రే కీలకమైన రహస్యాలు తెలుసుకునే అవకాశం ఉందని భయపడుతున్నారా? న్యాయమూర్తి బి.హెచ్.లోయ అనుమానాస్పద మరణం విషయంలో ఫడ్నవీస్ ప్రభుత్వం పోలీసులను కిందిస్థాయి న్యాయస్థానాన్ని ఉపయోగించుకున్నదనే అనుమానాలున్నాయి. దీనిని శివసేన 2018 జనవరిలో లేవనెత్తింది. సొహ్రాబుద్దీన్ కేసు ఉండనే ఉన్నది. సమాచార హక్కు ఉద్యమకారుడు సతీష్ శెట్టి హత్య కేసు ఒకటి వివాదాస్పదమైంది. హిందుత్వ పేర సాగిస్తున్న కొన్ని ఉగ్రవాద కార్యకలాపాలకు శివసేనతో సంబంధం లేదు. కానీ కొన్ని మత సంస్థలతో వాటికి సంబంధం ఉన్నది. పీఎంసీ బ్యాంక్ కుంభకోణాన్ని బీజేపీ కప్పిపెడుతున్నది.

ఎన్డీయే భాగస్వామిగా శివసేన ముఖ్యమంత్రి పదవి చేపట్టడాన్ని అమిత్ షా ఎందుకంత బలంగా వ్యతిరేకిస్తున్నారనేది ఆలోచించవలసిన విషయం. ఉద్ధవ్ ఠాక్రే కీలకమైన రహస్యాలు తెలుసుకునే అవకాశం ఉందని భయపడుతున్నారా? న్యాయమూర్తి బి.హెచ్.లోయ అనుమానాస్పద మరణం విషయంలో ఫడ్నవీస్ ప్రభుత్వం పోలీసులను కిందిస్థాయి న్యాయస్థానాన్ని ఉపయోగించుకున్నదనే అనుమానాలున్నాయి. దీనిని శివసేన 2018 జనవరిలో లేవనెత్తింది. సొహ్రాబుద్దీన్ కేసు ఉండనే ఉన్నది. సమాచార హక్కు ఉద్యమకారుడు సతీష్ శెట్టి హత్య కేసు ఒకటి వివాదాస్పదమైంది. హిందుత్వ పేర సాగిస్తున్న కొన్ని ఉగ్రవాద కార్యకలాపాలకు శివసేనతో సంబంధం లేదు. కానీ కొన్ని మత సంస్థలతో వాటికి సంబంధం ఉన్నది. పీఎంసీ బ్యాంక్ కుంభకోణాన్ని బీజేపీ కప్పిపెడుతున్నది. ఎన్నికల ప్రచార నిధులపై వివాదం ఉన్నది. భీమా కోరెగాంవ్ వివాదం విస్తృతమైనది. దళిత, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తపైన, న్యాయవాదులపై బీజేపీ ప్రభుత్వం కేసులు పెట్టింది. ప్రధాని నరేంద్ర మోదీ హత్యకు కుట్రపన్నారనే పెద్ద కేసు పెట్టడం గమనార్హం. ఈ తప్పుడు కేసును ఆధారంగా చేసుకొని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టానికి భయానకమైన సవరణలను తేవడంపై అమిత్ షా ఆసక్తి చూపారు. ఇప్పుడు మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రంలో బీజేపీ చేతినుంచి అధికారం జారిపోయింది. ఈ వ్యవహారాలన్నీ ఇక బట్టబయలు కావచ్చు. శివసేనకు, ఇతరపక్షాలకు ఇప్పుడు బీజేపీతో గొడవ పడినందువల్ల పోయేదేమీ లేదు. ఈ కూటమి బీజేపీ గట్టును రట్టు చేయవచ్చు.

**(వ్యాసకర్త: 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకుడు. ఈ ఏటి పాత్రికేయుడుగా రామనాథ్ గోయెంకా అవార్డు పొందారు. న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రం బోధించారు. అమెరికాలోని బర్క్‌లీ విశ్వవిద్యాలయంలో జర్నలిజం బోధించారు. శివనాడార్ విశ్వవిద్యాలయంలో టైమ్స్ ఆఫ్ ఇండియా, సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్, క్రిటికల్ థియరీ కేంద్రంలో పనిచేశారు. 'ది హిందు' పత్రిక సంపాదకుడిగా పనిచేశారు)**

**'ది వైర్' సౌజన్యం...**

# అమ్మప్రేమకు ప్రతిరూపం

ఆర్టీసీ



గోసుల శ్రీనివాస్ యాదవ్

అబద్ధం మనుషులను దూరం చేస్తుంది, అపార్థం మనసులను దూరం చేస్తుంది.... ఆర్టీసీ కార్మికులు-కేసీఆర్ విషయంలో అదే జరిగింది. తన ధ్యాస, తన శ్వాస తెలంగాణగా బతుకుతున్న కేసీఆర్ 'నేను తెలంగాణను చెడగొట్టను-చెడగొట్టేవాళ్లను క్షమించను' అని ప్రకటించి పరిశ్రమిస్తున్నారు. కేసీఆర్ తనకు కార్మికులకు మధ్య అబద్ధం చోటుచేసుకోవడాన్ని, అపార్థం చోటుచేసుకోవడాన్ని సహించలేకపోయారు. కాబట్టి, ఒక తల్లి తన బిడ్డలను కోపగించుకున్నట్టు మాతృహృదయంతోనే బెత్తం పట్టుకున్నారు. అంతమాత్రాన ఏ తల్లి అయినా తన బిడ్డలను ఆకలికి బలి చేస్తుందా? బిడ్డలకు జీవనాధారం లేకుండా చేసి క్షోభకు గురిచేస్తుందా? చేయదు. కేసీఆర్ విషయంలో కూడా కచ్చితంగా ఇదే జరిగింది. మూర్తీభవించిన మాతృ హృదయంతో, మన్నించే తల్లి మనస్సుతో తన బిడ్డల్లాంటి ఆర్టీసీ కార్మికుల తప్పొప్పులను క్షమించి, వారి కష్టానికి, కల్మషం లేని సేవకు విలువిచ్చి, షరతులు లేని పునరాగమనానికి చేతులు చాపారు. దాదాపు రెండు నెలల సందిగ్ధానికి, అభద్రతాభావానికి, ఆందోళనకు శాశ్వతంగా తెరదించారు.

ఆశ మనిషి సహజగుణం. అత్యాశ నాయకుల అసహజ లక్షణం. హక్కులు తప్ప బాధ్యతలు ఎరుగని నాయకులు, ప్రశ్నించడం తప్ప సమాధానం ఇవ్వడం తెలియని నాయకులు, సమయ సందర్భాలు, పరిస్థితుల ప్రభావాలు, వాస్తవ స్థితిగతులూ బేరీజు వేసుకోలేని నాయకులు, తమను నమ్మిన కార్మికుల ఆశలే ఆయుధంగా అధికార పీఠంపై అస్త్రం ఎక్కుపెడుతరు. ఇలాంటి సందర్భంలో విమర్శలను, విషపు ప్రచారాలను భరిస్తూ సంస్థ మనుగడ కోసం, కార్మికుల భవిష్యత్ కోసం కీలకమైన నిర్ణయాలు తీసుకునేందుకు కాస్త సమయం తీసున్నారు కేసీఆర్. తన మానవతా హృదయాన్ని, కార్మికుల ఎడల బాధ్యతనూ ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా విధుల్లో చేరమని గొప్ప ఊరట కల్పించారు. కార్మికులకు ఎలాంటి వేధింపులుండవని స్పష్టమైన హామీ ఇచ్చి తిరుగులేని ధైర్యం నూరిపోశారు. సమ్మెకాలంలో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించి ఆ కుటుంబాల్లో దీపం వెలిగించారు. ఆ కుటుంబాలకు చెందిన బిడ్డలు అనాథలు కాకుండా, ఆకలిబారిన పడకుండా దారిచూపారు.

నిజానికి ఆర్టీసీ గురించి, ఆ కార్మికుల గురించి వారి కష్టం గురించి కేసీఆర్‌కు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. గతంలో రోడ్డు రవాణా శాఖా మంత్రిగా పనిచేసి నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించిన ఘనచరిత్ర కేసీఆర్‌కు ఉన్నది. నాటి ఉమ్మడి రాష్ట్రంలోని 23 జిల్లాల్లో కాలికి బలపం కట్టుకొని తిరిగి ఆర్టీసీ డిపోలను, బస్ స్టేషన్లను స్వయంగా సందర్శించి కార్మికులను ఉత్సాహపరిచి, వారికి భరోసా ఇచ్చి ఆర్టీసీని లాభాల బాట పట్టించారు. ప్రయాణికుల కష్టాలు స్వయంగా పరిశీలించి, మెరుగైన సేవలు అందేలా చేసి వారి మన్ననలు పొందారు. కానీ తన నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణలో, తన సారథ్యంలో నడుస్తున్న ప్రభుత్వంలో తన ఆశలకు అనుగుణంగా, దేశంలోనే మిన్నగా తీర్చిదిద్దాలనుకున్న ఆర్టీసీ నుంచి రాష్ట్రాధినేతకు తగిన సహకారం కొరవడింది. ఉద్యమ సమయంలో స్వయంగా తన ప్రోత్సాహంతో ఎదిగిన నాయకులు తమ స్వార్థం కోసం, తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించుకోవడం కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం విపక్షాలతో చేతులు కలిపి సమ్మె పేరుతో బెదిరింపు రాజకీయాలకు పాల్పడటం సహించరానిది. కార్మికులకు మాయమాటలు చెప్పి ఆర్టీసీ సంస్థనే విచ్ఛిన్నం చేసేందుకు యూనియన్ నేతలు పూనుకున్న నేపథ్యంలో కేసీఆర్ కొంత కఠినంగా వ్యవహరించాల్సి వచ్చింది. కార్మిక నాయకుల కుటిలత్వాన్ని అర్థం చేసుకొని, వారి నుంచి కార్మికులు భవిష్యత్తులో ఎదుర్కోబోయే అనర్థాల నుంచి కాపాడేందుకు తానే స్వయంగా కార్మికులతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరుచుకునేందుకు పూనుకోవటం ఆహ్వానించదగినది.

అందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రతి డిపో నుంచి అనుభవజ్ఞులైన కార్మికులను ప్రగతిభవన్‌కు ఆహ్వానించి వారితో సంస్థ బాగోగుల గురించి చర్చించి తగు నిర్ణయాలు తీసుకునేందుకు సన్నద్ధమవటం ముదావహం. ఇప్పటికే సంస్థ తక్షణ అవసరాల నుంచి గట్టెక్కించేందుకు వంద కోట్లు కేటాయించారు. ప్రజలకు కొంత భారమైనా, సమ్మెద్వారా సంస్థ నెత్తినపడ్డ భారాన్ని తగ్గించేందుకు, సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకూ బస్సు చార్జీలను పెంచుకునే వెసులుబాటు కల్పించారు. ఆర్టీసీని కేసీఆర్ అమ్మేయబోతున్నారని, ప్రైవేట్ వ్యక్తులకు సంస్థను ధారాదత్తం చేయబోతున్నారనీ ఇల్లెక్కి గోల చేసిన ప్రతిపక్ష నేతలు సిగ్గుతో తలదించుకునేలా, ప్రైవేట్ రూట్లు ఉండబోవని వాటిని ఆర్టీసీకే ఇస్తామని స్పష్టంగా ప్రకటించారు. దీంతో ఆర్టీసీ కార్మికులను అడ్డం పెట్టుకొని రాజకీయ ప్రయోజనం పొందాలని పగటికలలు కన్న ప్రతిపక్షాల నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్టయింది. వారి నోళ్లు మూతపడ్డాయి. ఇప్పుడున్న జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో ఏ రంగమైనా పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలో ఉండటం అసాధ్యం. ఈ విషయం విపక్షాలకూ తెలియంది కాదు. కాబట్టే కేంద్ర ప్రభుత్వం కూడా బస్సు రూట్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కానీ, కేసీఆర్ మాత్రం కార్మికుల మీద ఉన్న అపారమైన ప్రేమతో వారికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రైవేట్ రూట్లను కూడా ఆర్టీసీ అప్పగించాలన్న గొప్ప నిర్ణయం తీసుకున్నారు. కార్మికుల పట్ల తనకున్న అభిమానం చాటుకున్నారు.

> ఆర్టీసీ సమస్త జనావళి జీవితాలతో ముడిపడి ఉన్నటువంటిది. అభివృద్ధికి మొదటి మెట్టు. ఇలాంటి కీలక, ప్రాధాన్య సంస్థలో అరాచకులు తిష్ట వేసి రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కల్పిస్తామంటే సహించరానిది. అలాంటి ప్రాధాన్య సంస్థలో అరాచకులు పాగా వేస్తే కార్మికుల బతుకులు ఆగమవుతాయి. ఈ సత్యాన్ని కార్మిక లోకం కూడా అర్థం చేసుకున్నది.

నిజాయితీగా చెప్పుకోవాలంటే, కార్మిక నాయకులకు -రాజ్యానికి మధ్య ఉన్న సంబంధం, బాధ్యత, నిబద్ధతకు సంబంధించినది. ఎవరు తమ విద్యుక్తధర్మాన్ని, బాధ్యతను మరిచినా అసలుకే మోసం వస్తుంది. ఆశించిన లక్ష్యం అటకెక్కుతుంది. ఆర్టీసీ సమస్త జనావళి జీవితాలతో ముడిపడి ఉన్నటువంటిది. అభివృద్ధికి మొదటి మెట్టు. ఇలాంటి కీలక, ప్రాధాన్య సంస్థలో అరాచకులు తిష్ట వేసి రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కల్పిస్తామంటే సహించరానిది. అలాంటి ప్రాధాన్య సంస్థలో అరాచకులు పాగా వేస్తే కార్మికుల బతుకులు ఆగమవుతాయి. ఈ సత్యాన్ని కార్మిక లోకం కూడా అర్థం చేసుకున్నది. పరిధులు, పరిమితులూ దాటి దుస్సాహసాలకు దిగితే ఎంతటి విపత్తు ఏర్పడుతుందో ఆర్టీసీ సమ్మె ప్రబల ఉదాహరణ.

ఇక నుంచైనా ఆర్టీసీ ప్రగతిరథాలు ప్రజా శ్రేయస్సులో భాగమవ్వాల్సిన అవసరం ఉన్నది. నిబద్ధత, నిమగ్నతతో వ్యవహరిస్తే, కన్నతల్లి ప్రేమతో కేసీఆర్ అక్కున చేర్చు కుంటారని ఇప్పటికే అనేకమార్లు రుజువైంది. దీనికి అనుగుణంగా కార్మికలోకం నడుచుకోవాలి.




భారత ప్రధాని నరేంద్ర మోదీతో గంటసేపు ఇరువురి మధ్య అర్థవంతమైన చర్చలు సాగాయి. పరస్పర గౌరవపూర్వకమైన బలమైన సంబంధాల కోసం అభిప్రాయాలను పంచుకున్నాం.

**గోటబయ రాజపక్స**



ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌ను రక్షణ పార్లమెంటరీ ప్యానెల్ నుంచి తప్పించటంతో మాత్రమే సరిపోదు. ఆమెను పార్టీ నుంచే బహిష్కరించాలి. ముంబై టెర్రర్ దాడి సందర్భంగా వీరోచితంగా పోరాడిన హేమంత్ కర్కరేను తూలనాడింది. ఆధిపత్య జాతీయవాదకాలంలో ఇది దేశ వ్యతిరేకంగా కాదేమో!

**బర్ఖాదత్**



ఉద్ధవ్ ఠాక్రే మహారాష్ట్ర వికాస్ అఘాడి ప్రభుత్వం బల నిరూపణలో విజయం సాధించినందుకు అభినందనలు. ఈ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను సఫలీకృతం చేస్తుందన్న నమ్మకం నాకున్నది. కూటమి పక్షాలన్నీ ఐక్యంగా రాష్ట్ర ప్రజల అభివృద్ధి సుఖశాంతుల కోసం పనిచేయాల్సిన అవసరం ఉన్నది.

**ప్రఫుల్ పటేల్**



మెట్రో కార్ షెడ్ నిర్మాణంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలను కూడా మహారాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించటం విచారకరం. ఇది ముంబై మౌలికవసతుల నిర్మాణంపై ప్రభుత్వ అలసత్వానికి ప్రతీక. దీంతో సాధారణ ముంబై ప్రజలు ఇబ్బందులు పడుతారు

**దేవేంద్ర ఫడ్నవీస్**

# జనాభా లెక్కల సీజన్

సామాజికం



బి.ఎస్.రాములు

2021లో ప్రారంభమయ్యే జనాభా లెక్కల సీజన్ తాలూకు ఏర్పాట్లు, శిక్షణలు మొదలయ్యాయి. 2011 జనాభా లెక్కలు తీసినప్పటికీ ఇప్పటికీ వాటి వివరాలు, విశ్లేషణలు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. జనాభా లెక్కలు తీయడం ద్వారా అనేక వివరాలు సేకరించడం జరుగుతుంది. తద్వారా ఎంత జనాభా, ఏయే సామాజికవర్గాలు, ప్రజల జీవన ప్రమాణాలు, జాతీయాభివృద్ధి, వృద్ధులు, పిల్లలు, యువకులు, మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, బీసీలు మొదలైన వివరాలు, జీవనస్థితిగతులు తెలుస్తాయి. అభివృద్ధి, సంక్షేమం, ఆధునిక విద్య, నైపుణ్యాలు ఎవరెవరికి ఎంతమేరకు అందుతున్నాయో, ఎలాంటి ప్రణాళికలు, పథకాలు చేపట్టాలో, ఎలా ముందుకుసాగాలో, ఎలా ముందుకు సాగుతున్నదో తెలుస్తుంది.

1931లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఇండియాలో కులాలవారీగా చేపట్టిన జనాభా లెక్కలు కొన్ని సామాజికవర్గాలకు ఇప్పటికీ ఆధారభూతమవుతున్నాయి. సామాజికవర్గాల వారీగా, మతాలవారీగా, తమ ప్రాతినిధ్యం ఉండాలని, ముస్లింలు, సిక్కులు, బ్రాహ్మణులు, అంటరానివారు కోరుతూ, 1919 నాటి రాజ్యాంగాన్ని, హక్కులను విస్తరించాలని కోరింది. అందుకు స్పందించిన బ్రిటిషు ప్రభుత్వం అధ్యయనం చేసి నివేదిక అందించాలని సైమన్ కమిషన్‌ను నియమించింది.

ఇండియాలో సైమన్ కమిషన్ పర్యటించినప్పుడు సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ గాంధీజీ నాయకత్వం ఆందోళన చేపట్టింది. అనేక సామాజిక వర్గాలకు ప్రత్యేకంగా ప్రాతినిధ్యం కల్పించడం, గుర్తించడాన్నివారు వ్యతిరేకించారు. తమకు ప్రాతినిధ్యం ఉండాల్సిందేనని కోరేవాళ్లు సైమన్ కమిషన్‌కు విజ్ఞప్తులు సమర్పించారు. ఇంగ్లాండ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. బి.ఆర్.అంబేద్కర్ సైమన్ కమిషన్‌కు అంటరానివాళ్ళ (డిప్రెస్డ్ క్లాసెస్) దుస్థితి గురించి నివేదించారు. సైమన్ కమిషన్ దానిపై 'కమ్యూనల్ అవార్డు' ప్రకటించింది. ఈ అవార్డులో సిక్కులు, ముస్లింలు, ఎస్సీలు, మొదలైనవారికి ప్రజాప్రాతినిధ్యం సిఫార్సు చేసింది. వాటి ని వ్యతిరేకిస్తూ, గాంధీజీ ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో ఒప్పందం చేసుకున్నది. అదే 1932 అక్టోబర్‌లో జరిగిన 'పూనా ఒప్పందం'. ఆ ఒప్పందాన్ని అనుసరించి 1935 భారత రాజ్యాంగంలో అంటరానివారికి రిజర్వేషన్లు ప్రవేశపెట్టబడినాయి. అవి ఆ తర్వాత 1949 నవంబర్ 26న ఆమోదించి 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగంలో పొందుపరచబడి నేటికి కొనసాగుతున్నాయి.

ఓబీసీలు, బీసీల గురించి జనాభా లెక్కలు తీయాలని, వారికి చట్టసభలతో పాటు అన్నిరంగాల్లో ప్రజా ప్రాతినిధ్యం, జనాభా దామాషా మేరకు కల్పించాలని, ఆయా సామాజికవర్గాలు చాలాకాలంగా కోరుతూ వస్తున్నాయి. ముఖ్యంగా 1978లో ప్రధాని మొరార్జీ దేశాయ్ కాలంలో 1978లో బి.పి.మండల్ ఛైర్మన్‌గా బీసీ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. మండల్ కమిషన్ 1980లో తన నివేదికను అందజేసింది. ఆ నివేదిక దేశవ్యాప్తంగా బీసీలు 46-56 శాతం దాకా ఉన్నారని అనేక రిసోర్స్‌ల ద్వారా, నమూనా సర్వేల ద్వారా నిర్ధారించింది. చట్టసభల్లో, విద్య, ఉద్యోగ, పారిశ్రామికరంగాల్లో రిజర్వేషన్లను, ప్రజా ప్రాతినిధ్యాన్ని ఆ నివేదికలో సిఫార్సు చేసింది. ఆ నివేదికను అందుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది.

1989లో ప్రధాని వీపీ సింగ్ దాన్ని దులిపి కొన్నిరంగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలుజరుపాలని, ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని వ్యతిరేకిస్తూ ఇతర సామాజికవర్గాల న్యాయస్థానాలను ఆశ్రయించారు. అనేక వాదోపవాదాల తర్వాత సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించింది. 1992 నవంబర్‌లో వెలువరించిన ఆ తీర్పు 'ఇంద్రసహాని కేసు'లో తీర్పు అనే పేరిట ప్రాచుర్యం పొందింది. సుప్రీంకోర్టు ఆ తీర్పులో రిజర్వేషన్లను అమలుజరుపాల్సిందేనని, అయితే అన్ని రిజర్వేషన్లు కలిపి యాభై శాతం మించకూడదని అభిప్రాయపడింది. అందువల్ల ఓబీసీ రిజర్వేషన్లు 27 శాతానికి పరిమితం చేసింది. 50 శాతం మించి రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే అందుకు జనాభా లెక్కలను ప్రాతిపదికగా, శాస్త్రీయంగా చూపాలని పేర్కొన్నది. ఆ ప్రకారంగా తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు, ఈశాన్య రాష్ట్రాల్లో కొన్నిచోట్ల 80 శాతం దాకా రిజర్వేషన్లు అమలుజరుపుతున్నారు. జనాభా లెక్కలు శాస్త్రీయంగా లేవు కాబట్టి రిజర్వేషన్లు పెంచడానికి వీల్లేదని ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.కె.మురళీధర్‌రావు కమిషన్ 1984లో ప్రతిపాదించిన సిఫార్సులను అనుసరించి ఎన్టీఆర్ బీసీలకు మొత్తం కలిపి 44 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టినప్పుడు హైకోర్టు కొట్టివేసింది. ఇలా ఆయా రాష్ట్రాల్లో బీసీల కోసం పెంచిన రిజర్వేషన్లను, జనాభా లెక్కలు లేవని, న్యాయస్థానాలు కొట్టివేస్తూ వస్తున్నాయి.

అందువల్ల అన్నిటికి 1931 నాటి జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవడం జరుగుతున్నది. 1931లో కూడా ఆయా సామాజకవర్గాలకు న్యాయం చేయడానికి ఆ లెక్కలు తీయడం జరిగింది. బి.పి.మండల్ కమిషన్ సిఫార్సుల తర్వాత వాటిని అమలుచేయడానికి జనాభా లెక్కలను శాస్త్రీయంగా చూపించడానికి జనాభా లెక్కల్లో కులాలవారీగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వారీగా కచ్చితంగా, నిర్దిష్టంగా జనాభా లెక్కలు తీయాల్సిన అనివార్యత ఏర్పడింది. అందుకోసం అనేక పార్టీలు, సామాజిక ఉద్యమాలు 1991లో తీసే జనాభా లెక్కను కులాలవారీగా, సామాజికవర్గాల వారీగా తీయాలని కోరింది. అలా 2001లో, 2011లో కూడా బలంగా కోరుతూ రావడం జరిగింది. ప్రజల ఒత్తిడిని ఆయా పార్టీల తీరును గమనించి 2011లో బీసీల, ఓబీసీల జనాభా లెక్కలను తీయడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అందుకు ప్రత్యేకంగా ఒక ఫార్మాట్‌ను రూపొందించింది. అలా తీసిన జనాభా లెక్కలు ఏమయ్యాయో ప్రభుత్వాలు ఇప్పటివరకు చెప్పడం లేదు. ఆ లెక్కలు సరిగ్గా తీశారో లేదో కూడా తెలియదు. ఏండ్లు గడిచిపోతున్నాయి. కాలయాపన జరిగిపోతున్నది. 1932లో 'పూనా ఒప్పందం' ద్వారా షెడ్యూల్డ్ కులాలకు అమలులోకి వచ్చిన రిజర్వేషన్ల కాలం నుంచే అమలుచేయాల్సిన బీసీ రిజర్వేషన్లు నేటికీ అమల్లోకి రావడం లేదు. అందుకు జనాభా లెక్కలు లేకపోవడం ప్రధాన కారణమని న్యాయస్థానాలు, ప్రభుత్వాలు పేర్కొంటున్నాయి. 1948లో చేసిన చట్టాలను అనుసరించి జనాభా లెక్కల కమిషన్ మాత్రమే జనాభా లెక్కలు తీయాలి. అందువల్ల తమ అవసరాల కోసం జనాభా లెక్కలు తీయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబాల సర్వే మొదలైన వివిధ పద్ధతులను అనుసరిస్తున్నారు.

> 1992 నవంబర్‌లో ఇంద్రసహాని కేసులో ఓబీసీ రిజర్వేషన్ల గురించి సుప్రీంకోర్టు తీర్పునిస్తూ, ఆయా రాష్ట్రాల్లో, కేంద్రంలో బీసీలను, ఓబీసీలను గుర్తించడానికి లిస్టులో చేర్చడానికి, తొలిగించడానికి వారికి తగు ప్రణాళికలు, పథకాలు రూపొందించడానికి సిఫార్సులు చేయడానికి శాశ్వత ప్రాతిప దికపై నేషనల్ బీసీ కమిషన్, రాష్ట్రాల బీసీ కమిషన్‌లు ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. అలా 1993 నుంచి నేషనల్ బీసీ కమిషన్, ఆయా రాష్ట్రాల బీసీ కమిషన్లు శాశ్వత ప్రాతిపదికపై కొనసాగుతున్నాయి.

1992 నవంబర్‌లో ఇంద్రసహాని కేసులో ఓబీసీ రిజర్వేషన్ల గురించి సుప్రీంకోర్టు తీర్పునిస్తూ, ఆయా రాష్ట్రాల్లో, కేంద్రంలో బీసీలను, ఓబీసీలను గుర్తించడానికి లిస్టులో చేర్చడానికి, తొలిగించడానికి వారికి తగు ప్రణాళికలు, పథకాలు రూపొందించడానికి సిఫార్సులు చేయడానికి శాశ్వత ప్రాతిపదికపై నేషనల్ బీసీ కమిషన్, రాష్ట్రాల బీసీ కమిషన్‌లు ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. అలా 1993 నుంచి నేషనల్ బీసీ కమిషన్, ఆయా రాష్ట్రాల బీసీ కమిషన్లు శాశ్వత ప్రాతిపదికపై కొనసాగుతున్నాయి. బీసీ కమిషన్‌లు ఏ సిఫార్సులు చేయాలన్నా జనాభా లెక్కలు, ఆయా ప్రజల జీవనస్థితిగతులు, విద్య, ఉద్యోగ, సామాజికస్థాయి జీవన ప్రమాణాలు, ఆధునిక అభివృద్ధి అందుకుంటున్న తీరు, అందుకోలేకపోతున్న తీరు ఉద్యోగాల్లో వారి శాతం మొదలైన లెక్కలు ప్రతిసారి తీయాల్సి వస్తున్నది. ప్రతిసారి కోట్ల రూపాయలు, వేలాదిమంది ఉద్యోగులు, వలంటీర్లు అందుకు నియమించబడి లెక్కలు తీయాల్సి వస్తున్నది.

ఉదాహరణకు కర్నాటకలో మూ డుకోట్ల ముప్పై ఐదు లక్షల కుటుంబాల సర్వేను హెచ్.కాంతరాజ కమిషన్ నాయకత్వంలో శాస్త్రీయంగా చేపట్టి నివేదిక రూపొందించారు. దాన్ని ప్రభుత్వం తీసుకోలేదు. జనాభా లెక్కల ఆవశ్యకత అనేకరంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించడానికి, సమాజ వికాసానికి, ప్రణాళికలు చేపట్టడానికి, ప్రభుత్వాలకు, ప్లానింగ్ కమిషన్‌కు ఎంతో అవసరం. అందువల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాధాన్యాన్ని గుర్తించి సమగ్ర కుటుంబ సర్వే చేసింది. ఆ వివరాలను అనుసరించి తెలంగాణలో ఎస్సీలు 16 శాతం, ఎస్టీలు 10 శాతం, ముస్లింలు 12 శాతం, బీసీలు 50-52 శాతం అని, మొత్తంగా 85-89 శాతం దాకా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే అని ముఖ్యమంత్రి కేసీఆర్ పదేపదే చెప్తూ వచ్చారు. అనేక అవసరాల రీత్యా, దేశాభివృద్ధిరీత్యా 2021లో జనాభా లెక్కల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీల వలె ఓబీసీ, బీసీల కులాల వారీ లెక్కలను, ముస్లింలలోని కులవృత్తుల వారీ లెక్కలను, క్రైస్తవుల్లోని కులాలవారీ లెక్కలను కూడా తీయడం ఎంతో అవసరం. చైనాతో పోటీపడి ఎదుగడానికి అన్నిరంగాల్లో నైపుణ్యా లు, సంపద ఉత్పత్తి పెరుగడానికి ఈ జనాభా వివరాలు సేకరించడం ఎంతగానో ఉపయోగపడుతాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.




డిసెంబర్ 1.. ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరించుకొని శనివారం దేశవ్యాప్తంగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోల్‌కతాలో వలంటీర్లు ఇలా ఒంటిపై పెయింటింగ్స్ వేసుకొని, రెడ్ రిబ్బన్లు కట్టుకొని ప్రదర్శనలో పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం 2018 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా 3.8 కోట్ల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు ఉన్నారు.


## తొలిసారిగా నిశీథిలో అగ్ని-3 క్షిపణి పరీక్ష



**బాలాసోర్ (ఒడిశా):** ఉపరితలం నుంచి ఉపరితలం పైకి ప్రయోగించగల అణ్వస్త్ర సామర్థ్యమున్న బాలిస్టిక్ క్షిపణి అగ్ని-3ని తొలిసారిగా రాత్రివేళలో పరీక్షించినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం దీవిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి మొబైల్ లాంచర్ ద్వారా రాత్రి 7.20 గంటలకు ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపాయి. క్షిపణి పథాన్ని పర్యవేక్షిస్తున్నామని, పరీక్ష ఫలితం కోసం వేచిచూస్తున్నట్లు పేర్కొన్నాయి. మధ్యశ్రేణి క్షిపణి అయిన అగ్ని-3.. 3500 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. 1.5 టన్నుల వార్‌హెడ్‌లను ఇది మోసుకెళ్లగలదు. 17 మీటర్ల ఎత్తు, 2 మీటర్ల వెడల్పు, 50 టన్నుల బరువు కలిగిన ఈ క్షిపణి.. ఇప్పటికే సైన్యం అమ్ముల పొదిలోకి చేరింది. యూజర్ ట్రయల్‌లో భాగంగా సైన్యం ఈ పరీక్ష నిర్వహించినట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి.

## కారుకు రూ.9.8 లక్షల చలాన్

అహ్మదాబాద్‌లో పత్రాల్లేకుండా రోడ్డెక్కిన పోర్షె కారు



**అహ్మదాబాద్:** నిబంధనలు ఉల్లంఘించేవారికి అహ్మదాబాద్ రవాణాశాఖ అధికారులు దడపుట్టిస్తున్నారు. రూ.2 కోట్ల ఖరీదైన పోర్షె 911 స్పోర్ట్స్ కారు యజమానికి షాక్ ఇచ్చారు. కారుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్ లేకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని, రూ.9.8 లక్షల జరిమానా విధించినట్టు పోలీసులు శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. సిల్వర్ కలర్ పోర్షె కారును అహ్మదాబాద్‌లోని హెల్మెట్ క్రాస్‌రోడ్ వద్ద బుధవారం ట్రాఫిక్ పోలీసులు ఆపారు. కారుకు సంబంధించిన ధ్రువపత్రాలను డ్రైవర్ చూపించలేదని, నంబర్‌ప్లేట్ కూడా లేదని, దీంతో కారును స్వాధీనం చేసుకుని ఆర్టీవో నిబంధనల ప్రకారం మెమో జారీ చేశామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ తేజస్ పటేల్ తెలిపారు. 'కారుపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పన్నులు, ఇతర చలాన్‌లు కలిపి మొత్తం రూ.9.8 లక్షల జరిమానా విధించాం. యజమాని ఈ మొత్తాన్ని చెల్లించినట్టు రశీదు చూపితేనే మా స్వాధీనంలో ఉన్న కారును విడిచిపెడతాం' అని స్పష్టంచేశారు.









నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఢిల్లీలో విద్యార్థుల నిరసన.. 'శంషాబాద్' ఘటన మానవత్వానికే సిగ్గుచేటు అంటూ పూరీలో సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకత శిల్పం

# దేశమంతటా ఆక్రోశం

- శంషాబాద్ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- పార్లమెంట్ ఆవరణలో యువతి ఆందోళన
- మహిళలకు రక్షణ కల్పించాలంటూ కన్నీటిపర్యంతం



**న్యూఢిల్లీ:** హైదరాబాద్‌లోని శంషాబాద్ శివారులో యువతిపై జరిగిన సామూహిక లైంగిక దాడి, హత్య ఉదంతం దేశవాసులందరినీ కదిలిస్తున్నది. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఢిల్లీలో పలువురు యువతీయువకులు పార్లమెంట్ సమీపంలోని పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. నిందితులపై ఏమాత్రం దయచూపకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సాంసద్‌మార్గ్‌లో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ పాల్గొన్నారు. కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ మీడియా ఇంచార్జి అమ్రిష్ రంజన్ పాండే మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కర్ణాటకలోని సిలుగురిలో బీజేపీ శ్రేణులు, మద్దతుదారులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యువతి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తరుణ్య ఎన్జీవో ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటుచేశారు. ఇందులో పలువురు పోలీస్ అధికారులు కూడా పాల్గొన్నారు. కోల్‌కతాలో యువతులు నోటికి నల్లరిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి: బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్

హైదరాబాద్‌లో యువతిపై లైంగికదాడి, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ డిమాండ్ చేశారు. 'ఈ ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. బాధితురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని ప్రజ్ఞ ట్వీట్ చేశారు.

### నా దేశంలో నాకెందుకు భద్రత లేదు?




పార్లమెంట్ సమీపంలో నిరసన తెలుపుతున్న అను దూబే

హైదరాబాద్ ఘటనతో భయకంపితురాలైన ఓ యువతి పార్లమెంట్ ముందు నిరసన తెలిపారు. ఢిల్లీకి చెందిన అను దూబే (20) శనివారం పార్లమెంట్ సమీపంలోని ఓ దిమ్మెపై కూర్చొని 'నా దేశంలో నేనెందుకు సురక్షితంగా ఉండలేకపోతున్నా' అంటూ ప్లకార్డు ప్రదర్శించారు. దీంతో పోలీసులు ఆమెను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అనుదూబే మాట్లాడుతూ.. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తనతో ఢిల్లీ పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, ఇద్దరు పోలీసులు రక్తం వచ్చేలా కొట్టారని ఆరోపించారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై ఢిల్లీ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీసీపీకి ఆదేశాలు జారీ చేసింది. అను దూబేను కొట్టడం సిగ్గుమాలిన చర్య అని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలివాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు వివరణ ఇచ్చారు. ఆమెపై ఎలాంటి దాడి జరుగలేదన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# కాటేస్తే కాటికే

- పలుదేశాల్లో కామాంధులకు కఠిన శిక్షలు
- బహిరంగంగా చంపేస్తున్న కొన్ని ముస్లిందేశాలు
- నిందితులను నాలుగు రోజుల్లోనే కాల్చిపారేస్తున్న ఆఫ్ఘనిస్థాన్
- నెదర్లాండ్స్‌లో అనుమతి లేకుండా ముద్దిచ్చినా లైంగికదాడితో సమానమే
- భారత్‌లో గరిష్ఠంగా 14 ఏండ్ల జైలు.. అరుదుగా మరణశిక్ష







**హైదరాబాద్‌లో** యువతిపై సామూహిక లైంగికదాడి, హత్య దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలను రగిలించింది. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నిరసనలు చేపడుతున్నారు. నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని.. తుపాకీతో కాల్చిపారేయాలని.. తగులబెట్టాలని.. ఇలా పలు డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే మన చట్టాలేవీ ఇందుకు అంగీకరించవు. మన దేశంలో లైంగికదాడి నిందితులకు 14 ఏండ్ల వరకు జైలు శిక్ష, అరుదైన సందర్భాల్లో మరణశిక్ష విధిస్తారు. నిందితులు మైనర్లయితే కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. కానీ.. కొన్ని దేశాల్లో మాత్రం కామాంధులకు కఠిన శిక్షలు విధిస్తున్నారు. కొన్నిచోట్ల బహిరంగంగా ఉరితీస్తుంటే.. మరి కొన్నిచోట్ల ఏకంగా కాల్చిపారేస్తున్నారు. ముఖ్యంగా ముస్లిం దేశాల్లో లైంగికదాడిని పెద్ద నేరంగా పరిగణిస్తున్నారు. నిందితులను బహిరంగంగా శిక్షిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురవుతున్నారు. ప్రతి పది మంది బాలికల్లో ఒకరు లైంగికవేధింపుల బారినపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏయే దేశంలో ఎలాంటి శిక్షలున్నాయో ఓసారి పరిశీలిస్తే..

- **కాల్చి పడేస్తారు**
  ఆఫ్ఘనిస్థాన్‌లో నేరం చేసిన నాలుగురోజుల్లోగా నిందితుడిని రోడ్డుమీద ఈడ్చుకెళ్తారు. ప్రజల సమక్షంలోనే తుపాకీతో తలకు గురిపెట్టి కాల్చేస్తారు. లేదా బహిరంగంగా ఉరితీస్తారు. ఉత్తరకొరియాలోనూ నిందితులకు ఇదే శిక్ష. పోలీసులు అతడిని బహిరంగంగా కాల్చిపారేస్తారు.
- **బహిరంగంగా ఉరి**
  యూఏఈలో నిందితుడిని ఏడు రోజుల్లోగా బహిరంగంగా ఉరితీస్తారు. ఇరాన్‌లోనూ బహిరంగంగా ఉరితీస్తారు. ఒకవేళ బాధిత కుటుంబం క్షమాభిక్ష పెడితే యావజ్జీవ శిక్షగా మారుస్తారు. ఈజిప్ట్‌లోనూ బహిరంగంగా ఉరితీస్తారు.
- **తల నరికేస్తారు**
  లైంగిక దాడుల విషయంలో సౌదీ అరేబియా ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నది. నేరం రుజువైన కొన్ని రోజుల్లోనే బహిరంగంగా తల నరికేస్తారు.
- **నపుంసకత్వం**
  చైనాలో నేరం రుజువైతే మరణశిక్ష విధిస్తారు. కొన్ని సందర్భాల్లో రసాయనాలు లేదా ఆపరేషన్ చేసి నిందితులను నపుంసకులుగా మార్చుతారు.
- **జైల్లో కూర్చోవాల్సిందే..**
  చాలా దేశాలు నిందితులకు జైలు శిక్షతో సరిపెడుతున్నాయి. అమెరికాలో రెండు రకాల చట్టాలున్నాయి. ఒక చట్టం నిందితులకు జీవితాంతం జైలుశిక్ష విధిస్తే, మరో చట్టం ప్రకారం జరిమానాతో వదిలిపెడుతారు. ఫ్రాన్స్‌లో నిందితులకు 15 ఏండ్ల వరకు శిక్ష విధిస్తారు. బాధితురాలికి జరిగే నష్టాన్ని బట్టి ఈ శిక్షను 30 ఏండ్ల వరకు పెంచొచ్చు. రష్యాలో 3-30 ఏండ్ల వరకు, నార్వేలో 4-15 ఏండ్లు, ఇజ్రాయెల్‌లో 16 ఏండ్ల శిక్ష పడుతుంది.
- **ముద్దుపెట్టుకున్నా నేరమే..**
  నెదర్లాండ్స్‌లో అనుమతి లేకుండా మహిళలను ముద్దుపెట్టుకోవడం కూడా లైంగిక దాడితో సమానం. లైంగిక దాడి నిందితులకు వయసును బట్టి 4-15 ఏండ్ల శిక్ష పడుతుంది.

### పెండ్లి చేసుకుంటే శిక్ష రద్దు

కొన్ని దేశాలు మాత్రం లైంగికదాడుల విషయంలో వింత చట్టాలను అమలు చేస్తున్నాయి. నిందితుడు బాధితురాలిని పెండ్లి చేసుకుంటే శిక్షను రద్దు చేస్తున్నాయి. ఈ జాబితాలో లెబనాన్, బహ్రెయిన్, ఇరాక్, ఫిలిప్పీన్స్, తజకిస్థాన్, ట్యునీషియా తదితర దేశాలు ఉన్నాయి. సింగపూర్, శ్రీలంక, ఘనా, ఒమన్, లెసోతో వంటి 10 దేశాల్లో పెండ్లి తర్వాత లైంగికదాడులను నేరంగా పరిగణించడం లేదు. నాలుగు దేశాల్లోనైతే మైనర్ భార్యపై లైంగికదాడి చేసినా శిక్ష లేదు.

### కోయంబత్తూర్ లైంగికదాడి కేసు.. నలుగురు అరెస్ట్

**కోయంబత్తూర్:** ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఓ యువతిపై జరిగిన సామూహిక లైంగికదాడి ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. నవంబర్ 26న ఓ యువతి (17) పుట్టిన రోజు వేడుకను జరుపుకోవడానికి తన స్నేహితుడితో కలిసి పార్క్‌కు వెళ్లారు. వేడుక జరుపుకున్న అనంతరం రాత్రి 9 గంటల సమయంలో స్నేహితుడితో కలసి ఇంటికి వెళ్తుండగా ఆరుగురు వ్యక్తులు అడ్డగించారు. అనంతరం యువతి స్నేహితుడిపై దాడి చేశారు. యువతిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను వీడియో తీశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు.

# జార్ఖండ్‌లో 64.72% పోలింగ్

- తొలి విడుతలో 13 అసెంబ్లీ స్థానాలకు ముగిసిన ఎన్నికలు
- బిష్ణుపూర్‌లో వంతెనను పేల్చేసిన మావోయిస్టులు



జార్ఖండ్‌లోని లాథెహర్‌లో ఓటర్లకు స్నాక్స్ అందజేస్తున్న సిబ్బంది



తుపాకీ చూపి బెదిరిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి త్రిపాఠి

**రాంచి, నవంబర్ 30:** చెదురుమదురు హింసాత్మక ఘటనలు మినహా జార్ఖండ్‌లో తొలి విడుత అసెంబ్లీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఆరు జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఈ ఎన్నికల్లో 64.72 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టులు చేసిన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బిష్ణుపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 67.04 శాతం పోలింగ్ నమోదైందని, అత్యల్పంగా మనికాలో 57.61 శాతం పోలింగ్ రికార్డయినట్లు అధికారులు తెలిపారు. గుల్మా జిల్లా బిష్ణుపూర్ నియోజకవర్గ పరిధిలోని బనాలత్, బిరాన్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఓ వంతెనను పేల్చివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరుగలేదు. అన్నిచోట్లా పోలింగ్ ప్రశాంతంగా సాగినట్లు అధికారులు పేర్కొన్నారు.

### తుపాకీతో కాంగ్రెస్ అభ్యర్థి హల్‌చల్

డాల్టన్‌గంజ్ నియోజకవర్గంలోని కోషియారా పోలింగ్ కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి త్రిపాఠి పోలింగ్ కేంద్రానికి రాగా, బీజేపీ అభ్యర్థి అలోక్ చౌసారియా వర్గీయులు ఆయనను అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. ఈ సందర్భంగా కొంత మంది రాళ్లు రువ్వినట్లు సమాచారం. దీంతో త్రిపాఠి తన లైసెన్స్‌డ్ తుపాకీని గాల్లోకి తిప్పుతూ హల్‌చల్ చేశారు. ప్రత్యర్థి వర్గీయులను భయపెట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు పోలీస్ వాహన అద్దాలను పగులగొట్టినట్లు పోలీసులు తెలిపారు. పరిస్థితిని వెంటనే అదుపులోకి తెచ్చినట్లు చెప్పారు. ఈ ఘటనపై నివేదిక కోరిన ఎన్నికల సంఘం.. త్రిపాఠి తుపాకీ లైసెన్సును రద్దు చేసింది. ఈ నెల 7న రెండో విడుత ఎన్నికలు జరుగనున్నాయి.


# ఉగ్రవాదాన్ని నిర్మూలించండి

పాక్‌కు భారత్, జపాన్ పిలుపు..మోదీతో జపాన్ మంత్రుల భేటీ

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని, ఉగ్ర సంస్థలపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌కు భారత్, జపాన్ పిలుపునిచ్చాయి. ఈ అంశంలో అంతర్జాతీయ నిబద్ధతను పాటించాలని, ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్‌ఏటీఎఫ్) సూచనలను అమలు చేయాలని స్పష్టం చేశాయి. ఢిల్లీలో శుక్రవారం భారత్, జపాన్ మధ్య ప్రారంభమైన టూ ప్లస్ టూ చర్చల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి జైశంకర్, జపాన్ రక్షణ మంత్రి టారో కోనో, ఆ దేశ విదేశాంగ మంత్రి తోషిమిట్సు మోటెగి పాల్గొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తలెత్తే భద్రతా సవాళ్లు, వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో తాజా పరిణామాలతోపాటు ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతం, కలిసి అభివృద్ధి చేస్తున్న మిలిటరీ హార్డ్‌వేర్ అంశాలపై చర్చించారు. ప్రాదేశిక జలాల్లో భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు మిలిటరీ రవాణకు సంబంధించిన ఏసీఎస్ ఒప్పందంపై జరుగుతున్న చర్చల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. తమ భూభాగం నుంచి ఉగ్రవాదులు ఇతర దేశాలపై దాడులకు పాల్పడకుండా చూడాల్సిన బాధ్యత అన్ని దేశాలపై ఉన్నదదంటూ ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. పాక్‌లోని ఉగ్ర వ్యవస్థల ద్వారా ప్రాంతీయ ముప్పు ఉన్నందున అవి తిరిగికోలుకోని విధంగా చర్యలు తీసుకోవాలని ఆ దేశానికి పిలుపునిచ్చాయి. మరోవైపు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, అభివృద్ధి, స్థిరత్వం ఎంతో ముఖ్యమని, ఈ నేపథ్యంలో జపాన్‌తో భారత్ సంబంధాలు కీలకమని ప్రధాని మోదీ తెలిపారు.

# కాంగ్రెస్ వల్లే శివసేన ఆవిర్భావం

కాంగ్రెస్‌నేత జైరాం రమేశ్ వెల్లడి



**న్యూఢిల్లీ:** శివసేన ఆవిర్భావం, ఎదుగుదల వెనుక కాంగ్రెస్ హస్తం ఉందన్న వాదనలు ఎప్పటినుంచో వినిపిస్తున్నా.. తొలిసారిగా కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ ఈ విషయాన్ని బహిరంగంగా అంగీకరించారు. 1960లలో ముంబై నగరంలో కమ్యూనిస్ట్ ట్రేడ్ యూనియన్ల గుత్తాధిపత్యానికి చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ శివసేనకు బీజం వేసిందని ఆయన తెలిపారు. ఒక జాతీయ వార్తా సంస్థ ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, శివసేన సిద్ధాంతపరంగా వైరి పక్షాలుగా కనిపిస్తున్నప్పటికీ.. శివసేన ఆవిర్భావానికి కాంగ్రెస్ నేతలు ఎస్‌కే పాటిల్, వీపీ నాయక్‌లే అనేక విధాలుగా కారణమనే విషయాన్ని మరిచిపోకూడదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. శివసేనతో కాంగ్రెస్ మైత్రిని జైరాం రమేశ్ వివరించారు. '1980లో మహారాష్ట్ర సీఎంగా అబ్దుల్ రెహమాన్ అంతూలేకు మద్దతు పలికిన తొలి వ్యక్తి బాల్‌ఠాక్రే అన్నది మరిచిపోకూడదు. అలాగే ఎన్డీఏతో విభేదించి ఆయన రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిభా పాటిల్, ప్రణబ్ ముఖర్జీలకు మద్దతు తెలిపారు' అని ఆయన పేర్కొన్నారు.


**శివసేన అవసరం ఎందుకొచ్చింది?**

నేడు ముంబై శివసైనికుల నగరంగా కనిపిస్తున్నప్పటికీ 1960లలో కమ్యూనిస్టుల ప్రభావం అధికంగా ఉండేది. నాడు కాంగ్రెస్‌కు రాజకీయంగా వామపక్షాలే ప్రధాన సవాల్‌గా నిలిచాయి. ట్రేడ్ యూనియన్లలోనూ వాటిదే హవా. యూనియన్లు తరచూ సమ్మె చేస్తుండడంతో పారిశ్రామికవేత్తలకు తలనొప్పిగా మారింది. లెఫ్ట్ యూనియన్ల ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో కాంగ్రెస్ మద్దతున్న యూనియన్లు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో వాటికి కౌంటర్‌గా కాంగ్రెస్.. శివసేనకు దన్నుగా నిలిచింది.

### మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్.. ఇద్దరు నక్సల్స్ మృతి

**గడ్చిరోలి:** మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు నక్సల్స్ మరణించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అంబూజ్‌మడ్ అటవీప్రాంతంలో భామ్రాగఢ్ వైపున శనివారం గడ్చిరోలికి చెందిన సీ-60 కమాండోలు కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న నక్సల్స్ శిక్షణ శిబిరాన్ని గుర్తించిన కమాండోలు అప్రమత్తమయ్యారు. వీరి రాకను కనిపెట్టిన నక్సల్స్ కాల్పులకు తెగబడటంతో కమాండోలు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. ఘటనాస్థలంలో నాలుగు తుపాకులు, పేలుడు పదార్థాలు, పేలుళ్ల కోసం ఉపయోగించే వైర్లు, బ్యాటరీలు తదితర వాటిని కమాండోలు స్వాధీనం చేసుకున్నారు.

### 'లండన్' ఉగ్రవాది గుర్తింపు



**లండన్:** బ్రిటన్ రాజధాని లండన్ బ్రిడ్జి వద్ద శుక్రవారం కత్తితో ఇద్దరు వ్యక్తులను పొడిచి హత్య చేసి పోలీసు కాల్పుల్లో మరణించిన ఉగ్రవాదిని ఉస్మాన్ ఖాన్‌గా గుర్తించారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో ఉగ్ర శిక్షణ శిబిరం ఏర్పాటుకు ప్రయత్నించడంతోపాటు, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై బాంబు దాడి, ముంబై ఉగ్రదాడుల మాదిరిగా యూకే పార్లమెంట్‌పై దాడులకు ఏడేండ్ల కింద కుట్రపన్నిన కేసుల్లో అతడు జైలుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో పెరోల్‌పై విడుదలైన ఉస్మాన్ ఖాన్ శుక్రవారం కత్తితో దాడులకు పాల్పడి ఒక మహిళ, ఒక పురుషుడ్ని చంపి ప్రజలను భయాందోళనకు గురి చేసినట్లు చెప్పారు.

### గాంధీల భద్రతపై శివసేన ఆందోళన

**ముంబై:** కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకకు ప్రత్యేక భద్రతా దళం (ఎస్పీజీ) భద్రతను ఉపసంహరించడంపై శివసేన ఆందోళన వ్యక్తంచేసింది. ఇలాంటి విషయాల్లో రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలని, ఇతరుల జీవితాలతో ఆడుకోకూడదని కేంద్రానికి హితవు పలికింది. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి శివసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గాంధీల కుటుంబానికి ముప్పు తగ్గిందని కేంద్ర హోం శాఖలో ఎవరు నిర్ధారణకు వచ్చారని శివసేన ప్రశ్నించింది. ఈ విషయంపై దృష్టిసారించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు పార్టీ పత్రిక సామ్నాలో సంపాదకీయం రాసింది.

# బలపరీక్ష నెగ్గిన ఉద్ధవ్

- విశ్వాస పరీక్షకు అనుకూలంగా 169 మంది ఓటు
- ప్రొటెం స్పీకర్ మార్పుపై బీజేపీ నిరసన
- వాకౌట్ చేసిన 105 మంది ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్ కొత్త మెలిక!.. డిప్యూటీసీఎం పదవి కోసం పట్టు
- స్పీకర్ పదవికి నానా పటోలే పేరు ఖరారు



బల పరీక్ష అనంతరం విజయ సంకేతం చూపుతున్న శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

**ముంబై, నవంబర్ 30:** మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం బలపరీక్షలో నెగ్గింది. ప్రభుత్వం ఏర్పాటుకు కనీసం 145 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా.. ప్రభుత్వానికి అనుకూలంగా 169 మంది ఓటేశారు. బీజేపీ వాకౌట్ చేసింది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ దిలీప్ వాల్సే బలపరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. మొత్తం 288 మంది సభ్యులకుగానూ నలుగురు ఎమ్మెల్యేలు హాజరుకావడం లేదని చెప్పారు. వీరిలో ఇద్దరు ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఒకరు సీపీఎం, మరొకరు మహారాష్ట్ర నిర్మాణ్ సేన నుంచి ఉన్నారు. అనంతరం విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభ్యుల లెక్కింపు ప్రారంభం కాకముందే బీజేపీ వాకౌట్ చేసింది. మంత్రుల ప్రమాణం, సభ నిర్వహణ అనైతిక పద్ధతిలో సాగుతున్నదని విమర్శించింది. 105 మంది ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం శివసేన-ఎన్సీపీ-కాంగ్రెస్‌కు చెందిన 169 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర వికాస కూటమి ప్రభుత్వం బలపరీక్షలో గట్టెక్కిందని ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. అనంతరం సీఎం ఉద్ధవ్ ఠాక్రే సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 'నన్ను నమ్మిన సభ్యులందరికీ ధన్యవాదాలు. మహారాష్ట్ర ప్రజల దీవెనలతోనే ఇది సాధ్యమైంది. నాకు గతంలో సభలోకి అడుగుపెట్టిన అనుభవం లేదు. అందుకే ఇక్కడికి వచ్చే ముందు కొంత ఒత్తిడికి గురయ్యాను. ఇప్పుడు గర్వంగా ఉన్నది' అని పేర్కొన్నారు.

**రాజ్యాంగ విరుద్ధం**

వాకౌట్ అనంతరం బీజేపీ పక్షనేత దేవేంద్ర ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడారు. బలపరీక్షకు ముందు రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ప్రొటెం స్పీకర్‌ను మార్చారని ఆరోపించారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే కాళీదాస్ కొలంబ్కర్ స్థానంలో ఎన్సీపీకి చెందిన దిలీప్ వాల్సే పాటిల్‌ను ప్రొటెం స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారని చెప్పారు. ఇలా ప్రొటెం స్పీకర్‌ను మార్చడం దేశ చరిత్రలోనే మొదటిసారని పేర్కొన్నారు. త్రిపక్ష కూటమి ఓటమి భయంతోనే ఇలా వ్యవహరించిందని విమర్శించారు. అందుకే సభ నుంచి వాకౌట్ చేసినట్టు చెప్పారు. సీఎంతోపాటు మంత్రుల ప్రమాణస్వీకారం కూడా నిబంధనల ప్రకారం సాగలేదన్నారు. 'వారంతా ఫార్మాట్ ప్రకారం ప్రమాణం చేయలేదు. ఒకరు బాల్ ఠాక్రే పేరుమీద, మరొకరు సోనియాగాంధీ పేరుమీద, మరొకరు శరద్‌పవార్ పేరుమీద ప్రమాణం చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం' అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై సీఎం ఉద్ధవ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను ప్రమాణం సందర్భంగా ఛత్రపతి శివాజీని స్మరించుకోవడాన్ని మీరు అభ్యంతర పెడుతున్నారు. కానీ.. నేను పదే పదే ఆ పేరును స్మరిస్తాను. అంతేకాదు.. తల్లిదండ్రుల పేర్లు స్మరించుకోని బిడ్డల జీవితం వృథా' అని పేర్కొన్నారు. ప్రొటెం స్పీకర్ మార్పు విషయంలో రాష్ట్ర క్యాబినెట్‌కు సంపూర్ణ అధికారాలు ఉన్నాయని దిలీప్ వాల్సే తెలిపారు.

**స్పీకర్ వద్దు.. డిప్యూటీ సీఎం కావాలి.**

పదవుల పంపకంపై కాంగ్రెస్ అలకబూనినట్టు తెలుస్తున్నది. ఈనెల 20న ఢిల్లీలో ఎన్సీపీ-కాంగ్రెస్ భేటీ సందర్భంగా శివసేనకు సీఎం పదవి, స్పీకర్ ఒక డిప్యూటీసీఎం పదవిని తమకు, డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ సీఎం పదవులు ఎన్సీపీ తీసుకోవాలని కాంగ్రెస్ ప్రతిపాదించింది. దీనికిఎన్సీపీ ఒప్పుకొన్నది. అయితే 23న ముంబైలో జరిగిన సమావేశంలో ఒకే డిప్యూటీసీఎం పదవి ఉంటుందని, దాంతోపాటు డిప్యూటీ స్పీకర్ పదవిని కూడా తామే తీసుకుంటామని, కాంగ్రెస్‌కు స్పీకర్ పదవి ఇస్తామని ఎన్సీపీ చెప్పినట్టు తెలిసింది. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేయగా, తుది నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగిసింది. స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుండగా కాంగ్రెస్.. తాము నామినేషన్ వేయబోమంటూ ఎన్సీపీకి చెప్పినట్టు సమాచారం. దీంతో డిప్యూటీ సీఎంల విషయంలో త్వరలో నిర్ణ యం తీసుకుందామంటూ ఎన్సీపీ నేతలు బుజ్జగించారు. చివరికి కాంగ్రెస్ నామినేషన్ వేసేందుకు ఒప్పుకొన్నట్టు ఓ ఎన్సీపీ నేత తెలిపారు.

**బీజేపీ రెబల్‌కు స్పీకర్ పదవి**

కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి నానా పటోలే పేరును ఖరారు చేసింది. ఆయన మొదట్లో కాంగ్రెస్‌లో ఉండేవారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీలో చేరి, గోండియా నియోజకవర్గంలో పోటీచేశారు. కాంగ్రెస్ నేత ప్రఫుల్ పటేల్‌ను ఓడించారు. ఆ తర్వాత బీజేపీని వదిలి మళ్లీ కాంగ్రెస్‌లో చేరి సంచలనం సృష్టించారు. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాగపూర్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీపై పోటీ చేసి ఓడిపోయారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సకోలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు.

## ఆంధ్రా బ్యాంక్ బంగారు బాండ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019–20)గాను సీరిస్–7 సావరిన్ గోల్డ్ బాండ్లను విడుదల చేస్తున్నట్లు ఆంధ్రా బ్యాంక్ హైదరాబాద్ రీజియన్ అధికారులు ప్రకటించారు. ఈ నెల 2 నుంచి 6 వరకు బాండ్లను జారీ చేస్తారు. ఒక గ్రాము బంగారానికి రూ.3,795 ధరను నిర్ణయించారు. డిజిటల్ లావాదేవీలపై కొంటే రూ.50 తగ్గింపు ఉంటుందని బ్యాంక్ తెలిపింది. ఒక వ్యక్తి కనీసం ఒక గ్రాము నుంచి గరిష్ఠంగా నాలుగు కిలోల వరకు పెట్టుబడులు పెట్టడానికి అవకాశముంది. ట్రస్ట్‌లైతే 20 కిలోలదాకా పరిమితి. బాండ్లలో వెచ్చించిన పెట్టుబడిపై సంవత్సరానికి 2.5 శాతం వడ్డీ ఇస్తారు. బాండ్ల కాల పరిమితి ఎనిమిదేండ్ల వరకు ఉంటుంది. కనీసం ఐదేండ్ల తర్వాతనే పెట్టుబడిని తిరిగి తీసుకునే అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శనివారం ఓ ప్రకటనలో అధికారులు కోరారు.

# వేటుపై న్యాయ పోరాటం

- ఐసీఐసీఐ బ్యాంక్‌కు వ్యతిరేకంగా బాంబే హైకోర్టుకు చందా కొచ్చర్
- పరిహారం చెల్లించబోనని స్పష్టీకరణ



**ముంబై, నవంబర్ 30:** ఐసీఐసీఐ బ్యాంక్‌పై ఆ సంస్థ మాజీ సీఈవో చందా కొచ్చర్ న్యాయ పోరాటానికి దిగారు. తనపై వేటును సవాల్ చేస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు సన్నిహిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. తన ముందస్తు పదవీ విరమణకు బ్యాంక్ అంగీకరించిన నేపథ్యంలో మళ్లీ ఈ వేటు ఏమిటంటూ కొచ్చర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను జస్టిస్ రంజిత్ మోరే, జస్టిస్ ఎంఎస్ కర్ణిక్‌లతో కూడిన ధర్మాసనం డిసెంబర్ 2కు వాయిదా వేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ తన ముందస్తు రిటైర్మెంట్‌ను ఆమోదించిందని, ఆ తర్వాతే తన స్థానంలో సందీప్ బక్షీని నియమించిందని ఈ సందర్భంగా కొచ్చర్ న్యాయస్థానానికి గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్‌లో తన రిటైర్మెంట్ విజ్ఞప్తిని బ్యాంక్ అంగీకరించిందన్న ఆమె ఈ ఏడాది ఫిబ్రవరిలో మళ్లీ తొలగింపు లేఖను బ్యాంక్ జారీ చేయడాన్ని తప్పుబట్టారు. ఈ క్రమంలోనే పరిహారం చెల్లించబోనని స్పష్టం చేశారు. తనపై వేటు వేయడం సరికాదన్న కొచ్చర్.. ఇది చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. అంతేగాక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతి లేకుండానే తనను తొలగిస్తున్నట్లు ఐసీఐసీఐ ప్రకటించిందని, ఇది కూడా చట్టాల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. నిరుడు నవంబర్ 3న ఐసీఐసీఐ బ్యాంక్‌కు చందా కొచ్చర్.. ముందస్తు రిటైర్మెంట్ విజ్ఞప్తిని చేశారని, అక్టోబర్ 4 నుంచే అమల్లోకి వచ్చేలా ప్రకటించాలని కోరారని సంబంధిత వర్గాల సమాచారం. ఇందుకు బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అంగీకారం తెలిపారని తెలుస్తున్నది. అయితే కొచ్చర్ ముడుపుల వ్యవహారంపై మాజీ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ నుంచి దర్యాప్తు నివేదికను అందుకున్న బ్యాంక్.. కొచ్చర్‌ను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే 2009 ఏప్రిల్ నుంచి 2018 మార్చిదాకా తీసుకున్న అన్ని రకాల బోనస్ చెల్లింపులను తిరిగిచ్చేయాలని చీఫ్ హెచ్‌ఆర్ ఆదేశించారు. బ్యాంక్ అంతర్గత విచారణలో కొచ్చర్ అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనందున, అక్టోబర్ నాటి నిష్క్రమణను సాధారణ రాజీనామాగా భావించలేమని, తొలగింపుగానే చూడాల్సి వస్తున్నదని హెచ్‌ఆర్ వర్గాలు తెలియజేశాయి. దీంతో మొత్తం రూ.7.4 కోట్లు ఇవ్వాలని తేల్చిచెప్పాయి. అయితే దీన్ని వ్యతిరేకిస్తున్న కొచ్చర్.. కోర్టు గడప తొక్కారు. నివేదిక రాకముందే తాను రిటైర్ అయ్యానని వాదిస్తున్నారు. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్ దీనిపై స్పందించేందుకు నిరాకరించింది. కొచ్చర్ తరపున ఈ కేసులో సీనియర్ న్యాయవాదులు విక్రమ్ నన్కానీ, సుజయ్ కాంతవాలా వాదిస్తుండగా, బ్యాంక్ తరపున సీనియర్ న్యాయవాది డారియస్ ఖంబాట, న్యాయ సంస్థ వెరిటాస్ లీగల్ పోరాడుతున్నాయి. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణ మంజూరు విషయంలో చందా కొచ్చర్ అవినీతికి పాల్పడ్డారని, తన భర్త దీపక్ కొచ్చర్ సంస్థలో వీడియోకాన్ అధినేత ధూత్ పెట్టుబడులు పెట్టారని ఐసీఐసీఐ బ్యాంక్ వాదిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొచ్చర్‌పై వేటు పడగా, వీడియోకాన్ రుణాలు మొండి బకాయి (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)లుగా మారాయని బ్యాంక్ ప్రకటించింది.

# అయ్యయ్యో.. ఆర్థిక వ్యవస్థ

5 లక్షల కోట్ల డాలర్ల లక్ష్యం నెరవేరేనా • క్రమేణా క్షీణిస్తున్న దేశ జీడీపీ

ప్రధాని కల కల్లలు? • భవిష్యత్తుపై తగ్గుతున్న భరోసా




**న్యూఢిల్లీ, నవంబర్ 30:**

ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ. 2024–25కల్లా భారత జీడీపీపై మోదీ సర్కారు పెట్టుకున్న లక్ష్యం. 2018–19 ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న గమ్యమిది. అయితే ఇప్పుడు ఈ లక్ష్యంపై కారు మబ్బులు కమ్ముకుంటున్నాయి. వృద్ధిరేటు పెరుగడం మాట అటుంచితే.. నానాటికీ తగిపోతున్నది. ఏండ్ల తరబడి కనిష్ఠానికి దిగజారిపోతున్నది. నిన్నమొన్నటిదాకా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటు భారత్‌లో ఉందని కీర్తించిన ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి, దేశ–విదేశీ రేటింగ్ ఏజెన్సీలు.. నేడు జీడీపీ అంచనాల్ని వరుసగా తగ్గిస్తున్నాయి. దీనికి తగ్గట్లుగానే ప్రభుత్వ వృద్ధిరేటు గణాంకాలూ విడుదలవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో 5 శాతానికే పరిమితమైన భారత వృద్ధిరేటు.. రెండో త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)లో మరింత దిగజారుతూ ఆరేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 4.5 శాతానికి చేరింది. దీంతో కేంద్రం పెట్టుకున్న 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ కల కల్లలేనా? అన్న అనుమానాలు, ఒకింత ఆందోళనలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### కానరాని సంస్కరణల ఫలాలు

దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనాన్ని పారద్రోలేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు చేపడుతున్న సంస్కరణలు.. ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అడుగంటిన వినియోగ సామర్థ్యం.. అన్ని రంగాలను దెబ్బ తీస్తున్నది. అమ్మకాలు లేక మార్కెట్ కళావిహీనంగా మారగా, ఆదాయం కరువైన సంస్థలు.. ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. ముఖ్యంగా ఆటోమొబైల్, ఐటీ రంగాలకు ఎదురుగాలి వీస్తున్నది. దీంతో నిరుద్యోగం పెచ్చుమీరుతున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కల్పన 4 దశాబ్దాలకుపైగా కనిష్ఠానికి చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామనే అంగీకరిస్తుండటం గమనార్హం. నిజానికి జీడీపీ బలోపేతానికి మోదీ సర్కారు.. పలు కీలక నిర్ణయాలనే తీసుకున్నది. పెద్ద ఎత్తున ఉద్దీపనల్నీ అందిస్తున్నది. అయితే ఇవేవీ సరిపోవని, ఆర్థిక విధానాల్లో మార్పులు మాత్రమే దేశ ఆర్థిక వ్యవస్థను ఇప్పుడు ఆదుకోవని, అంతకుమించి ఇంకా చేయాలని మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ అంటున్నారు. ఆర్థిక వ్యవహారాల మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ సైతం తాజా క్యూ2 జీడీపీని ఆర్థిక వ్యవస్థలో తీవ్ర మందగమనంగానే అభివర్ణించారు. దీంతో 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం నెరవేరడం అనుమానంగానే కనిపిస్తున్నది.

### వృద్ధిరేటు మరింత బలహీనం?

తాజా పరిస్థితులను చూస్తుంటే.. రాబోయే నెలల్లో వృద్ధిరేటు మరింతగా తగ్గడం ఖాయంగా కనిపిస్తున్నది. దేశంలో ఆర్థిక మాంద్యం లేదని, ఆర్థిక మందగమనం మాత్రమే ఉందని కేంద్రం ఎంతగా చాటాలని చూసినా.. భవిష్యత్తుపై భరోసా మాత్రం కలుగడం లేదు. మునుపెన్నడూ లేనివిధంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్లను తగ్గిస్తున్నా.. జీడీపీ కోలుకున్న సంకేతాలు మాత్రం మచ్చుకైనా లేకపోవడం భయాందోళనల్ని రేకెత్తిస్తున్నది. తాజా క్యూ2 జీడీపీ వివరాల ప్రకారం కీలకమైన తయారీ రంగం మైనస్ 1లోకి పడిపోయింది. వ్యవసాయ రంగం కూడా పేలవంగానే ఉన్నది. దీంతో జీడీపీ పురోగతికి ఇప్పుడు తీసుకుంటున్న చర్యలు చాలవని, ఇంకా కావాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం మిస్సేనని హెచ్చరిస్తున్నారు.

### సాధ్యమే: అమిత్ షా

2024 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందన్న విశ్వాసాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యక్తం చేశారు. శనివారం ముంబైలో ఎకనామిక్ టైమ్స్ అవార్డు 2019 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రపంచంలోని 5 అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తుందని కూడా చెప్పారు. ఇప్పటికే విదేశీ సంస్థలకు భారత్.. ఓ ప్రధాన కేంద్రంగా ఉన్నదని, ప్రస్తుతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు రికార్డు స్థాయిలో ఉన్నాయన్నారు. 2014లో 2 లక్షల కోట్ల డాలర్లతో 11వ స్థానంలో ఉన్న భారత జీడీపీ.. ఇప్పుడు 2.9 లక్షల కోట్ల డాలర్లతో 7వ స్థానంలో ఉందని గుర్తుచేశారు.

# భారత్‌కు రావాలనుకుంటున్నాయ్

## చైనాలోని విదేశీ సంస్థలపై నిర్మలా సీతారామన్



**ముంబై, నవంబర్ 30:** చైనా నుంచి భారత్‌కు రావడానికి అక్కడి విదేశీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దాదాపు 12 సంస్థలు చైనాలో ఉన్న తమ వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను భారత్‌కు మార్చుకోవాలని చూస్తున్నాయని తెలిపారు. ఇటీవల తగ్గించిన కార్పొరేట్ పన్ను ప్రయోజనాన్ని పొందాలని భావిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఇక్కడ ఎకనామిక్ టైమ్స్ అవార్డు 2019 కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చైనా నుంచి భారత్‌కు రావాలనుకుంటున్న విదేశీ సంస్థల కోసం ఓ టాస్క్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### జైట్లీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్

కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి మరణానంతరం ఎకనామిక్ టైమ్స్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ప్రజా సేవకుగాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది. జైట్లీ భార్య సంగీతా జైట్లీ ఈ అవార్డును అందుకోగా, కుటుంబం కంటే దేశానికే జైట్లీ ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ఆయనో అత్యున్నత విలువలు కలిగిన వ్యక్తి అన్నారు. తన పిల్లలకు ఆయన ఇచ్చిన ఆస్తి ఇదేనని చెప్పారు.

# మారుతి @ 2 కోట్ల అమ్మకాలు

## ప్యాసింజర్ వాహన విక్రయాల్లో రికార్డు




**న్యూఢిల్లీ, నవంబర్ 30:** దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా.. భారతీయ మార్కెట్‌లో మరో మైలురాయిని అధిగమించింది. ప్యాసింజర్ వాహన విక్రయాల్లో 20 మిలియన్ల మార్కును దాటేసింది. 37 ఏండ్ల వ్యవధిలోపే ఈ రికార్డును సృష్టించింది. 1983, డిసెంబర్ 14న దేశీయ విపణిలో మారుతి సుజుకీ ఇండియా వాహన అమ్మకాలు మొదలైయ్యాయి. చారిత్రక మోడల్ మారుతి 800తో మొదలైన సంస్థ ప్రస్థానం.. ఇంకా పరుగులు పెడుతూనే ఉన్నది. ఈ క్రమంలోనే దేశీయ మార్కెట్‌లో 2 కోట్ల ప్యాసింజర్ వాహన అమ్మకాలను పూర్తిచేసినట్లు శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. కాగా, తొలి కోటి అమ్మకాలను దాదాపు 29 ఏండ్లలో దాటిన మారుతి.. మలి కోటి విక్రయాలను రికార్డు స్థాయిలో 8 ఏండ్లలోనే పూర్తిచేయడం గమనార్హం. 'ఈ ఘనతను సాధించడం ఆనందంగా ఉన్నది. మా సరఫరాదారులు, డీలర్లు, కొనుగోలుదారుల సహకారంతోనే ఇది సాధ్యమైంది' అని మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో కెనిచీ అయుకవా అన్నారు. ఇక త్వరలోనే సీఎన్‌జీ, స్మార్ట్ హైబ్రిడ్ శ్రేణిలో 8 బీఎస్6 వాహనాలను పరిచయం చేయనున్నట్లు తెలిపారు. అలాగే సుజుకీ మోటర్ కార్పొరేషన్.. చిన్నతరహా విద్యుత్ ఆధారిత వాహనాలను తీసుకువచ్చే యోచనలో ఉన్నట్లు చెప్పారు.


www.avinashreddy.com
రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి: 690, RoadNo.3, BanjaraHills, Hyd.
Tuesday Holiday, Timings: 10 AM to 5 PM, avinash11818@gmail.com
93933 11818

వధువు కావలెను
★Reddy BE IIT, MS PhD, USA 28, 5'11", Rich. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy Canada, BE, MS, 29, 6'1", Engineer, 115 K. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy Green Card, MS USA, 33, 5'8", Programmer, 140K. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy Bengaluru, M.Tech, 39, 5'8", SWE, 15 L P/A. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy BE,MS (USA), Business, 27, 5'11", Hyderabad, Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy Citizen, Pharm D, 27, 5' 8", Manager, 8 Crores. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

వరుడు కావలెను
★Reddy MBBS, MS, 27, 5'4", Doctor, Rich Family, Hyd. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy BE, MBA, 27, 5'4", 43,000 P/M, Hyd. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy BE,MS, 26, 5'5", Software, USA, 5 Crores, Fair & Slim.Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy BE, MBA, 25, 5'3", Hyderabad, Fair & Slim. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy MBBS, 23, 5' 4", Doctor, Rich Family, Hyd. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy BE (IIT), MBA USA, 28, 5' 5", 150K, Fair & Slim. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com


D.V. Koti Reddy
www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
తెలంగాణ రెడ్డి వివాహ సంబంధాలకు సంప్రదించండి
690, Road No-3, BanjaraHills HYDERABAD
98480 11818

★Reddy BE, MS, 28, 5'11", Software, 100 K, USA. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy BE, MS, 26, 5'9", 90K, Software, 13 Crores. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy BE, MS, 30, 5'7", H1, Software, USA. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy BS, 29, 5'10", 162K, Software, USA, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy Germany, BE IIT, MS 29, 6'3", Crores, Handsome, Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy BE,MS, PhD, 29, 5' 11", 5 Crores, USA. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy MBBS,MD, 29, 5'8", PG Doctor, Hyderabad. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy Bengaluru, BE, MBA, 28, 5'9", 30L P/A, Rich. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★Reddy BE, NIT, MS, 25, 5'4", 5 Crores, Hyd, Fair. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy Australia, BE, MS, 24, 5'5", Software, 3.5 Crores. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy BE, MBA IIM, 27, 5'2", Manager, 10L P/A, Fair. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy Pakanati, BE, MS, 28, 5'3", H1 SWE, 100 K, USA. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy Ananthapur, BE, 24, 5'4", Fair & Slim. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy B Arch, 25, 5'5", Architect, Hyderabad. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy BE, M Tech, 26, 5'3", Hyd, Fair, Slim. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★Reddy BE, MS, 25, 5'2", SWE, H1, USA, Fair & slim. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

వైష్ణవి ఆర్యవైశ్య మ్యారేజ్ బ్యూరో
అందమైన ఆర్యవైశ్య వధూవరులకు సంప్రదించండి:
G-7, B-Block, Alliance Building, Beside Natraj Theatre, Opp: Mahbub College, Secunderabad-500 003.
Ph: 040-66512299, Cell:98493 52215
9849234728, 9246182216, 9966002215
www.vaishnaviaryavysa.com
vaishnavi_marriage@yahoo.co.in
e-mail: srinivasguptaoo@gmail.com

వధువు కావలెను
★ఆర్యవైశ్య : 32/ 5'9"/ B.Com/ fair/ Business/ 30Crs. వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 33/ 5'6"/ MCA/ Software/ 15lacs PA/ 2Crs/fair. వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 40/ 5'5"/ B.S in Engg Technology/ JTO in BSNL/ 65,000/- P.M/ White/3Cr/ Govt Job వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 31/ 5'8"/ D.Pharma & B.Pharma/ Business/V.fair/ 5Crs వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 33/ 5'7"/ MCA/ Software/ 14lacs PA/ fair/ 3Crs వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 31/ 5'9"/ M.B.B.S/ Doctor/ V.fair/ 30Cr. వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 40/ 5'11"/ M.S(C.S)/ Deloitte/ 30 lacs P.A/ White/ 30Crs వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 26/ 5'5"/ PGDM/ Business/ V.fair/ 50Cr/ వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 25/ 5'9"/ MS in (EE)/ USA-H1B/ 1-140 Approved 100K Per Annum / 10Cr/V.fair వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 40/ 5'5"/ Inter/ Business/ 3Cr/ White/ Second Marriage వరునికి వధువు కావలెను. Cont: Vaishnavi Marriage Bureau 9849352215, 9849234728

వరుడు కావలెను
★ఆర్యవైశ్య : 27/ 5'1"/ MBA, MS/Associate Analyst/ 6Lacs P.A./ V.Fair/ 1Crs. వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 27/ 5'2"/ M.Tech, Vit /Software/ 6 Lacs P.A/Fair/ 2Cr వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 26/ 5'3"/ B.Tech, MBA /White/ 2Cr వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 27/ 5'1"/ BDS/, Dental Doctor/ V Fair/ 1Cr వధువుకు వరుడు కావలెను.. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 23/ 5'4"/ B.E(Comp)/ Software/ 4lacs P.A/ White /2Cr వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 25/ 5'1"/ B.Sc, B.Ed /Teacher/ 10,000/- P.M/ fair వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 26/ 5'4"/ B.Tech(IT)/ MS/ USA /V.fair/ 5Cr వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 26/ 5'0"/ B.Tech, M.S(USA)/ Software/ 70KPA/ Fair వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 27/ 5'2"/ B.Tech, V.Fair / 5Cr వధువుకు వరుడు కావలెను. Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728
★ఆర్యవైశ్య : 27/5'6"/ MBA/ V.fair /Second marriage వధువుకు వరుడు కావలెను Cont: Vaishnavi Bureau 9849352215, 9849234728



దేశిరెడ్డి శోభారెడ్డి, MBA
శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్
రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి
Flat No. 201, 2nd Floor,Sheshadri Heights Apartment
Opp: SLMS Hospital, Nagole "X" Road, Hyderabad.
73968 91999

వధువు కావలెను
1) రెడ్డి డాక్టర్: 31Y, 6'2H, 10Crs Property, Fair గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
2) రెడ్డి డాక్టర్: USA, PG Neuorology, 29Y, 5'8H, Fair గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
3) రెడ్డి డాక్టర్:PG, 28Y, 5'8H, Fair 15 Crs. Property గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
4) రెడ్డి: USA, MS, H1, 1140, SWE, 30Y, 5'11H, Fair గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
5) రెడ్డి:USA, MS,H1, SWE, 30Y, 5'9H, Fair, 10Crs. Property గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
6) రెడ్డి: USA, MS, H1, SWE, 29Y, 5'11H, 10Crs. Property గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
7) రెడ్డి: USA, MS, H1, SWE, 29Y, 5'7H, 6Crs. Fair గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
8) రెడ్డి: USA, MS, H1, SWE, 32Y, 5'11H, 70Crs. Property గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
9) రెడ్డి: USA, M.Pharmacy, 31Y, 5'9H, Fair, 10Crs. Property గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
10)రెడ్డి:USA, MS, H1, 1140, 32Y, 5'9H, 10Crs. Property గల వరునికి తగిన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 7396891999
11) రెడ్డి: 31Y/6'0"/B.Tech/Business man/50 Cr గల వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999
12) రెడ్డి: 27Y/5'8"/B.Tech/ Vit Vellore, MBA/Fair/ 5 Cr గల వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999
13) రెడ్డి: 30Y/6'0"/B.Tech/ SWE/ Fair/ 20 LPA/10 Cr గల వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999
14)రెడ్డి:31Y/5'11"/MS/Job Holder/ Fair/ 5 Cr గల వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999

పేద వధువులకు ఫీజు లేదు
93986 18816

15) రెడ్డి:32Y/5'10"/M.Pharmacy/ Job Holder/ Fair వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999
16)రెడ్డి:33Y/5'8"/PG/Job Holder/ Fair వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999
17)రెడ్డి:31Y/5'10"/LLB/Advocate/ Fair/25 Cr గల వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999
18.రెడ్డి:27Y/5'6"/B.Tech/MBA/Job Holder/Fair/15 Cr గల వరుడికి అందమైన వధువు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్ Ph: 7396891999

వరుడు కావలెను
1)రెడ్డి: MBBS డాక్టర్, 29Y, 5'5H, 6Crs. Property, Fair గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
2)రెడ్డి డాక్టర్ : DNB Radiology, 29Y, 5'4H, Fair 2Crs. Property గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
3)రెడ్డి డాక్టర్ : MBBS, 25Y, 5'6H, Fair Very Rich గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
4)రెడ్డి డాక్టర్ : MBBS, PG Neurology, 33Y, 5'6H, Fair గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
5)రెడ్డి డాక్టర్: MBBS, 23Y, 5'3H, Fair, Well Settled గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
6)రెడ్డి: B.Tech, 26Y, 5'3H, Fair, Rich గల వధువుకు USA వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
7)రెడ్డి: USA, MS, SWE, H1, 5'2H, 25Y, Fair, గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
8)రెడ్డి: USA, MS, SWE, H1, 26Y, 5'3H, Fair, గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
9)రెడ్డి: B.Tech, SWE, 27Y, 5'4H, Fair, గల వధువుకు USA వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
10)రెడ్డి: USA, MS, SWE, 30Y, 5'4H, Fair, గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
11)రెడ్డి:B.Tech, MBA, Business, 24Y, 5'8H, Fair, 20 Crs Property గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
12)రెడ్డి:B.Tech,Job Holder, 34Y, 5'5H, Fair, గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
13)రెడ్డి: MS, Business, 27Y, 5'7H, Fair, 30Crs Property గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
14)రెడ్డి: B.Tech, 26Y, 5'6H, Fair, 10Crs Property గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
15)రెడ్డి: B.Tech, MBA, Job Holder, 25Y, 5'4H, 5Crs Property గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
16)రెడ్డి:B.Tech, 26Y, 5'6H, 10Crs Property గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
17)రెడ్డి: B.Com, Job Holder, 37Y, 5'6H, Fair గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816
18)రెడ్డి: M.Pharmacy, Job Holder, 30Y, 5'4H, గల వధువుకు తగిన వరుడు కావలెను. Cont: శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్: 9398618816

బాబురావు మ్యారేజ్ బ్యూరో

మాల, మాదిగ స్పెషల్: IAS, IPS, IRS, IES, Doctors, SWE, Govt.Job, విదేశీ, సంబంధాలకై సంప్రదించండి : H.No. 33-6-556, రంగశాయిపేట్, వరంగల్, జగిత్యాల, HYD. 7893013265, 9966621170.

వరుడు కావలెను
★మాదిగ హిందూ: Age: 27, Ht: 5'.3", Airport Officer, 14 లక్షలు, Age: 25, Ht: 5.4", Irrigation-A.E.E వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ: Age: 25, Ht: 5'.4", MD.Pediatrics, Age: 27, Ht: 5.'4", MS.OBG వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265
★మాదిగ హిందూ: Age: 25, Ht: 5'.3", M.S. Gen. Surgeon, Age: 29, Ht: 5.'5", Group-I Officer, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265
★మాల హిందూ: Age: 26, Ht: 5'.4", RWS - A.E.E, Age: 27, Ht: 5.3", irrigation - A.E.E, వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265
★మాదిగ హిందూ: Age: 35, Ht: 5.3", Deputy MRO, Age: 28, Ht: 5.'4", MD. General Medicine వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.
★మాల క్రిష్టియన్ : Age: 27, Ht: 5'.3", LIC-AAO, Age: 27, Ht: 5'.6", I.B.Officer, Age: 27, Ht: 5'.3", SBI PO వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ : Age: 26, Ht: 5.'5", GHMC, AEE, Age: 26, Ht: 5'.3", T.S. Genco A.E., వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ: Age: 29, Ht: 5'.5", SI Civil, Age: 29, Ht: 5.4", M.Sc., ACTO, Group-II వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ క్రిష్టియన్: Age: 25, Ht: 5.5", Irrigation AEE, Age: 27, Ht: 5.4", B.Tech, Syndicate Bank - P.O, వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ: Age: 27, Ht: 5.4", B.Tech, MS H+1 Vissa, Age: 26, Ht: 5.4", B.Tech, (IIT) SWE 20 లక్షలు వధువులకు తగిన వరులు కావలెను. ఫోన్: 7893013265.

వధువు కావలెను
★మాదిగ హిందూ : Age: 34, Ht: 5'.8", Group-I Officer, Age: 28, Ht: 5'.7", T.S. Transco A.E. Sal: 1 లక్ష, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల క్రిష్టియన్: Age: 29, Ht: 5.9", B.Tech(IIT), MBA (IIM) SWE 48లక్షలు, Age: 28, Ht: 5.9", GAIL Manager 16 లక్షలు, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ:– Age: 27, Ht: 5'.6", B.Tech (IIT), IRS Income Tax కమీషనర్, Age: 31, Ht: 5'.9", M.Sc., FRO Gropu-I, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ: Age: 29, Ht: 5.'7", B.Tech (IIT) MBA (IIM) SWE, 20 లక్షలు, Age: 28, Ht: 5.9", B.Tech (IIT), BPCL-Manager, 18 లక్షలు వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ: Age: 26, Ht: 5.9", BPL Manager, Sal: 18 లక్షలు, Age: 32, Ht: 5.7", M.Sc., IRTS Group-I కమీషనర్ వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ : Age: 29, Ht: 5'.9", MBBS MD, Gen. Medicine, Age: 31, Ht: 5.'8", MBBS IPS S.P. వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల హిందూ:– Age: 30, Ht: 5'.8", MVSC, Govt. Veterinry Doctor, Age: 29, Ht: 5'.8", MD. Super Speciality, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ హిందూ: Age: 28, Ht: 5.'7", B.Tech (IIT) IOCL Manager, Age: 29, Ht: 5'.8", M.S. Ortho, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాల క్రిష్టియన్: Age: 29, Ht: 5.9", B.Tech(IIT), IES, Age: 29, Ht: 5.'8", MBBS, MS Ortho, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.
★మాదిగ క్రిష్టియన్:– Age: 27, Ht: 5'.9", Scientist (ISRO), Age: 29, Ht: 5'.10", IES, Age: 30, Ht: 5'.10", Irrigation, వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7893013265.

నమస్తే తెలంగాణ
# ఆట
8
[ కరీంనగర్ ]
ఆదివారం 1 డిసెంబర్ 2019
WWW.NTNEWS.COM



డేవిస్‌కప్‌లో పాకిస్థాన్‌ను చిత్తుచేసిన ఆనందంలో భారత టెన్నిస్ బృందం

# పాక్ పాదాక్రాంతం

## డేవిస్‌కప్‌లో వరుసగా ఏడోసారి దాయాదిని చిత్తుచేసిన భారత్

### 4-0తో క్లీన్‌స్వీప్.. 2020 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత

**ఊహించిందే నిజమైంది. అంతా అనుకున్నట్టే.. భారత జోరు ముందు దాయాది దేశం చేతులెత్తేసింది. డేవిస్‌కప్ తొలి రోజు రెండు మ్యాచ్‌లు నెగ్గి ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు.. మలి రోజు మరో రెండు మ్యాచ్‌లు నెగ్గి పాకిస్థాన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. సీనియర్ ప్లేయర్ లియాండర్ పేస్ విజయవంతమైన డబుల్స్ ప్లేయర్‌గా ఆల్‌టైం రికార్డును మరింత పదిలం చేసుకోగా.. సుమిత్ నాగల్ మరోసారి రెచ్చిపోయాడు. మన వాళ్ల దూకుడుతో పాక్ ప్లేయర్లు చేష్టలుడిగి చూస్తుండిపోవడం తప్ప కనీస ప్రతిఘటన చూపలేకపోయారు. 4-0తో పాక్‌ను చిత్తు చేసిన భారత్ 2020లో క్రొయేషియాతో జరిగే ప్రపంచ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. దాయాది దేశంలో ఆడేందుకు ససేమీరా అన్న భారత ఆటగాళ్లు.. తటస్థ వేదికపై ప్రత్యర్థి పనిపట్టి ఈ విజయాన్ని సాయుధ బలగాలకు అంకితమిచ్చారు.**

**నూర్‌సుల్తాన్:** డేవిస్‌కప్‌లో భారత్ అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తుచిత్తుగా ఓడించి ముందడుగేసింది. తొలి రోజు టైలో 2-0తో పూర్తి ఆధిపత్యం చెలాయించిన మనవాళ్లు.. రెండో రోజూ అలాంటి ప్రదర్శనే పునరావృతం చేసి పాక్‌ను క్లీన్‌స్వీప్ చేశారు. డేవిస్‌కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1లో భాగంగా ఆఖరి రోజైన శనివారం ఇక్కడ జరిగిన డబుల్స్, రివర్స్ సింగిల్స్ పోరులో పాక్‌ను భారత ఆటగాళ్లు సునాయాసంగా ఓడించారు. 4-0తో టైను ముగించి ఐదో మ్యాచ్ అవసరం లేకుండానే ప్రపంచ గ్రూపు క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించారు. ముందుగా జరిగిన డబుల్స్‌లో భారత సీనియర్ ప్లేయర్ లియాండర్ పేస్-జీవన్ నెడుంజెళియన్ జోడీ 6-1, 6-3తో పాక్ టీనేజ్ జంట మహమ్మద్ షోయబ్-అబ్దుల్ రహమాన్‌ను 53 నిమిషాల్లోనే మట్టికరిపించారు. ఆ తర్వాత రివర్స్ సింగిల్స్‌లో యువ సంచలనం సుమిత్ నాగల్ 6-1, 6-0 తేడాతో పాక్ ఆటగాడు యూసుఫ్ ఖలీల్‌పై అలవోక విజయంతో పోరును ముగించాడు. భద్రతా పరమైన కారణాల వల్ల పాకిస్థాన్‌లో ఆడేందుకు అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) నిరాకరించడంతో అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) 'టై'ను తటస్థవేదిక కజకిస్థాన్‌కు తరలించిన విషయం తెలిసిందే.

### పేస్ జోడీ జోరు

టై మూడో మ్యాచ్‌లో పేస్-జీవన్ జోడీ పాక్‌పై ఆది నుంచి ఆధిపత్యం ప్రదర్శించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-1తో నిలిచిన భారత ద్వయం.. ఆ తర్వాత ఏ మాత్రం పట్టు సడలించకుండా 6-1తో సెట్‌ను చేజిక్కించుకుంది. రెండో సెట్ ప్రారంభంలో సర్వీస్‌ను బ్రేక్ చేసే అవకాశాన్ని చేజార్చుకోవడంతో ఒక దశలో 3-3తో స్కోరు సమమైంది. అయితే ఎనిమిదో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 5-3తో ముందడుగేసిన పేస్ ద్వయం ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించి 6-3తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ గెలుపుతో భారత్ 3-0తో 'టై'ను చేజిక్కించుకుంది. 46 ఏండ్ల వయసులోనూ ఏమాత్రం జోరు తగ్గని పేస్.. కోర్టులో చురుగ్గా కదులుతూ.. జూనియర్ అయిన జీవన్‌పై ఒత్తిడి పడకుండా అదరగొట్టాడు.

### ఓ మ్యాచ్ మిగిలుండగానే..

అప్పటికే టై గెలిచినా కచ్చితంగా ఆడాల్సిన నాలుగో మ్యాచ్‌లోనూ భారత యువ సంచలనం సుమీత్ నాగల్ రెచ్చిపోయాడు. మ్యాచ్ మొత్తం ఒక్క గేమ్ మాత్రమే కోల్పోయి 6-1, 6-0తో యూసుఫ్‌ను ఓడించాడు. ఇక ఐచ్ఛికమైన ఐదో పోరును ఆడకూడదని ఇరు పక్షాలు నిర్ణయించాయి. పాక్‌పై గెలిచిన భారత్ వచ్చే ఏడాది మార్చి 6,7 తేదీల్లో క్రొయేషియాతో ప్రపంచ గ్రూప్ క్వాలిఫయర్స్‌లో తలపడనుంది. 24 జట్లు తలపడే ఈ క్వాలిఫయర్స్‌లో గెలిచిన 12 జట్లు డేవిస్‌కప్ ఫైనల్స్‌కు చేరుకుంటాయి. ఓడిన 12 జట్లు వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో వరల్డ్ గ్రూప్ టైలో పోటీ పడుతాయి. వీటిలో గెలిచిన ఆరు జట్లు కూడా డేవిస్‌కప్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.



"ఈ విజయాన్ని భారత సాయుధ దళాలకు, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు అంకితమిస్తున్నాం.
**- భారత నాన్ ప్లేయింగ్ కెప్టెన్, రోహిత్ రాజ్‌పాల్**



### పేస్ ఆల్‌టైం రికార్డు మెరుగు

గతేడాది చైనాపై గెలిచిన భారత సీనియర్ స్టార్ ప్లేయర్ లియాండర్ పేస్ 43 విజయాలతో డేవిస్‌కప్ చరిత్రలో అత్యధిక డబుల్స్ విజయాలు సాధించిన ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇప్పుడు మరో విజయంతో ఆ సంఖ్యను 44కు పెంచుకొని.. సమీప భవిష్యత్తులో మరే ఆటగాడు అందుకోలేని స్థానానికి చేరుకున్నాడు. డేవిస్‌కప్‌లో 57 డబుల్స్ మ్యాచ్‌ల్లో పేస్ 44 గెలిచాడు. ఇక ఓవరాల్‌గా అన్ని విభాగాల్లో 92 విజయాలతో జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. డబుల్స్ వివిధ విభాగాల్లో భారత దిగ్గజం పేస్ మొత్తం 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సైతం కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

"ఇది నా 44వ విజయం. కానీ మొదటిదానిలా అనిపిస్తున్నది. ప్రతి విజయం నాకు ప్రత్యేకమే. భారత్ పేరును రికార్డు పుస్తకాల్లో ఎక్కించడమనేది నాకు మరింత ప్రత్యేకం. అందుకోసమే నిరంతరం కృషి చేస్తున్నా. దేశం కోసం ఆడడాన్ని జీవన్ ప్రేమిస్తాడు. అతడితో కలిసి ఆడడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి వారు నన్ను ఇంకా యంగ్‌గా ఉంచగలుగుతున్నారు.
**- లియాండర్ పేస్**

## యువ భారత్‌దే సిరీస్

**లక్నో:** ఆఫ్ఘనిస్థాన్ అండర్-19 జట్టుతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌ను యువ భారత్ జట్టు కైవసం చేసుకుంది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలైనా.. 3-2తో సిరీస్ చేజిక్కించుకుంది. చివరి మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో భారత కుర్రాళ్లు 2 వికెట్ల తేడాతో ఆఫ్ఘన్ చేతిలో ఓటమి పాలయ్యారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్ 49.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. విక్రాంత్ బదోరియా (29) టాప్ స్కోరర్. అనంతరం లక్ష్యఛేదనకు బరిలో దిగిన ఆఫ్ఘన్ 47.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. ఆసిఫ్ (42), షఫీకుల్లా (25 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు.

## టైటిల్‌కు అడుగు దూరంలో..

సయ్యద్ మోదీ టోర్నీ ఫైనల్లో సౌరభ్

**లక్నో:** భారత యువ షట్లర్ సౌరభ్ వర్మ సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మహిళల విభాగంలో జాతీయ చాంపియన్ రితుపర్ణ దాస్ సెమీస్‌లో పరాజయం పాలైంది. శనివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 36వ ర్యాంకర్ సౌరభ్ 21-17, 16-21, 21-18తో హియో వాంగ్ హీ (కొరియా)పై ఉత్కంఠ విజయం సాధించాడు. టైటిల్ పోరులో ఎనిమిదో సీడ్ వాంగ్ జు వీ (చైనీస్ తైపీ)తో సౌరభ్ తలపడనున్నాడు.



మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో భారత యువ షట్లర్ రితుపర్ణ దాస్ 22-24, 15-21తో పిట్టాయాపోన్ చైవాన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## ఏటీకే-ముంబై మ్యాచ్ 'డ్రా'

**కోల్‌కతా:** నిర్ణీత సమయం ముగిశాక ఇంజ్యూరీ టైం చివరి క్షణాల్లో రాయ్‌కృష్ణ సూపర్ గోల్ కొట్టడంతో ముంబై సిటీతో జరిగిన మ్యాచ్‌ను అట్లెటికో డె కోల్‌కతా (ఏటీకే) డ్రా చేసుకుంది. ఐఎస్‌ఎల్‌లో భాగంగా శనివారం ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 2-2తో సమమైంది. మైకేల్ సుసాయిరాజ్ (36వ ని.లో) గోల్ చేయడంతో ఏటీకే ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 62వ నిమిషంలో ముంబై ఆటగాడు ప్రతీక్ చౌదరి గోల్ చేశాడు. ఇక ఇంజూరీ టైమ్‌లో సెర్గ్ కెవిన్ (90+3) ముంబై జట్టును ఆధిక్యంలోకి తేగా ఏటీకే ప్లేయర్ రాయ్‌కృష్ణ గోల్ చేయడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.



ప్రపంచ దివ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి క్రీడాకారుడితో కరచాలనం చేస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్

## దివ్యాంగులకు పూర్తి సహకారం

మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ క్రీడాప్రతినిధి:** దివ్యాంగ క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నదని రాష్ట్ర క్రీడాశాఖమంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, సాంఘిక, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌ను శనివారం మంత్రులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏ క్రీడలోనైనా పాల్గొనేందుకు దివ్యాంగులకు పూర్తి సహాయం చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నే శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి జగదీశ్వర్, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



వార్నర్ (335*)

**1** డే అండ్ నైట్ టెస్టులో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా వార్నర్ (335) రికార్డుల్లోకి ఎక్కాడు.

**2** హెడెన్ (380) తర్వాత అత్యధిక పరుగులు చేసిన ఆసీస్ బ్యాట్స్‌మన్‌గా వార్నర్ నిలిచాడు.

# ట్రిపుల్ ధమాకా

### త్రిశతకంతో రెచ్చిపోయిన వార్నర్.. ఆస్ట్రేలియా 589/3 డిక్లేర్డ్.. పాక్ 96/6

**అడిలైడ్:** విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ (418 బంతుల్లో 335; 39 ఫోర్లు, 1 సిక్స్) అజేయ త్రిశతకంతో కదంతొక్కడంతో పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా 589/3 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. గత మ్యాచ్‌లో భారీ శతకం బాదిన వార్నర్ ఈ సారి ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఎడాపెడా బౌండ్రీలు బాదుతూ రికార్డుల మీద రికార్డులు తిరుగరాశాడు. ఈ క్రమంలో డే అండ్ నైట్ టెస్టులో అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా నిలువడంతో పాటు ఆసీస్ తరఫున రెండో టాప్ స్కోరు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్ శనివారం ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. స్టార్క్ (4/22) నిప్పులు చెరగడంతో.. బాబర్ ఆజమ్ (43 బ్యాటింగ్) తప్ప మిగిలినవారు పోరాడకుండానే చేతులెత్తేశారు. చేతిలో 4 వికెట్లు ఉన్న పాకిస్థాన్ ఆసీస్ స్కోరుకు ఇంకా 493 పరుగులు వెనుకబడి ఉంది. బాబర్‌తో పాటు యాసిర్ షా (4) క్రీజులో ఉన్నాడు.

### కరుణ్ నాయర్ తర్వాత అతడే..

ఓవర్‌నైట్ స్కోర్ 302/1తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. ఓవర్‌కో బౌండ్రీ చొప్పున బాదుతూ ముందుకు సాగింది. ఈ క్రమంలో వరుసగా రెండో టెస్టులో 150 పరుగుల మార్క్ దాటిన లబుషేన్ (162; 22 ఫోర్లు) కాసేపటికి ఔటయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు నమోదైన 361 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే వార్నర్ 260 బంతుల్లో కెరీర్‌లో రెండో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. బాల్ ట్యాంపరింగ్ వివాదం అనంతరం టెస్టుల్లో తొలిసారి కలిసి క్రీజులో నిలిచిన స్మిత్ (36), వార్నర్ చక్కటి సమన్వయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. మూడో వికెట్‌కు 121 పరుగులు జోడించిన అనంతరం స్మిత్ ఔటయ్యాడు. ట్రిపుల్ సెంచరీకి చేరువైనా.. ఏమాత్రం దూకుడు తగ్గించని వార్నర్ చకచకా పరుగులు చేస్తూ.. 389 బంతుల్లో తొలి త్రిశతకం తన ఖాతాలో వేసుకున్నాడు. ఆసీస్ తరఫున ఇది ఏడో ట్రిపుల్ సెంచరీ కాగా.. 2016లో భారత ఆటగాడు కరుణ్ నాయర్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఫీట్ నమోదు కావడం ఇదే తొలిసారి. ట్రిపుల్ తర్వాత వార్నర్ మరింత దూకుడుగా ఆడాడు. మాథ్యూ వెడ్ (38)తో కలిసి అభేద్యమైన నాలుగో వికెట్‌కు 99 పరుగులు జోడించాడు. ఈ దశలో ఆసీస్ కెప్టెన్ పైన్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు.

### స్మిత్ ఫాస్టెస్ట్ 7000



ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్ ద్వారా 7 వేల మైలురాయిని చేరిన ఆటగాడిగా నిలిచాడు. 1946లో ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ వాలీ హమాండ్ 131 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయిని చేరితే.. స్మిత్ 126 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించాడు. వీరేంద్ర సెహ్వాగ్ (134 ఇన్నింగ్స్‌ల్లో) మూడో స్థానంలో ఉన్నాడు. దీంతో పాటు దిగ్గజ ఆటగాడు డాన్ బ్రాడ్‌మన్ (6996)ను స్మిత్ అధిగమించాడు. బ్రాడ్‌మన్ 52 టెస్టుల్లో ఈ పరుగులు చేస్తే.. స్మిత్‌కు 70 మ్యాచ్‌లు అవసరమయ్యాయి. ఆసీస్ తరఫున అత్యధిక పరుగులు చేసిన పదకొండో ఆటగాడిగా స్మిత్ నిలిచాడు.

### అనుష్క పేరెందుకు?

విరాట్ కోహ్లీ



**న్యూఢిల్లీ:** బాలీవుడ్ నటి అనుష్క శర్మకు సెలెక్షన్ కమిటీ సభ్యుల్లోని ఒకరు టీ అందించారన్న మాజీ క్రికెటర్ ఫరూక్ ఇంజినీర్ వ్యాఖ్యలపై టీమ్‌ఇండియా కెప్టెన్, ఆమె భర్త విరాట్ కోహ్లీ మౌనాన్ని వీడాడు. సెలెక్టర్ల గురించి ఏమైనా చెప్పాలనుకుంటే సరేకానీ, అనవసరంగా ఆమె పేరెందుకు వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ప్రపంచకప్‌లో శ్రీలంకతో మ్యాచ్‌కు అనుష్క ఇద్దరు స్నేహితులతో వచ్చి ఫ్యామిలీ బాక్స్‌లో కూర్చుంది. సెలెక్టర్ల బాక్స్ వేరేగా ఉంటుంది. అనుష్క గురించి ఏం మాట్లాడినా అందరూ గమనిస్తారు. సెలెక్టర్ల గురించి ఏమైనా మాట్లాడాలంటే మాట్లాడుకోండి. కానీ ఆమె పేరును జోడించడం ఎందుకు'అని విరాట్ కోహ్లీ అన్నాడు. హెడ్‌కోచ్ రవిశాస్త్రిపై సామాజిక మాధ్యమాల్లో ఓ అజెండా ప్రకారమే ట్రోలింగ్ సాగుతున్నదని, అయితే అవి ఆయనపై ఏ మాత్రం ప్రభావం చూపవని చెప్పాడు.

## ఫైనల్లో భారత అమ్మాయిలు

**ఖాట్మాండు:** దక్షిణాసియా గేమ్స్ (ఎస్‌ఏజీ)లో భారత మహిళల వాలీబాల్ జట్టు ఫైనల్ చేరింది. శనివారం జరిగిన సెమీస్‌లో భారత్ 25-14, 25-6, 5-17తో మాల్దీవులుపై నెగ్గి తుదిపోరుకు అర్హత సాధించింది. ఫైనల్లో నేపాల్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సెమీఫైనల్లో ఆదివారం శ్రీలంకతో భారత్ తలపడనుంది. ఇప్పటికే క్రీడలు ఆరంభమైనా.. అధికారికంగా ఆదివారం జరుగనున్న ప్రారంభోత్సవంలో స్టార్ షాట్‌పుటర్ తేజిందర్ పాల్ సింగ్ తూర్ భారత పతాకధారి (ఫ్లాగ్ బేరర్)గా వ్యవహరించనున్నాడు.

## న్యూజిలాండ్ 375.. ఇంగ్లండ్ 39/2

**హామిల్టన్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 375 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 173/3తో శనివారం రెండో రోజు ఆట కొనసాగించిన కివీస్.. లాథమ్ (105), నికోల్స్ (16) వికెట్లను వెంటవెంటనే కోల్పోయింది. ఈ దశలో తొలి మ్యాచ్ డబుల్ సెంచరీ హీరో వాట్లింగ్ (55), అరంగేట్ర ఆటగాడు డారిల్ మిషెల్ (73) ఆకట్టుకోవడంతో కోలుకుంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లిష్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 39 పరుగులు చేసింది.



డారిల్ (73)

## సాక్షి, వినేశ్‌కు స్వర్ణాలు

**జలంధర్:** జాతీయ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్ (55 కేజీలు), సాక్షి మాలిక్ (62 కేజీలు) స్వర్ణ పతకాలు సాధించారు. ఫైనల్లో వినేశ్ 7-3తో హర్యానాకు చెందిన అంజుపై గెలువగా.. రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి 4-2తో రాధికను చిత్తు చేసింది. మరో పోరులో హర్యానాకు చెందిన 35 ఏండ్ల అనిత (68 కేజీలు).. కామన్వెల్త్ గేమ్స్ పతక విజేత దివ్య కక్రాన్‌పై గెలుపొందింది.

## ఖలీల్‌కు మూడు స్వర్ణాలు

**మణికొండ, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ తైక్వాండో కరాటే పోటీల్లో నార్సింగికి చెందిన అబ్దుల్ ఖలీల్ సత్తాచాటాడు. మూడు స్వర్ణాలు, ఓ కాంస్య పతకం సాధించడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానంలో నిలిచాడు. నవంబర్ 24వ తేదీ నుంచి బ్రిటన్‌లోని మాంచెస్టర్‌లో జరిగిన బ్రిటీష్ ఆటమ్న్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో బ్రిటన్, ఇంగ్లండ్, ఇండోనేషియా దేశాలకు చెందిన క్రీడాకారులను ఖలీల్ మట్టికరిపించాడు.



నార్సింగి మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఖలీల్.. ఎంతో పట్టుదలతో కరాటేలో అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు.

## ఎంఎల్‌ఆర్‌ఐటీకి ఖేలో ఇండియా అక్రెడిటేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ క్రీడాప్రతినిధి:** మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (ఎంఎల్‌ఆర్‌ఐటీ) కళాశాలకు చెందిన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ అకాడమీలు ఖేలో ఇండియా అక్రెడిటేషన్ సాధించాయి. వివిధ క్రీడల్లో ఖేలోఇండియా అక్రెడిటేషన్లు సాధించిన అకాడమీల జాబితాను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ గుర్తింపు రావడంపై కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శి మర్రి రాజశేఖర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



పెద్దపల్లి జిల్లా నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌లో చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర చౌహాన్‌కు మోటర్ గురించి వివరిస్తున్న ప్రాజెక్ట్ ఈఎన్సీ

# కాళేశ్వర నిర్మాణం అద్భుతం

- హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్
- ప్రాజెక్టు నిర్మాణం ఎంతో బాగుంది: హైకోర్టు జడ్జి చల్లా కోదండరాం

**ధర్మారం:** ప్రజలకు, రైతులకు ఉపయోగపడే కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే పూర్తి చేయడం అభినందనీయమని హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. ప్రాజెక్టును పూర్తిచేసి అందుబాటులోకి తేవడం సంతోషించదగ్గ విషయమన్నారు. శనివారం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఆరో ప్యాకేజీ కింద పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌ను జడ్జీలు పొనుగోటి నవీన్‌రావు, చల్లా కోదండరాంతో కలిసి ఆయన పరిశీలించారు. వీరికి కలెక్టర్ శ్రీదేవసేన స్వాగతం పలికారు. పంపుహౌస్ పని తీరును న్యాయమూర్తులకు కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం సీజే రాఘవేంద్రసింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టులతో భూగర్భజలాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో జడ్జి చల్లా కోదండరాం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అద్భుతమని, నీటిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉన్నదని చెప్పారు. ఇంజినీరింగ్ ప్రతిభకు ఈ ప్రాజెక్టు నిదర్శమని మెచ్చుకున్నారు. అనంతరం సీజే చౌహాన్ నందిమేడారంలోని హనుమాన్ మందిరంలో పూజలుచేసి, ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ పర్యటనలో కరీంనగర్ జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి, కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, కరీంనగర్ పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డి, రామగుండం సీపీ సత్యనారాయణ, కాళేశ్వరం లిఫ్ట్ అడ్వయిజర్ పెంటారెడ్డి పాల్గొన్నారు.

**15 ఎకరాల్లో అడ్వకేట్స్ అకాడమీ**

**కరీంనగర్ లీగల్:** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శామీర్‌పేట, నల్సార్ లా యూనివర్సిటీ సమీపంలో 15 ఎకరాల్లో అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్టు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ తెలిపారు. కరీంనగర్ కోర్టులో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కోర్టు మినీ గార్డెన్, ఈ ఫైలింగ్ కోర్టు విభాగాలు, వాటర్‌ప్లాంట్‌ను శనివారం హైకోర్టు న్యాయమూర్తులు, కరీంనగర్ పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ చల్లా కోదండరాం, జస్టిస్ పీ నవీన్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కరీంనగర్ కోర్టు రాష్ట్రంలోని అన్ని కోర్టులకు ఆదర్శప్రాయంగా నిలువాలని ఆకాంక్షించారు. న్యాయస్థానాల్లో కేసుల సత్వర పరిష్కారానికి అందరూ కృషిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, సీపీ కమిషనర్ వీబీ కమలాసన్‌రెడ్డి, ఎస్పీలు సింధుశర్మ, రాహుల్ హెగ్డే, వివిధ కోర్టుల న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్మి (కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో శనివారం ఇంజినీర్లు మూడు మోటర్లను నడిపించారు. 7,8,10వ నంబర్ మోటర్లు నిరంతరాయంగా నడుస్తూ సరస్వతి బరాజ్‌కు 8,700 క్యూసెక్కుల నీటిని చేరవేస్తున్నాయి. డెలివరీ సిస్టర్న్ వద్ద నుంచి సరస్వతి బరాజ్‌కు గోదావరి జలాలు తరలుతున్నాయి. ప్రస్తుతం సరస్వతి బరాజ్‌లో 7.30 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు. - కాళేశ్వరం





మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

## ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టాలి

- నేను కూడా 30 ఎకరాల్లో వేస్తా
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

**చెన్నూర్, నమస్తే తెలంగాణ:** సంప్రదాయ పంటలతోపాటు అధిక లాభాలు వచ్చే ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టి పెట్టాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. చెన్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాప్రతినిధులు, రైతు సమన్వయ సమితి సభ్యులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఈ నెల 5న 2 వేల మంది రైతులకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. జై పూర్‌లో ఆయిల్ ప్రాసెసింగ్ పరిశ్రమను నెలకొల్పేందుకు ప్రభుత్వం కూడా స్థలం కేటాయిస్తూ జీవో ఇచ్చిందని వెల్లడించారు. ఇందుకోసం 7,500 ఎకరాల్లో ఆయిల్‌ఫాం సాగు చేయాల్సి ఉంటుందని, తాను కూడా 30 ఎకరాల్లో సాగు చేస్తానని చెప్పారు.


తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, ట్రైబల్ వెల్ఫేర్ సర్కిల్ వరంగల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT NO. SE/TW/WGL/NIT/191 to 195/2019-20 తేది: 29-11-2019
పనుల సంఖ్య (5). పనుల పేరు: ములుగు జిల్లా, తాడ్వాయి మండలం, ITDA ఏటూరు నాగారం SS నందు మేడారం వద్ద ముఖ్య ప్రదేశాల నందు త్రాగునీరు, పారిశుధ్యం మరియు యార్డ్ లైటింగ్‌తో కమ్యూనిటీ షెల్టర్ల నిర్మాణం (3 పనులు), సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ యొక్క నిర్మాణం (1 పని), 22 కి.మీ.ల పొడవునా సోలార్ లైటింగ్ ఏర్పాటు మరియు ఇతర సివిల్ పనులు (1 పని), ECV మొత్తం: రూ. 5.85 కోట్లు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం (ఆన్‌లైన్) : 03-12-2019న సా. 5.00 గం. నుండి. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం (ఆన్‌లైన్): 11-12-2019న మ. 3.00గం.వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది & సమయం: 11-12-2019న సా. 5.00గం. వాణిజ్య బిడ్ తెరచు తేది & సమయం: 13-12-2019న సా. 5.30గం. తదుపరి వివరాలు TWED శాఖ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లు www.eprocurement.gov.in వద్ద చూడవచ్చు. ఇమెయిల్ ఐడి:setwwgl7@gmail.com. ఫోన్ నం. 0870-2567645.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, వరంగల్
DIPR RO. No. 1825-DP/CL/Advt/1/2019-20, Dt: 30/11/2019

శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ
రాజన్న సిరిసిల్లా జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు
ఆర్.సి.నం. సి1/460/2019 తేది: 28.11.2019
శ్రీ సమ్మక్క సారలమ్మ మరియు మహాశివరాత్రి జాతర సందర్భముగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము నందు భక్తుల సౌకర్యార్థము 1) తాత్కాలిక పందిళ్లు ఏర్పాటు చేయుట. 2) తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం చేయుట. 3) తాత్కాలిక విద్యుత్ దీపాలంకరణ చేయుట మరియు మొదలగు పనుల కొరకు గురించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.inకు లాగాన్ అవ్వండి. కరంట్ టెండర్సుపై క్లిక్ చేసి శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వర్క్స్ సెలెక్ట్ చేయండి.
సం/- ఎం.ఎం.డి క్రిష్టవేణి, బి.ఏ.ఎల్.ఎల్.బి. రీజనల్ జాయింట్ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి (F.A.C.)
DIPR RO. No. 515-PP/CL/Advt/1/2019-20, Dt: 30/11/2019

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, O&M సర్కిల్-III, గోషామహల్, హైదరాబాద్-012.

| ఇ-టెండరు ప్రకటన నెం. మరియు తేది | పని పేరు | అంచనా కాంట్రాక్టు విలువ |
|---|---|---|
| 36 & 37 /CGM (E) / O&M C.III/D5/2019-20, Dt. 30.05.2019 (7th Call) (1st call As per G.O MS No.66, Dt: 20.04.2009, I & CAD Dept.) | O&M డివిజన్.V యొక్క సబ్-డివిజన్-Iలోని బోట్స్ క్లబ్ సెక్షన్ పరిధిలో భోలక్‌పూర్ (చిలకల్‌గూడ సోర్స్) ప్యాకేజ్-I మరియు భోలక్‌పూర్ (మేకలమండి సోర్స్) ప్యాకేజ్-IIలో నీటి సరఫరా వ్యవస్థను పటిష్టపరచుట మరియు అభివృద్ధి. | శ్రేణి రూ. 337.92 లక్షల నుండి రూ. 782.93 లక్షలు |

1. టెండరు డాక్యుమెంట్లు ఆన్‌లైన్ ద్వారా తేది: 29-11-2019న మరియు 30-11-2019న రా॥ 7.00 నుండి లభిస్తాయి మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది: 13-12-2019 మరియు 16-12-2019.
2. సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా-చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-III, HMWSSB, గోషామహల్, హైదరాబాద్-12.
3. సమాచారమును నిర్దిష్టముగా 'ZIP' ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కాంట్రాక్టర్లు/సంస్థలు కోరబడుతున్నారు.
4. తదుపరి వివరాలను @ http://www.eprocurement.gov.inలో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-III, గోషామహల్, హైదరాబాద్-500 012.

OFFICE OF THE MUNICIPAL COUNCIL
MANCHERIAL, DIST: MANCHERIAL
NOTICE INVITING QUOTATIONS
NIQ NO: E1/89/MNCL-MPTY/14FC/2019-20 DATED: 30-11-2019
Sealed Quotations are invited by the Commissioner, Mancherial Municipality from the Manufacturers/Authorized Dealers as mentioned in the following table up to 3.00 P.M. on 06/12/2019 and the said quotations will be opened on the same day of 4.00 P.M. in the presence of the intending quotationers or their authorized representatives. The applicant should furnish the a Demand Draft for Rs: 1000.00 (Rs One thousand only) towards the cost of participation Fee (Non Refundable) drawn in favor of Commissioner, Mancherial Municipality. The tenders received after due date and time will not be considered.

| Sl. No | Name of the Item | Specifications | Quantity in Nos |
|---|---|---|---|
| 1 | Backhoe loader | Excavator loader fitter with 1.10 Cum loader bucket. 0.24 Cum Excavator bucket powerd by Water cooled 4 Cylinder Diesel Engine of 76 HP @ 2200 RPM & Fitted with Torque convertor, shuttle Reverser, Synchromesh gear box with Rear industrial Tyres or from any reputed firm | 1 |
| 2 | Tractor with Dozer | Blade Tractor Having Engine Capacity of 55 HP and attached with Fronten blade and Rear plough (2 Forrowed) or from any reputed firm | 1 |
| 3 | Mini Lorry | Mini Lorry STRONG Chassis 13.8T GVW fitted with PTO day cabin, 'Hseries' diesel engine (BS4) 6 speed synchromesh gear box-ODGB, ABS, with 7 Cum tipper body (TwinRam-UBT) fabricated and mounted by our authorized body builder with 7Nos 8.25R20 Radial Tyres) | 3 |
| 4 | Bottle Crushing Machine | Reputed Company make with 15 KW power capacity granulating auto collecting system, sound proof 1040 kg weight, Grinding chamber 480x330, out put 300-460kg/h, stationary cutter-2nos, Rotary cutter 6nos, 20HP motor 10mm mesh sige etc complete | 1 |
| 5 | Fogging Machine with Trolley mounted | Reputed Company make with Thermal Fog Machine Type, starting mechanism fully automatic power, 16L Gasoline Tank capacity, 3.30 lit/per hour fuel consumption, 100L-150L solution tank capacity, tank material with stainless steel and battery of 12V DC Vehicle etc complete | 2 |

Terms and conditions
1. Manufacturers or authorized dealers should produce Firm registration
2. Copy of GST Registration
3. Copy of latest Income Tax Clearance Certificate
4. The quotations shall be submitted along with (Individual) DD Rs. 1000.00 in favor of Commissioner, Mancherial Municipality
5. The Municipal Commissioner, Mancherial reserves the right to Reject any or all the quotations received without assigning any Reasons.

Contact Details Commissioner (9849905886)
Municipal Engineer (9849906721)
Sd/- Commissioner, Mancherial Municipality.


# ప్లాస్టిక్‌ను బంద్ చేద్దాం

- నూతన సంప్రదాయానికి శ్రీకారం చుడదాం
- బాన్సువాడను ఆదర్శ మున్సిపాలిటీగా నిలుపుతా
- మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- రూ.100 కోట్లతో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవం
- కేటీఆర్ కృషితో తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి : స్పీకర్ పోచారం



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు



బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సభకు హాజరైన ప్రజలు

**కామారెడ్డిజిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సమాజానికి హానికరమైన ప్లాస్టిక్‌ను పూర్తిగా బంద్ చేయాలని పురపాలక, ఐటీ శాఖ మంత్రి కే తారక రామారావు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దడానికి నూతన సంప్రదాయాన్ని అందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి నియోజకవర్గమైన కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రూ.100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను కేటీఆర్ శనివారం ప్రారంభించారు. బాన్సువాడలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల అభివృద్ధి, కల్కి చెరువు ట్యాంక్‌బండ్, ఆడిటోరియాలను స్పీకర్ పోచారం, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దడంలో పోచారం కృషి కండ్లకు కనిపిస్తున్నదని కితాబిచ్చారు. బాన్సువాడ మున్సిపాలిటీని ఆదర్శవంతమైన పురపాలికగా తీర్చిదిద్దే బాధ్యతను తానే స్వీకరించనున్నట్టు కేటీఆర్ ప్రకటించారు.

**నిత్య విద్యార్థి పోచారం..**

రాజకీయాల్లో ఏ పాత్రను పోషించినప్పటికీ నిత్య విద్యార్థిగా ఉండటం స్పీకర్ పోచారంకే చెల్లిందని మంత్రి కేటీఆర్ అన్నారు. వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సభలో ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలేసి ఇంటికెళ్లారని గుర్తుచేశారు. ఆ సమయంలో ఓపికగా అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో సభలో పోచారం ఇచ్చిన సమాధానం కదిలించిందని చెప్పారు. ప్రశ్నలు అడిగిన సభ్యులు సభలో లేరని గుర్తుచేసినప్పటికీ వాళ్లు ఇంట్లో టీవీలోనైనా చూస్తారనే ఆశతో జవాబిస్తున్నట్టుగా పోచారం చెప్పడం నచ్చిందని గుర్తు చేసుకున్నారు. రైతులకు సంబంధించిన అంశంలో ఆయనకు ఉన్న శ్రద్ధాసక్తుల వల్లే దేశంలోనే పేరుగాంచిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు జయప్రదమైనట్టు గుర్తుచేశారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పోచారం లక్ష్మీపుత్రుడని నామకరణం చేశారని వెల్లడించారు.

**కేటీఆర్ వల్లే పారిశ్రామికాభివృద్ధి..**

పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా కేటీఆర్ కృషి వెలకట్టలేనిదని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కొనియాడారు. విదేశీ పర్యటనల్లోనూ అక్కడి కంపెనీలను ఒప్పించి తెలంగాణ గడ్డపై వాటి స్థాపనకు కేటీఆర్ పడుతున్న శ్రమ వృథా పోలేదన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 11 వేల పరిశ్రమలకు టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతులు ఇచ్చారని పోచారం గుర్తుచేశారు. దాదాపుగా 12 లక్షల మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. బాన్సువాడ పట్టణాభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎంతగానో సహకారాన్ని అందిస్తున్నారన్నారు. కేటీఆర్ కృషి వల్లే బాన్సువాడ పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిందని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో అలీసాగర్ జలాశయం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా నిజాంసాగర్‌లోకి నీళ్లు తీసుకొచ్చేందుకు ఆలోచన చేస్తున్నట్టు పోచారం చెప్పారు. అనేక కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలబెట్టడంలో కేటీఆర్ పాత్ర గొప్పదని రోడ్లుభవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

**మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం..**

హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో నేరుగా వచ్చిన మంత్రి కేటీఆర్‌కు బాన్సువాడలో ఘన స్వాగతం లభించింది. పోచారం శ్రీనివాసరెడ్డి తనయులు పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. మహిళలు తిలకం దిద్దారు. మంత్రి కేటీఆర్ స్వయంగా బ్యాటరీ వెహికిల్ నడుపుతూ పట్టణంలో కలియతిరగడం అందరిని ఆకట్టుకున్నది. ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, జాజాల సురేందర్, బిగాల గణేశ్‌గుప్తా, షకీల్ అహ్మద్, ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రావు, వీజీగౌడ్, ఆకుల లలిత, ఎంపీ బీబీపాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్లు దఫేదార్ శోభరాజు, దాదాన్నగారి విఠల్‌రావు, ఆంజనేయులు, ఈగ గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం, మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- డబుల్‌బెడ్‌రూం, బాధితురాలి సోదరుడికి ఉద్యోగం కల్పిస్తాం
- మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

**గీసుగొండ:** హన్మకొండలో హత్యాచారానికి గురైన బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండలంలోని కొమ్మాలలోని బాధిత కుటుంబాన్ని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి మంత్రి శనివారం పరామర్శించారు. శిశు సంక్షేమ శాఖ నుంచి ప్రభుత్వం అందించే రూ.51వేలు చెక్కును బాధితురాలి తల్లిదండ్రులకు మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నిందితుడు సాయికుమార్‌కి కఠిన శిక్ష పడేలా చూస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇల్లుతోపాటు బాధితురాలి సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తామని అన్నారు.

**శంషాబాద్ ఘటన హేయమైంది**

శంషాబాద్‌లో వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన హేయమైనదని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శనివారం ములుగు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఇప్పటికే దోషులను అరెస్టు చేశామనీ, నిందితులకు కఠిన శిక్ష పడేవిధంగా చూస్తామన్నారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించిందని మంత్రి వెల్లడించారు.

**బాధిత మహిళల జ్ఞాపకార్థంగా మొక్క నాటిన గువ్వల అమల**

**అచ్చంపేట రూరల్:** దుర్మార్గుల దాడిలో మృతి చెందిన మహిళల జ్ఞాపకార్థంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని జీబీఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సతీమణి గువ్వల అమల పిలుపునిచ్చారు. ఇటీవల డిండి ప్రాజెక్టులో హత్యాచారానికి గురైన పలువురి జ్ఞాపకార్థం శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట అటవీశాఖ కార్యాలయం సమీపంలోని స్మృతి వనంలో బాలరాజు, అమల మొక్కలు నాటారు.

## నేడు, రేపు తేలికపాటి వానలు

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తమిళనాడు, శ్రీలంక మధ్య కొమోరిన్, దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 0.9 కి.మీ. నుంచి 1.5 కి.మీ. మధ్య ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. దీని ప్రభావంతో చలి తీవ్రత కొంత తగ్గుతున్నదని, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో తూర్పు దిశ నుంచి గాలులు వీస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

**హైదరాబాద్‌లో పెరిగిన ఉష్ణోగ్రతలు**

ఉపరితల ద్రోణి ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురువొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# డేంజర్ బెల్స్!


మొదటిపేజీ తరువాయి...


ప్రవృత్తి.. సమాజానికి అనేక ప్రశ్నలు సంధించింది. బండికి పంక్చర్ అయిందంటూ సహాయపడతామంటూ వెటర్నరీ డాక్టర్‌ను అతి కిరాతకంగా హతమార్చింది నలుగురైతే.. ప్రేమిస్తున్నట్లు నమ్మించి.. ఊరవతలకు తీసుకెళ్లి లైంగికదాడిచేసి చంపినవాడు మరొకడు. ఈ రెండు ఘటనల్లోనూ నిందితులు తాము చేసిన నేరం బయటపడకుండా ఉండటానికి.. సాక్ష్యాలను దొరక్కుండా చేయడానికి అతి తెలివితో వ్యవహరించడం.. మరింత దారుణానికి ఒడిగట్టడం గమనించాల్సిన అంశం. ఒక నేరం చేస్తే దాన్నుంచి ఎలా తప్పించుకోవాలో కూడా ఈ 'డాటా ఫ్రీ' మాధ్యమమే వీరికి నేర్పిస్తున్నది. ఇంటర్నెట్, ఉచిత డాటా ఆఫర్లు, విరివిగా పెరిగిన సెల్‌ఫోన్ వినియోగంతో.. ఏ వైపునుంచి ఏ రకంగా ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని భయంకరమైన పరిస్థితి నెలకొంది. పసిబిడ్డల నుంచి వృద్ధుల వరకు ఎవరిపైనైనా దాడులు జరిపే నేర ప్రవృత్తి తీవ్రమైంది.

**వినాశానికి ఉపయోగపడుతున్న టెక్నాలజీ**

టెక్నాలజీతో ఉపయోగమెంతో వినాశమూ అంతే. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌పై మన వేళ్ల కదలికలు ప్రపంచాన్ని మన కండ్లముందు పెడుతున్నాయి. మనిషిని మనీషిగాచేసే సమాచారం ఎంత ఉంటున్నదో.. నరరూప రాక్షసునిగా మార్చే ఆయుధాలూ అంతే విరివిగా ఉన్నాయి. లక్షల అశ్లీల వెబ్‌సైట్లు, నేరానికి పురిగొల్పే సైట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్క అక్షరం నొక్కితే అమ్మా.. నాన్న.. అక్కా.. చెల్లి.. తేడాలేకుండా కనిపిస్తున్న దారుణమైన వీడియోలు యువత మెదళ్లను తొలుస్తున్నాయి. వీటి కారణంగా విశృంఖలత్వం పెరిగిపోతుందని, మానవ సంబంధాలు, బంధుత్వాలు ఖూనీ అవుతాయని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వెయ్యికిపైగా అశ్లీల వెబ్‌సైట్లను రద్దుచేసింది. కానీ.. ఏదోరూపంలో అవి యాక్సెస్ అవుతూనే ఉన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో కట్టడి చేయడం సాధ్యం కావడంలేదు. ఆరేండ్ల పిల్లాడి చేతిలో కూడా మొబైల్ ఉండటం.. తెలిసీతెలియని వయసులో చూడరాని దృశ్యాలను చూడటం, చదువకూడని సమాచారాన్ని చదువడంతో పసివయసులోనే వారి వ్యక్తిత్వాన్ని వక్రమార్గంపట్టిస్తున్నది. అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ప్రపంచంలో 35% మంది మహిళలు వేధింపులకు గురవుతున్నారు. ఇందుకు కారణమైన మదపుటాలోచనల వెనుక స్మార్ట్‌ఫోన్ భూతం ఉన్నదని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు.

**నేర ప్రవృత్తిని పసిగట్టగలమా?**

మన చుట్టూ ఉండే వ్యక్తులు మనతో ఎలా మాట్లాడుతున్నారు? వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పులు వస్తున్నాయి? వారు మనల్ని చూసే విధానంలో ఏమైనా తేడా ఉందా? తదితర విషయాలను గ్రహించగలిగితే ఆ వ్యక్తితో మనకు వచ్చే ఆపదను కొంతవరకు గుర్తించవచ్చని సైకాలజిస్టులు చెప్తున్నారు. ఇటీవల వరంగల్‌లో యువతిని ప్రేమిస్తున్నానని చెప్పిన వ్యక్తే హత్యచేశాడు. అతని మాటలను గుడ్డిగా నమ్మకుండా కొంత ఆలోచించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని సైకాలజిస్టుల అభిప్రాయం. ఏ వ్యక్తి అయినా నేరానికి పూనుకొంటున్నప్పుడు ముందుగా వారి మొహంలో ఒకింత టెన్షన్.. భయం కనిపిస్తాయి. మాటలు తడబడుతాయి. అలజడికి గురవుతారు. ఈ అంశాలను ఏ కాస్తయినా పసిగట్టగలిగితే ప్రమాదంనుంచి బయటపడవచ్చని సైకాలజిస్టులు అంటున్నారు. కొందరు తమ వాహనాలపై వెగటు పుట్టించే బొమ్మలు.. నినాదాలు రాసుకుని తిరుగుతుంటారు. అలాంటి వ్యక్తులతో మాట్లాడాలంటే కొంత భయానికి గురవడం సహజం. ముఖ్యంగా మహిళలు తమ కార్యాలయాల్లో తమ చుట్టూ ఉండే వ్యక్తుల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**బంగారు భవిష్యత్తు నాశనం..!!**

మద్యం మత్తులో చాలామంది తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, క్షణికసుఖం కోసం క్రూరత్వానికి పాల్పడి విలువైన జీవితాన్ని వదులుకుంటున్నారని ప్రొఫెసర్ రవికాంత్ తెలిపారు. నేరం చేశాక.. దొరకకూడదనే భయంతో హత్యలకు పాల్పడి.. కటకటాల్లోకి వెళుతున్నారని, ఇందులో మైనర్లు కూడా ఉండటం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. ఎక్కడో అక్కడ ఈ తరహా ఘటనలను జరుగుతూనే ఉన్నాయి. కేవలం శిక్షలతో ఈ పరిస్థితులను మార్చలేమని.. మూలాలను అన్వేషించి పరిష్కారాన్ని కనుగొనాలని అన్నారు. అమెరికాలో ప్లే స్కూల్ నుంచే చిన్నారులకు మొదటగా అత్యవసర నంబర్‌ను పరిచయంచేసి.. ఆపదొస్తే.. డయల్ ఎలా చేయాలో నేర్పుతుంటారని సైకాలజిస్టు డాక్టర్ కవిత చెప్పారు. స్కూల్‌స్థాయి నుంచే మానవవిలువలు పెంపొందించే అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నదని ప్రభుత్వ స్కూల్ టీచర్ రవళి అన్నారు. కుటుంబ విలువలు కాపాడేలా విద్యార్థులకు సిలబస్‌లో పాఠాలు చేర్చాలని అభిప్రాయపడ్డారు.

### మహిళలు వస్తువులుకాదు



ప్రవర్తన ఆధారంగా నేరస్తులను ముందస్తుగానే మనం అంచనా వేయొచ్చు. ఏదైనా పెద్ద క్రైం చేయడానికి ముందు చిన్నవి చాలాచేసి ఉంటారు. ఏమవుతుందిలే అనే భావన వారిలో కలుగుతుంది. వారు పెరిగిన వాతావరణం.. ఇంట్లో వాతావరణంకూడా వారిని నేరాలోచనల వైపు ఉసిగొల్పుతాయి. మహిళలను వస్తువుగా చూడటం ప్రారంభిస్తారు. అదొకరకమైన పర్సనాలిటీ డిజార్డర్. చేసేది కరెక్టుగా భావించి రాక్షసానందం పొందుతారు. మాదకద్రవ్యాలు వారికి తోడైతే ప్రవర్తన మరింత రాక్షసంగా ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఆలోచించి వారిని సరైనమార్గంలో పెట్టాలి.

**- వై నాగేందర్‌రావు, సైకియాట్రిస్టు**

### అధైర్యపడవద్దు



అమ్మాయిలు ప్రమాదకర పరిస్థితులు ఎదురయినప్పుడు ధైర్యంగా ఉండాలి. ఆ సమయంలో మనం వ్యవహరించే విధానమే ఆపద నుంచి బయటపడేస్తుంది. అఘాయిత్యానికి బలైన వెటర్నరీ డాక్టర్ ఒక రకమైన ఎమోషన్‌కు గురై ఆలోచన శక్తిని కోల్పోయారు. భయమేస్తుందనే టాపిక్ చుట్టూనే ఆమె ఆలోచనలు సాగాయి. కానీ తనను తాను ఎలా కాపాడుకోగలనో ఆలోచించలేకపోయింది. ఎట్టి పరిస్థితుల్లో అమ్మాయిలు ముందుగా ధైర్యంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా ఉన్నప్పుడే వారి బలహీనతలు తెలుసుకోగలుగుతాం. వారికి అన్నివిధాల అండగా ఉన్నామనే భావన పేరెంట్స్ కలిగించాలి.

**- డాక్టర్ జీసీ కవిత, ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్టు**

# టీఎస్‌జెన్‌కోకు రెండు స్కోచ్ అవార్డులు

## ఎనర్జీ, ఆర్డర్ ఆఫ్ మెరిట్ సర్టిఫికెట్ క్యాటగిరీల్లో కైవసం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన టీఎస్‌జెన్‌కో సమర్థ పనితీరుతో రెండు స్కోచ్-2019 అవార్డులను కైవసం చేసుకొన్నది. ఎనర్జీ, ఆర్డర్ ఆఫ్ మెరిట్ సర్టిఫికెట్ క్యాటగిరీల్లో తెలంగాణ జెన్‌కోకు ఈ అవార్డులు లభించాయి. శుక్రవారం (నవంబర్ 29న) ఢిల్లీలో జరిగిన స్కోచ్ సమ్మిట్-ఇండియా ఎకనామిక్ ఫోరం సదస్సులో స్కోచ్ చైర్మన్ సమీర్ కొచ్చర్ నుంచి టీఎస్‌జెన్‌కో సీజీఎం రమేశ్ ఈ అవార్డులను అందుకొన్నారు. టీఎస్‌జెన్‌కో పనితీరు అద్భుతమని స్కోచ్ ప్రతినిధులు ప్రశంసించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో టీఎస్‌జెన్‌కో ముందుండటంతో స్కోచ్ సిల్వర్ అవార్డు-2019 అవార్డు లభించింది. ఈఆర్పీ టీఎస్‌శక్తి టీమ్‌ను టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు అభినందించారు. ఉద్యోగుల సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు.



ఢిల్లీలో స్కోచ్ చైర్మన్ సమీర్ కొచ్చర్ నుంచి అవార్డు అందుకుంటున్న టీఎస్‌జెన్‌కో సీజీఎం రమేశ్

# మరోసారి సత్తాచాటిన తెలంగాణ ఇన్నోవేటర్లు

## ముగ్గురికి జాగృతి సస్టెయినబుల్ ఎంటర్‌ప్రైజెస్ అవార్డులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఇన్నోవేటర్లు మరోసారి జాతీయస్థాయిలో సత్తా చాటారు. కోకాకోలా ఇండియా సహకారంతో నవంబర్ 28, 29 తేదీల్లో ముంబైలో నిర్వహించిన 'జాగృతి సస్టెయినబుల్ ఎంటర్‌ప్రైజెస్ అవార్డ్స్-2019' ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ముగ్గురు ఇన్నోవేటర్లు విజేతలుగా నిలిచారు. దేశవ్యాప్తంగా ఎంపికైన ఆరుగురు విజేతల్లో ముగ్గురు తెలంగాణవారే ఉండటం విశేషం. వాటర్, రీసైక్లింగ్, అగ్రికల్చర్ క్యాటగిరీల్లో వారికి ఈ అవార్డులను అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఉదయ్ నడివాడే, రాజేశ్ సరాఫ్ ఆవిష్కరణ మొదటి బహుమతి, భువనగిరి జిల్లాకు చెందిన గోదాసు నరసింహ ఆవిష్కరణకు ద్వితీయ బహుమతి, మరో క్యాటగిరీలో నిజామాబాద్‌కు చెందిన నరసింహాచారి మండాజి ఆవిష్కరణకు ప్రథమ బహుమతి లభించింది. ఫైనల్‌కు చేరుకున్న ఐదుగురు తెలంగాణ ఇన్నోవేటర్లకు ఈనెల జరిగే జాగృతి యాత్రకు ఆహ్వానం లభించింది.



ముంబైలో అవార్డు అందుకుంటున్న తెలంగాణ ఆవిష్కర్తలు

## కేసుల పరిష్కారంలో మధ్యవర్తులది కీలకపాత్ర

### అవగాహన సదస్సులో జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వాణిజ్య వివాదాలను పరిష్కరించడంలో న్యాయవాద మధ్యవర్తులది (అడ్వకేట్ మీడియేటర్స్) కీలకపాత్ర అని హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ ఎంఎస్ రాంచంద్రరావు పేర్కొన్నారు. మీడియేషన్ అండ్ కన్సీలియేషన్ ప్రాజెక్టు కమిటీ (ఎంసీపీసీ), టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన న్యాయవాద మధ్యవర్తులకు హైదరాబాద్‌లోని తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో జస్టిస్ రాంచంద్రరావు పాల్గొన్నారు. వాణిజ్య వివాదాలతోపాటు ఇతర కేసుల్లో మీడియేటర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కమర్షియల్ కోర్ట్స్ యాక్ట్ - 2015 ఆధారంగా కేసులను సానుకూలంగా ముగించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ సభ్య కార్యదర్శి జీవీ సుబ్రమణ్యం, ఎంసీపీసీ సభ్య కార్యదర్శి ధర్మేందర్ రాణా తదితరులు పాల్గొన్నారు.

# హరితహారం భేష్

- అటవీ, పర్యావరణశాఖ మంత్రుల సమావేశంలో కేంద్ర మంత్రి ప్రకాశ్‌జవదేకర్
- పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ ఆదర్శం: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



శనివారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన అన్ని రాష్ట్రాల అటవీ, పర్యావరణశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్, తెలంగాణ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పచ్చదనం పెంపు ద్వారా పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న హరితహారం మంచి ఫలితాలను ఇస్తున్నదని కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్‌జవదేకర్ ప్రశంసించారు. కేవలం మొక్కలు నాటడానికే పరిమితం కాకుండా వాటిని సంరక్షించుకొనేందుకు తీసుకొంటున్న చర్యలు చాలా బాగున్నాయని అన్నారు. మొక్కల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తేవడం మంచి పరిణామమని అభినందించారు. శనివారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో అన్ని రాష్ట్రాల అటవీ, పర్యావరణశాఖ మంత్రులతో కేంద్ర మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ భూముల్లో అడవుల పెంపకం, కంపా నిధుల వినియోగం.. తదితర అంశాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వివరించారు. ఐదేండ్ల క్రితమే తెలంగాణలో సీఎం కేసీఆర్ పర్యావరణ పరిరక్షణకు బృహత్తరమైన చర్యలు ప్రారంభించినట్టు చెప్పారు. రాష్ట్రంలో 24 శాతంగా ఉన్న అడవులను 33 శాతానికి పెంచాలనే లక్ష్యాన్ని చేరుకొనేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తున్నామన్నారు. హరితహారంలో 230 కోట్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటివరకు 175 కోట్ల మొక్కలను నాటినట్టు తెలిపారు. వీటిలో దాదాపు 50 శాతానికిపైగా మొక్కలను బతికించుకోగలిగామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లోని బీడు భూములను అడవులుగా తీర్చిదిద్దామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం మొక్కల పరిరక్షణకు కఠిన చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. చట్టం గురించి వివరిస్తుండగా కేంద్రమంత్రితోపాటు వివిధ రాష్ట్రాల మంత్రులు ఆసక్తిగా విన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ శోభ కూడా పాల్గొన్నారు.

### ఆకుపచ్చగా మారుతున్న తెలంగాణ

పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమావేశం అనంతరం మీడియాతో చెప్పారు. అటవీ సంరక్షణకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల వల్ల రానున్న మూడు, నాలుగేండ్లల్లో తెలంగాణ ఆకుపచ్చగా మారబోతున్నదని వెల్లడించారు. సోలార్ పవర్ ద్వారా బోర్ల నుంచి అడవుల్లోని జంతువులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని, జంతువుల కోసం గడ్డి క్షేత్రాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం రూ.3,110 కోట్ల కంపా నిధులు విడుదల చేసిందని, ఈ ఏడాది రూ.500 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందని చెప్పారు.



శనివారం తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో కేరళ అధికార భాష శాసనసభ కమిటీ సభ్యులు

# తెలంగాణ పథకాలు బాగున్నాయి

- కేరళ అధికార భాష శాసనసభ కమిటీ ప్రశంసలు
- రాష్ట్ర అసెంబ్లీని సందర్శించిన కమిటీ సభ్యులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బాగున్నాయని కేరళ అధికార భాష శాసనసభ కమిటీ సభ్యులు ప్రశంసించారు. అసెంబ్లీ ఆవరణ కూడా బాగుందని కొనియాడారు. శనివారం వారు తెలంగాణ అసెంబ్లీని సందర్శించారు. అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు ప్రభుత్వ విప్ గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. కేరళలో శాసనమండలి లేకపోవడంతో తెలంగాణలోని శాసనమండలి, సభ్యుల సంఖ్య, ఎన్నుకునే విధానం, వారి బాధ్యతలు, విధుల గురించి తెలుసుకునేందుకు సభ్యులు ఆసక్తి కనబరిచారు. తెలంగాణ అసెంబ్లీలో మౌలిక సదుపాయాలు, సభ పనితీరు, రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, శాసనసభా కార్యకలాపాల్లో తెలుగు వినియోగంపై సభ్యులకు సునిత వివరించారు. ఈ బృందంలో కమిటీ చైర్మన్ ఈఎస్ బిజిమోల్, కమిటీ సభ్యులు అన్వాలన్, ఎల్దోస్ పీ, సీకే హరీంద్రం, టీవీ ఇబ్రహీం, జేమ్స్ మాథ్యు, డీకే మురళీ, కేరళ అసెంబ్లీ సెక్రటరీ విజయ్ అమార్తరాజ్ ఉన్నారు.

# కులవివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం

- లైంగికదాడి బాధితులకు సత్వర న్యాయానికి చర్యలు
- 'సివిల్ రైట్స్ డే'లో కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి
- అంబేద్కర్ అందరివాడు: ఎర్రోళ్ల శ్రీనివాస్



సివిల్ రైట్స్ డే సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల, చీఫ్‌విప్ దాస్యం, ఎమ్మెల్సీ నవీన్‌రావు, బుద్ధవనం ప్రాజెక్టు ఓఎస్డీ మల్లెపల్లి లక్ష్మయ్య తదితరులు

**మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** కులవివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కార్మిక సంక్షేమశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కుల, మత, ప్రాంతాలతో నిమిత్తం లేకుండా, యావత్తు రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని చెప్పారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్ మార్వాడి గ్రౌండ్‌లో నిర్వహించిన 'సివిల్ రైట్స్ డే' కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దళితులందరినీ ధనికులుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నదన్నారు. ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించారని చెప్పారు. లైంగికదాడి బాధితులకు సత్వర ఆర్థికసాయం అందించడంతోపాటు వారిలో మనోధైర్యాన్ని నింపుతూనే నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా కమిషన్‌తోపాటు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ అందరివాడని, కానీ కొన్ని వర్గాలకు చెందిన వ్యక్తిగానే ఆయనను గుర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే అంబేద్కర్ అందరివాడని, దేశంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా రాజ్యాంగాన్ని రూపొందించారనే అంశంపై అవగాహన కల్పించాలని కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సివిల్ రైట్స్ డేను నిర్వహిస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం అసమానతలు లేని తెలంగాణను నిర్మించేందుకు కృషిచేస్తున్నదన్నారు. కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం చట్టాలను వాడుకుంటున్నారని, ఇలా చేయడం వల్ల చట్టాలపై ప్రజలకు చులకన భావన కలుగుతున్నదని చెప్పారు. మున్ముందు ఇలా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైంగికదాడి బాధితులకు ఇప్పటివరకు రూ.40 కోట్లు సాయం కింద అందించామని ఆయన చెప్పారు.

### అంబేద్కర్ దేశానికే మార్గదర్శి

రాష్ట్రంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు ఎక్కడ జరిగినా పాల్గొంటానని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చెప్పారు. అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి సమాజం కృషిచేయాలని పిలుపునిచ్చారు. బుద్ధవనం ప్రాజెక్టు ఓఎస్డీ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దేశానికే మార్గదర్శి అని చెప్పారు. సమాజంలో కులవివక్ష పూర్తిగా పోవాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణలో దళితులపై దాడులు పూర్తిగా తగ్గాయన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను సన్మానించారు. కులాంతర పెండ్లిళ్లు చేసుకున్నవారికి రూ.50 వేల చొప్పున అందించారు. అనంతరం సహపంక్తి భోజనాలుచేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్, ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బీ విద్యాసాగర్, ఎం రాంబల్‌నాయక్, కే నీలాదేవి, ఎస్ దేవయ్య, చిల్కమర్రి నర్సింహ, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ జితేందర్, గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, ఎస్సీ సంక్షేమశాఖ డైరెక్టర్ కరుణాకర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జాయింట్ కలెక్టర్ కే విద్యాసాగర్, డీఆర్వో మధుకర్ రెడ్డి, డీసీపీ పద్మజా, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శనివారం హైదరాబాద్‌లోని సంక్షేమభవన్‌లో బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రగతిపై సమీక్షిస్తున్న మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్

# సీఎం కేసీఆర్ దార్శనికత అమోఘం

## బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రగతిపై మంత్రులు గంగుల, శ్రీనివాస్‌గౌడ్ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దార్శనికత అమోఘమని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. అన్ని వర్గాలకు సమప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని సంక్షేమం వైపు పరిగెత్తిస్తున్నారని వారు చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సంక్షేమభవన్‌లో బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రగతిపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. బీసీ కులాల సంక్షేమంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఇప్పటికే ఎన్నో పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. బీసీ కులాల కోసం 80 ఎకరాల భూమి కేటాయించారని, 40 కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించుకొనేందుకు రూ.80 కోట్ల నిధులు మంజూరుచేశారన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రెడ్డి, వైశ్య సంఘాల నిర్మాణంలో కుదుర్చుకొన్న ఒప్పందాల మాదిరిగానే బీసీ కులాల భవనాలకు కూడా అదేమాదిరి ఒప్పందాలు చేసుకోవాలని కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ అనితారామచంద్రన్, అదనపు కార్యదర్శి సైదా, మేడ్చల్, రంగారెడ్డి జేసీలు విద్యాసాగర్, హరీశ్, బీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్‌కుమార్ పాల్గొన్నారు.

## అంతర్వేదిలో మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనర్సింహస్వామి వారిని శనివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతర్వేది ఆలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనంచేసి ప్రసాదం అందజేశారు.

## యూజీసీ మార్గదర్శకాలపై 22 నుంచి సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాయ్‌పూర్‌లోని రవిశంకర్ శుక్లా యూనివర్సిటీలో ఈ నెల 22, 23 తేదీలలో 'సేఫ్‌క్యాంపస్-యూజీసీ మార్గదర్శకాల అమలు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారని జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం అఫిలియేటెడ్ కాలేజీలకు లేఖ పంపించి జేఎన్టీయూహెచ్ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారు. సదస్సులో పాల్గొనదలిచిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో రూ.500 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

# క్రిస్మస్ వేడుకలకు రూ.15 కోట్లు



మాసబ్‌ట్యాంక్‌లో క్రిస్మక్ కానుకలను ప్రదర్శిస్తున్న మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, స్టీఫెన్‌సన్ తదితరులు

- 19లోగా క్రిస్మస్ కానుకల పంపిణీ పూర్తిచేయాలి
- సన్నాహక సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్

**అహ్మద్‌నగర్:** క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరుచేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో క్రిస్మస్ వేడుకలను వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లుచేస్తున్నామని తెలిపారు. శనివారం మాసబ్‌ట్యాంక్ శాంతినగర్ పశుసంవర్ధకశాఖ క్యాంపస్‌లో హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి అన్నిశాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులతో నిర్వహించిన క్రిస్మస్ సన్నాహక సమావేశంలో తలసాని మాట్లాడారు. ఎల్బీస్టేడియంలో తొమ్మిది వేలమంది అతిథులతో సీఎం కేసీఆర్ పాల్గొనే క్రిస్మస్ విందుతోపాటు అన్ని చర్చిల్లో వేడుకల నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. హైదరాబాద్ క్రిస్మస్ నిర్వహణ కమిటీలు వేయనున్నామని, ఆ కమిటీలు నియోజకవర్గాల్లోని చర్చిలను గుర్తించి క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేస్తాయన్నారు. 19లోగా క్రిస్మస్ కానుకల పంపిణీ, విందులు పూర్తిచేయాలని తలసాని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనున్న క్రిస్మస్ కానుకలను ప్రదర్శించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, మైనార్టీ సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ఎమ్మెల్యేలు జాఫర్ మెరాజ్ హుస్సేన్, మాగంటి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, స్టీఫెన్‌సన్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ పాల్గొన్నారు.



టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో సుబ్బా రావును సన్మానిస్తున్న కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్ తదితరులు

# రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ సుబ్బారావు పదవీకాలం రెండేండ్లు పొడిగింపు

## సుబ్బారావును సన్మానించిన టీఎన్జీవో, ఉద్యోగ సంఘాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకపాత్ర పోషించిన ఉద్యమనేత పరిటాల సుబ్బారావుకు తగిన గుర్తింపు లభించింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ పరిటాల సుబ్బారావు పదవీకాలాన్ని మరో రెండేండ్లు పొడిగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న సుబ్బారావు హైదరాబాద్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించారు. సుబ్బారావు పదవీకాలాన్ని పొడిగించడం పట్ల తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హర్షం వ్యక్తంచేసింది. శనివారం టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో సుబ్బారావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ తగిన గుర్తింపు ఇస్తున్నారన్న విషయం మరోసారి రుజువయ్యిందన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, ముజీబ్‌హుస్సేన్, రాజేశ్‌కుమార్, రాంకిషన్, శ్యాంసుందర్, టీజీవో నేతలు జగన్‌మోహన్‌రావు, హసన్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ల్యాబ్‌లను, సిబ్బందిని పెంచండి

## డెంగీ, స్వైన్‌ఫ్లూ నివారణపై హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దోమల ద్వారా సంక్రమించే డెంగీ, స్వైన్‌ఫ్లూ, మలేరియా తదితర వ్యాధులను వేగంగా గుర్తించేందుకు ల్యాబ్‌లను, శిక్షణ పొందిన సిబ్బంది సంఖ్యను పెంచాలని హైకోర్టు.. శుక్రవారం అధికారులను ఆదేశించింది. దోమల ద్వారా సంక్రమించే సీజనల్ వ్యాధుల కట్టడి, నివారణపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై మరోమారు విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాష్ట్రంలో వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించింది. వ్యాధులపై సామాజిక, ఇతర మాధ్యమాల ద్వారా అవగాహన పెంచాలని పేర్కొన్నది. వ్యాధుల నివారణకు ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు తదితర అంశాలపై అఫిడవిట్ దాఖలుచేయాలని సీఎస్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 13కు వాయిదా వేసింది.

# హుజూర్‌నగర్‌లో బంజారా భవన్



రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా శనివారం తన క్యాంపు కార్యాలయంలో మొక్క నాటుతున్న కరీంనగర్ జాయింట్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్
- కరీంనగర్ టవర్‌సర్కిల్

- గిరిజన గురుకులం నిర్మాణానికి నిధులు మంజూరు
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సత్యవతి రాథోడ్

**హైదరాబాద్ / హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉపఎన్నిక అనంతరం అక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నిలబెట్టుకొంటున్నారని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. అందుకనుగుణంగా రూ.28.57 కోట్లతో గిరిజన బాలుర గురుకుల విద్యాలయం ఏర్పాటు, బంజారా భవన నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్టు చెప్పారు. హుజూర్‌నగర్ అభివృద్ధిపై దృష్టిసారించి నిధులు విడుదల చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్‌పై ఉన్న పూర్తి విశ్వాసంతో హుజూర్‌నగర్ ప్రజలు టీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కృతజ్ఞత సభకు హాజరైన సీఎం కేసీఆర్.. నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు విడుదల చేస్తానని హామీ ఇచ్చారని, ఆ మేరకు నిధులు మంజూరుచేస్తున్నారని చెప్పారు. బంజారా భవనాన్ని నిర్మించేందుకు అనువైన భూమిని గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన గురుకుల విద్యాలయం వచ్చే ఏడాది నుంచి ప్రారంభమవుతుందని, భూసేకరణ పూర్తిచేసి పనులు చేపడుతామని పేర్కొన్నారు.

**కేసీఆర్‌కు, జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు: సైదిరెడ్డి**

హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరుచేయడంపై ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సంతోషం వ్యక్తంచేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, సహకరించిన మంత్రి జగదీశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హుజూర్‌నగర్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయగా.. గిరిజన గురుకుల పాఠశాల, బంజారాభవన్, వివిధ అభివృద్ధి పనులకు రూ.98.37 కోట్ల నిధులు విడుదలచేస్తూ మూడు జీవోలిచ్చింది.


# ఆర్థ్రైటిస్ మీద విజయానికై



డాక్టర్ సాయి లక్ష్మణ్ అన్నే

**ఆర్థ్రైటిస్** ఏదైనా కీళ్ళను ప్రభావితం చేస్తుంది, కానీ మోకాలు మరియు తుంటి కీళ్ళలో ఎక్కువగా కనిపిస్తుంది. 2025 నాటికి భారత దేశం ఆస్టియో ఆర్థ్రైటిస్ రాజధానిగా ఉద్భవిస్తుంది, ఎందుకంటే మన దేశంలో 60 మిలియన్లకు పైగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

**ఆర్థ్రైటిస్** పురుషులతో పోలిస్తే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది మరియు వారిలో 14% మంది ప్రతి సంవత్సరం ఇటీవలి సర్వే ప్రకారం వైద్యులను సంప్రదిస్తున్నారు. అందుబాటులో ఉన్న చికిత్సలు, రోగులు మోకాలి పట్టీల నుండి ఆయుర్వేదం & ప్రత్యామ్నాయ చికిత్సల వరకు అనేక పద్ధతులను ప్రయత్నిస్తున్నారు, అయితే వీటిలో ఏదీ దీర్ఘకాలిక ఫలితాలను ఇవ్వదు మరియు తాత్కాలిక ఉపశమనం మాత్రమే ఇవ్వగలదు. మొత్తం మోకాలి మార్పిడి సులభంగా అంగీకరించబడనప్పటికీ, ఇది దీర్ఘకాలిక మోకాలి నొప్పికి శాశ్వత పరిష్కారం ఇస్తుంది, శాశ్వత చికిత్సా విధానంగా పరిగణించబడుతుంది. రోగులు శస్త్రచికిత్సను ఎప్పుడు పరిగణించాలి-వీల్ చైర్, వాకర్ లేదా స్టిక్ ఉపయోగించి మంచం పట్టేవారు, కాలు చుట్టూ వైకల్యాలు కలిగి ఉండేవారు మరియు దీర్ఘకాలిక పెయిన్ కిల్లర్లపై ఆధారపడి ఉండేవారు. ప్రామాణిక మౌలిక సదుపాయాలు అంటు వ్యాధులను తగ్గిస్తాయి; జాయింట్ రీప్లేస్మెంట్ సెంటర్ కోసం సెట్ చేయబడిన గ్లోబల్ స్టాండర్డ్స్ ఆపరేటింగ్ థియేటర్ ఉండాలి, ఇది మాడ్యులర్ సీమ్లెస్ ఓటీ విత్ హెపా ఫిల్టర్లు & అడ్వాన్స్‌డ్ ఎయిర్ ఫ్లో సిస్టమ్స్ విత్ స్ట్రింజెంట్ అసెప్టిక్ మేనేజ్మెంట్ ప్రోటోకాల్స్, ఇది శస్త్రచికిత్స తర్వాత అంటువ్యాధుల రేటును తగ్గించడంలో సహాయపడుతుంది. బాడీ ఎగ్జాస్ట్ సిస్టమ్స్ లేదా సూట్లు మరియు హెల్మెట్లను అంటువ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి అదనంగా ఉపయోగిస్తారు. టెక్నాలజీలో తాజా టెక్నాలజీ పురోగతి కంప్యూటర్ నావిగేషన్ సిస్టమ్, పేషెంట్ స్పెసిఫిక్ ఇన్స్ట్రుమెంటేషన్ మరియు రోబోటిక్ నావిగేషన్ వంటి సాధనాలకు దారితీసింది, ఇది సర్జన్‌కు కీలు భాగాల యొక్క మొత్తం అమరిక మరియు అరమరిక మెరుగుపరచడానికి సహాయపడుతుంది, తద్వారా రోగులు త్వరిత గతిన కోలుకుంటారు.

ఆధునిక శస్త్రచికిత్సా పద్ధతులు కనీస ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు (చిన్న కోత), కండరాల విడిపోయే పద్ధతులు (కండరాలను కత్తిరించాల్సిన అవసరం లేదు మిడ్వాస్టస్, సబ్వాస్టస్), క్రూసియేట్ నిలుపుదల మోకాలి మార్పిడి (లిగమెంట్‌లను కత్తిరించాల్సిన అవసరం లేదు), ఎముక సంరక్షణ పద్ధతులు. (కనిష్ట ఎముకను కత్తిరించడం మరియు తొలగించడం) సురక్షితంగా వేగవంతంగా కోలుకోడానికి మరియు త్వరగా హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అవడానికి దోహదం చేస్తాయి.

కొండాపూర్‌లోని కిమ్స్ హాస్పిటల్స్ ఎముకలు మరియు కీళ్ళ మార్పిడి విభాగం అధిపతిగా ఉన్న ప్రఖ్యాత జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ సాయి లక్ష్మణ్ అన్నే మాట్లాడుతూ, 'సర్జన్ యొక్క నైపుణ్యాలు, అందుబాటులో ఉన్న ఉత్తమ పద్ధతులు, ఇన్నోవేషన్స్, టెక్నాలజీ మరియు ఇంప్లాంట్లు కలిసి ఆర్థ్రైటిస్ యొక్క నొప్పిని తొలగించి పూర్తి కదలికను పునరుద్ధరించడానికి తోడ్పడతాయి'.

పాత కోబాల్ట్ క్రోం లోహంతో, మనుగడ మంచిది. ఇంప్లాంట్ మెటలర్జీలో పురోగతితో, ఆక్సిడైజ్డ్ జిర్కోనియం వంటి అధిక టైర్డ్ బాడీ లోహాలలో రియాక్టివ్ కాని లోహంతో దీర్ఘకాలిక మనుగడ సాధ్యమవుతుంది.

కోబాల్ట్ క్రోం లోహం గత 50 సంవత్సరాలకు పైగా ఉపయోగించబడింది మరియు సుమారు 15-20 సంవత్సరాల వరకు మనుగడ ఉన్నట్లు తెలిసింది. శస్త్రచికిత్స చేయించుకుంటున్న ఎక్కువ మంది యువ మరియు చురుకైన ఆర్థ్రైటిక్ రోగులతో, ఇటీవలి పురోగతులు జిర్కోనియం ఆక్సైడ్ ఇంప్లాంట్లు ప్రవేశపెట్టడానికి దారితీశాయి. ఇది పూత కాదు, సిరామైజ్డ్ టాప్ లేయర్. ఇది 20 సంవత్సరాలకు పైగా మనుగడను నిరూపించింది. రోగికి విపరీతమైన ప్రయోజనంగా ఇది నిలుస్తుంది. ఎందుకనగా ఇది తక్కువ అరుగుదల గుణం కలిగినది. ఈ అరుగుదలను బట్టి కీలు వదులు కావడం లేదా తిరిగి మార్చడం ఆధారపడి వుంటాయి.

అలా కాకుండా, తక్కువ కీలు ఉపరితల ఘర్షణ కలిగి ఉండటం వలన రేంజ్ ఆఫ్ మోషన్/కీలు కదలికల సామర్థ్యం మెరుగుపడుతుంది. ఈ టెక్నాలజీలో, చాలా తక్కువ అరుగుదల కలిగియుండటం మరియు 20 సంవత్సరాలకు పైగా ఉండటం వలన, ఇది యువ మరియు చురుకైన రోగులకు చాలా అనువైన ఎంపికగా వుంటుంది.

ఆరోగ్య సంరక్షణ దృష్టాంతంలో, రోగులకు ప్రయోజనం చేకూర్చే మరింత సాంకేతిక పరిజ్ఞానం వస్తుందని మరియు భారతదేశంలో మొత్తం ఆరోగ్య సంరక్షణను మారుస్తుందని భావిస్తున్నారు.

నమస్తే తెలంగాణ /nt.zindagi
WWW. NTNEWS.COM
# జిందగీ
ఆదివారం 1 డిసెంబర్ 2019

## ఈమె నీళ్లను తాకకూడదు



**ఎవరికైనా ఎలర్జీ వచ్చిందంటే వారు సరిగా స్నానం చేయకపోవడం వల్ల వచ్చిందనేవారు? అసలు సమస్య నీళ్లే అయితే ఆ బాధ ఎవరికి చెప్పకోవాలంటున్నది ఓ అమ్మాయి. ఆమె కన్నీళ్లు కార్చకూడదు. చెమట పట్టేలా పని చేస్తే అంతే ఇక. శరీరంపై నీళ్లు పడితే చాలు యాసిడ్ పడినట్లుగా ఎగిరి గంతేస్తుంది. ఎందుకంటే ఆమెకు 'వాటర్ ఎలర్జీ'.**

ఇదేంటి వాటర్ ఎలర్జీ కూడా ఉంటుందనుకుంటున్నారా? ఉంది. ఈ సమస్య ఉన్నప్పుడు ఏమవుతుందో తెలియాలంటే తెస్సా గురించి తెలుసుకోవాల్సిందే.. ప్రపంచంలో చాలామందికి చాలా రకాల ఎలర్జీలు ఉంటాయి. పొరపాటున వారు వాటిని తాకినా, తిన్నా ప్రాణాలకే ప్రమాదం. ఇదే తరహాలో తెస్సా హాన్సెన్ స్మిత్ అనే 21 ఏండ్ల యువతి 'ఆక్వాజెనిక్ అర్టికేరియా' అనే ఎలర్జీతో బాధపడుతున్నది. ఆమె నీటిని తాకితే చాలు వెంటనే జ్వరం వస్తుంది. నీళ్లు తగిలిన ప్రాంతంలో చర్మం బొబ్బలెక్కుతుంది. చెమట పట్టినా ఆమెకు ఇదే పరిస్థితి ఏర్పడుతున్నది. అందుకే ఆమె ఆటలు ఆడడం మానేసింది. ఎక్కువగా నడవడానికి కూడా భయపడుతుంది. దీంతో తన యూనివర్సిటీ క్యాంపస్‌లో కూడా కారులోనే తిరుగుతున్నది.

### నెలకు రెండుసార్లు స్నానం

ఈ ఎలర్జీతో ఏ పనిచేయాలన్నా భయపడుతూనే ఉంటుంది. ఆఖరికి నెలలో రెండుసార్లు మాత్రమే స్నానం చేస్తున్నది. అది కూడా భయపడుతూనే. ఆ సమయంలో వళ్లంతా ఎర్రగా దద్దుర్లు ఏర్పడుతాయి. బాధ కలిగినప్పుడూ మనస్ఫూర్తిగా ఏడవలేని పరిస్థితి ఆమెది. అంతేకాదు పండ్లు, కూరగాయలు ఏమి తినాలన్నా అందులో నీటిశాతం తక్కువగా ఉండాలి. లేదంటే నోటిలో పుండ్లు వస్తాయంటున్నది. ఈ సమస్య చిన్నతనం నుంచీ ఉందని తెలియదు. మొదట్లో దద్దుర్లు వస్తుంటే సబ్బులు, షాంపూలు వాడకం అనుకునేవాళ్లు. పదేండ్ల తర్వాత డాక్టర్ చికిత్స తీసుకున్నారు. అప్పుడే వాటర్ ఎలర్జీ అని తేలింది. తెస్సా తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లే కాబట్టి ఆమెను కాపాడుకోగలుగుతున్నారు. వాస్తవానికి నీటితో ఎలర్జీ వస్తుందని ఎవరూ భావించరు. చాలామంది శుభ్రంగా ఉండకపోతే ఎలర్జీ వస్తుందని భావిస్తారు. ఆమె తల్లిదండ్రులు కూడా మొదట్లో అదే అనుకున్నారు. ఆమె స్నానానికి వాడుతున్న సబ్బులు, షాంపూలు మార్చి చూశారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి వైద్య పరీక్షలో ఆమెకు 'ఆక్వాజెనిక్ అర్టికేరియా' ఉందని తెలిసి షాకయ్యారు. ఈ వ్యాధి నివారణ కోసం ఆమె రోజుకు 9 రకాల మాత్రలు మింగుతున్నది. ప్రపంచంలో 100 కంటే తక్కువ మందికి మాత్రమే ఈ సమస్య ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు.

### వంట చిట్కాలు

- అల్లం వెల్లుల్లి పేస్టు ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే కొద్దిగా ఉప్పు, పసుపు కలిపి పెట్టుకుంటే ఎంతకాలం అయినా నిల్వ ఉంటుంది.
- మటన్ బిర్యానీ వండేటప్పుడు మటన్ ముదురుగా ఉంటే త్వరగా ఉడకకపోతే ఓ చిన్న పచ్చి బొప్పాయి ముక్క వేయాలి.
- పండ్లతో చేసిన ఎలాంటి స్నాక్స్‌నైనా నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. వీటిని టిఫిన్‌లా కూడా తీసుకోవచ్చు. చిల్ బనానా, పీనట్, బటర్, తక్కువ ఫ్యాట్ ఉన్న పెరుగు, తగిన పరిమాణంలో అల్పాహారంగా తీసుకోవచ్చు.
- దోశ, చపాతీ, ఆమ్లెట్‌లలో కూడా నూనె లేకుండా చూసుకునే పద్ధతులనే ఎంచుకోవాలి. పాప్‌కార్న్ లాంటి స్నాక్స్‌లో జీర్ణశక్తిని పెంపొందించే పీచుపదార్థం ఉండడంతో తిన్న ఆహారం తేలిగ్గా జీర్ణమవుతుంది.
- పోలెలు తయారు చేసేటప్పుడు ఒక స్పూన్ పాలపౌడర్ చేర్చితే పూర్ణాలు టేస్ట్‌గా ఉంటాయి.
- కందగడ్డను ఇడ్లీ ట్రేలో ఉంచి ఉడికిస్తే మెత్తగా వస్తుంది.
- సాంబార్ చేసే సమయంలో కందిపప్పును ఉడికించేటప్పుడు కొన్ని పల్లీలు కూడా కలిపి ఉడికిస్తే సాంబార్‌కు మంచి రుచి వస్తుంది.
- కూరలు మరింత టేస్టీగా రావాలంటే పోపులో కాస్తంత ఇంగువ వేయాలి.

## వారే పరిష్కరించారు



**వ్యక్తిగత మరుగుదొడ్లు లేక ఎంతోమంది గ్రామీణ మహిళలు ఇప్పటికీ నరకయాతన పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఓ మహిళా ప్రొఫెసర్ ముందుకువచ్చింది. తక్కువ ఖర్చుతో మరుగుదొడ్లు నిర్మించుకునేలా 200మంది మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది. వీరు 21 రాష్ట్రాల్లో 400లకుపైగా మరుగుదొడ్లను నిర్మించారు.**

కేరళకు చెందిన భవానీరావు అనే మహిళా ప్రొఫెసర్ గ్రామీణ మహిళలు ఎదుర్కొనే పలు సమస్యలపై పరిశోధనలు చేస్తూ వినూత్న పరిష్కారాలను అందిస్తున్నది. వ్యక్తిగత మరుగుదొడ్లు లేక మహిళలు పడే ఇబ్బందులను గురించి తెలుసుకున్నది. భవానీరావు వారికి సరైన పరిష్కారం అందించాలనుకున్నది. తక్కువ ఖర్చుతో మరుగుదొడ్లను నిర్మించేలా సరికొత్త విధానాలను గురించి అన్వేషించింది. అమ్మాచి ల్యాబ్స్ ఇంజినీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అతితక్కువ ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అక్కడ వారు ఎటువంటి విధానాలను అవలంభిస్తున్నారో తెలుసుకొన్నది. వారి సమస్యను వారే పరిష్కరించుకొనేలా మరుగుదొడ్ల నిర్మాణంలో కొంతమంది మహిళలకు శిక్షణ ఇవ్వాలనుకున్నది. అందుకోసం కేరళ, తమిళనాడు, ఒడిషా వంటి ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 200మంది గ్రామీణ మహిళలను ఎంపిక చేసింది. వారికి తక్కువ ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణాన్ని గురించి వివరించేందుకు ప్రాంతీయ భాషల్లో కొన్ని త్రీడి యానిమేషన్ వీడియోలు తయారు చేసింది. వీటి ద్వారా నిర్మాణ శైలి గురించి మహిళలకు వివరించే ప్రయత్నం చేసింది. అలా శిక్షణ పొందిన 200మంది మహిళలు ఎనిమిది రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడ పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ 55 వేల వరకూ ఖర్చవుతుంది. ఈ మహిళలు కేవలం 14 వేలకే మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 21 రాష్ట్రాల్లోని వివిధ గ్రామాల్లో 400లకు పైగా మరుగుదొడ్లను నిర్మించారు.



కాటమరాయుడు, టెంపర్, గోపాలగోపాల, మనం, గుండెజారి గల్లంతయ్యిందే.. వంటి సినిమాల్లో జనాదరణ పొందిన గీతాలున్నాయి. ఆ టైమ్‌లో సోషల్ మీడియా ప్రభావం చాలా తక్కువ. అందుకే ఆ పాటలన్నీ కొద్దిమందికే చేరువయ్యాయి. ఈనాటి ట్రెండ్‌లో అయితే ఆ గీతాలు సంగీతప్రియులకు మరింత విస్తృతంగా చేరువయ్యేవి.

**ఇష్క్, గుండెజారి గల్లంతయ్యిందే, మనం, గోపాల గోపాల.. వంటి సినిమాలతో స్వరకర్తగా తెలుగు చిత్రసీమపై తనదైన ముద్ర వేశారు అనూప్ రూబెన్స్. జనరంజకమైన మెలోడీ బాణీలను సృష్టించడంలో సిద్ధహస్తుడిగా పేరు సంపాదించుకున్నారు. ఆయన సంగీతాన్నందిస్తున్న తాజాచిత్రం '90 ఎం.ఎల్.' త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా అనూప్ రూబెన్స్ పాత్రికేయులతో సంభాషించారు. ఆ ముచ్చట్లివి.**

# భారతీయుల రక్తంలోనే పాట ఉంది!

- **'90 ఎం.ఎల్.' కథలో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలేమిటి?**

■ నిజజీవితంలో నాకు 90 ఎం.ఎల్. వేయడం అలవాటు లేదు (నవ్వుతూ). అయితే దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు మాత్రం కిక్ వచ్చినంత పనైంది. ఓ వినూత్న కథాంశంతో దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. ఇందులో మొత్తం ఏడు పాటలుంటాయి. చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి మాస్ ఎంటర్‌టైనర్‌కు స్వరాల్ని అందించడం ఆనందంగా ఉంది. హీరో కార్తికేయ ఈ సినిమాలో మరో రేంజ్‌లో కనిపిస్తాడు.

- **మీరు భిన్న స్థాయిల్లో ఉన్న కథానాయకుల సినిమాలకు సంగీతాన్నందించారు. హీరో ఇమేజ్ సంగీతాన్ని ఎంత వరకు ప్రభావితం చేస్తుందనుకుంటున్నారు?**

ప్రేక్షకుల్లో హీరోకున్న ఇమేజ్, బాడీలాంగ్వేజ్, నృత్యపరమైన కౌశలాలు.. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకునే సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను అందించడం జరుగుతుంది. డ్యాన్స్ ఇరగదీసే హీరోకు మాస్ బీట్ చేయడంలో ఎలాంటి పరిమితులు ఉండవు. అలాగే హీరో ఎలివేషన్ షాట్స్‌లో బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను అతని ఇమేజ్‌కు అనుగుణంగా ఇవ్వాల్సి ఉంటుంది. సంగీత చర్చల్లో దర్శకుడితో ఈ విషయాలన్నింటినీ చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

- **బడ్జెట్‌పరమైన పరిమితులు సంగీతపరంగా నాణ్యతను ఏ విధంగా నిర్దేశిస్తాయి?**

■ బడ్జెట్ తప్పకుండా మ్యూజిక్ క్వాలిటీని ప్రభావితం చేస్తుంది. భారీ బడ్జెట్ సినిమాలకు విదేశాల్లో మిక్సింగ్, ఆర్కెస్ట్రైజేషన్ చేయడం వల్ల మరింత బెస్ట్ క్వాలిటీని అందించగలుగుతాం. ఒక పాట కూర్పులో ఎన్నో వాయిద్యాల్ని వాడుతాం. కొన్ని ప్రత్యేకమైన వాయిద్యాల్ని వాడడం వల్ల శబ్దపరంగా కొత్త అనుభూతి కలుగుతుంది. అది పాటకు కొత్త సొగసును జత చేస్తుంది.

- **ఇటీవలి కాలంలో మీ కెరీర్ అనుకున్నంత ఆశాజనకంగా లేదనిపిస్తున్నది?**

■ 'మీ కెరీర్‌లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఉన్నాయి. పెద్ద సినిమాలకు పనిచేశారు. అయినా ఈ మధ్యన వెనుకబడ్డారు' అని చాలామంది అడుగుతున్నారు. కొన్ని పెద్ద సినిమాలు అనుకోకుండా మిస్ అయ్యాయి. అయితే అవకాశాలు రావడం మన చేతిలో లేదు. సినిమాలు చేజారినందుకు ఎలాంటి బాధ లేదు. ఏ టైమ్‌కు ఏది జరగాలో అది జరుగుతుందనే సిద్ధాంతాన్ని నేను విశ్వసిస్తాను.

- **స్వతహాగా మీరు ఎలాంటి సంగీతాన్ని ఇష్టపడుతారు?**

■ మెలోడీ పాటల్ని బాగా ప్రేమిస్తాను. అదే టైమ్‌లో మాస్ బీట్స్‌ను కూడా ఇష్టపడుతాను. నా కెరీర్‌లో మాస్ నంబర్స్ చాలా తక్కువ. టెంపర్, గోపాల గోపాల, పైసా వసూల్, కాటమరాయుడు, ఇష్క్ వంటి సినిమాల్లో మంచి మాస్‌బీట్స్‌ను అందించాను. నాకున్న పరిధిలో మాస్‌పరంగా కూడా మంచి స్వరాల్ని అందించాననే సంతృప్తి ఉంది.

- **ప్రస్తుతం సంగీత దర్శకుల మధ్య ఎలాంటి పోటీ ఉందనుకుంటున్నారు?**

■ ఆరోగ్యకరమైన పోటీనే ఉంది. ఎవరైనా సంగీత దర్శకుడు మంచి ఆల్బమ్ అందిస్తే దానిని స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా కొత్త స్వరాలను అందించాలని ప్రయత్నిస్తాం. పోటీ ఉండటం వల్ల క్రియేటివిటీ మరింత ద్విగుణీకృతమవుతుంది.

- **సినిమాల ఎంపికలో మీరు ఏయే అంశాలకు ప్రాధాన్యమిస్తారు?**

■ కథ నచ్చితే చిన్న సినిమాకైనా ఓకే చెబుతాను. సబ్జెక్ట్ బాగా నచ్చడం వల్ల నా సొంత డబ్బులతో మ్యూజిక్ అందించిన సందర్భాలు ఉన్నాయి. పెద్ద సినిమా, చిన్న సినిమా అనే తేడాలేకుండా నాకు వ్యక్తిగతంగా సంతృప్తినిచ్చిన కథల్ని చేయడానికే ప్రాధాన్యమిస్తాను.



- **హాలీవుడ్ తరహాలో భారతీయ చిత్రసీమలో కూడా పాటలు లేకుండా సినిమాలు తీసే ధోరణి పెరుగుతున్నది. దీనిపై మీరేమంటారు?**

■ ఈ ట్రెండ్ వల్ల సంగీత దర్శకుల కెరీర్‌కు ఇబ్బంది ఏమీ ఉండదు. పాటలు లేకుండా తీసిన ప్రతి సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం లేదు. పాట అనేది భారతీయుల రక్తంలోనే ఇమిడిపోయి ఉంది. ఏ భాషా ప్రేక్షకులైనా పాటలు లేకుండా సినిమా చూడటానికి అంతగా ఇష్టపడరు. సంఖ్య తగ్గిపోతుందేమో కానీ భారతీయ సినిమా పాటలేకుండా పోదు.

- **సినిమా జయాపజయాలు సంగీత దర్శకుడి కెరీర్‌ను ఏ మేరకు ప్రభావితం చేస్తాయి?**

■ సినిమా ఫలితం నటీనటులతో పాటు సాంకేతిక నిపుణుల కెరీర్‌ను కూడా ప్రభావితం చేస్తుంది. సంగీతపరంగా చక్కటి ఆదరణ పొందిన చిత్రాలు కొన్ని తీరా విడుదలయ్యాక పరాజయం పాలవుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో సంగీత దర్శకులు ఏమీ చేయలేరు. సినిమా సక్సెస్ అయితేనే స్వరకర్తలకు గుర్తింపు లభిస్తుంది.

సంగీత దర్శకత్వం అంటే కేవలం పాటలు మాత్రమే కాదు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాగమనంలో కీలకంగా ఉంటుంది. లిరిక్స్ లేకున్నా నేపథ్యసంగీతం ఎన్నో భావాల్ని పలికిస్తుంది.

- **వెబ్‌సిరీస్‌లకు సంగీతాన్ని అందించే ఆలోచన ఉందా?**

■ ఇప్పటివరకైతే ఎవరి దగ్గరి నుంచి అలాంటి ప్రతిపాదనలు రాలేదు. సబ్జెక్ట్ నచ్చితే వెబ్‌సిరీస్‌లకు సంగీతాన్నందిస్తాను.

- **మ్యూజిక్ విషయంలో కాపీ కల్చర్ ఎక్కువైపోయిందనే విమర్శలు ఎక్కువవుతున్నాయి?**

■ ప్రతి సంగీత దర్శకుడికి ఓ సిగ్నేచర్ ఉంటుంది. వందల పాటల్లో కొన్నింటి మధ్య సారూప్యతలు కనిపిస్తాయి. అలాగే ఓ ట్యూన్‌ను పోలినట్లు మరో ట్యూన్ కనిపించవచ్చు. దానిని కాపీ అనలేము. ఒక ట్యూన్‌ను స్ఫూర్తిగా తీసుకొని దాని ప్రభావం కనిపించకుండా మనదైన శైలిలో కొత్త స్వరాలను తయారుచేసుకోవడం తప్పేమీ కాదు. అయితే స్వరాలను యథాతథంగా కాపీ కొట్టడం మాత్రం ఖచ్చితంగా తప్పే. అలాంటి పని నేనెప్పుడు చేయను. అలా చేస్తే సంగీత దర్శకుడికి విలువ ఉండదు.

- **ఇటీవలి కాలంలో తెలుగు సినిమా పాటలకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తున్నది. కొన్ని గీతాలు సోషల్ మీడియాలో రికార్డులు సృష్టిస్తున్నాయి. ఈ ధోరణిపై మీరేమంటారు?**

■ శుభపరిణామంగా భావిస్తున్నా. ప్రజల్లో కూడా సంగీతంపట్ల అభిరుచి పెరుగుతున్నది. ప్రేక్షకుల్ని సినిమాలకు రప్పించే సాధనంగా సంగీతం మారిపోయింది. సినిమాకు సంబంధించిన ఆడియో మొదట బయటకు వస్తుంది కాబట్టి...దానిని బట్టి చిత్రాన్ని అంచనా వేస్తున్నారు. ఏమాత్రం తారాబలంలేని సినిమాలు కూడా సంగీతంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. పాటలు నచ్చితే ప్రేక్షకులు సినిమా చూడాలనే ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు.

- **ఓ స్వరకర్తగా మిమ్మల్ని మీరు ఉన్నతీకరించుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తుంటారు?**

■ వరల్డ్ మ్యూజిక్ వింటుంటాను. సంగీతపరంగా వస్తున్న ట్రెండ్స్‌ను పరిశీలిస్తాను. సంగీతాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూనే ఉండాలి. నిత్యవిద్యార్థిగా నేర్చుకునే తత్వం ఉన్నప్పుడే సృజనాత్మకంగా ఆలోచించగలుగుతాం. విభిన్న బాణీలను ప్రేక్షకులకు అందించాలనే తపన ఎక్కువవుతుంది.

...సినిమా డెస్క్ సిఎం. ప్రవీణ్

## మోతాదుకు మించి నిమ్మరసం తాగుతున్నారా?

**ఇంటి నుంచి బయటకు వెళ్తే చాలు. కాసేపటికి దాహం వేస్తుంది. మంచి నీళ్లు తాగేకంటే లెమన్‌వాటర్ తాగేందుకు కొందరు ఎక్కువగా ఇష్టపడుతారు. కొంత మోతాదులో తీసుకుంటే ఫర్వాలేదు. కానీ, మోతాదుకు మించితే ఆరోగ్యానికే ప్రమాదం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఆ ప్రమాదాలేంటో తెలుసుకోండి.**

**దంతాలు :** చాలామంది నిమ్మరసాన్ని డైరెక్ట్‌గా తీసుకుంటారు. ఇది ఎక్కువైతే దంతాలపై ఎనామిల్ దెబ్బతింటుంది. దీంతో పసుపు రంగులోకి మారుతాయి. నాలుకతో పళ్లను తడిమినప్పుడు గరుకుగా తగులుతుంటుంది. దీనికి ఇదే గుర్తు. వెంటనే నిమ్మరసం వాడకాన్ని అదుపులో ఉంచుకోవాలి.

**చిగుళ్లకు ప్రమాదం :** చాక్‌లెట్లు, స్వీట్లు, తింటే పళ్లు పాడవుతాయని అంటుంటాం కదా. నిమ్మరసం ఎక్కువగా తాగడం వల్ల కూడా చిగుళ్లు పాడైపోతాయి. చాలామంది నిమ్మరసంలో షుగర్ కలుపుకొని తాగుతారు. ఆ షుగర్ అణువుల్ని చిగుళ్లపై ఉండే బ్యాక్టీరియా తింటుంది. ఈ విధంగా నిమ్మరసం వల్ల లాభాలే కాదు నష్టాలూ ఉన్నాయి.

**మైగ్రేన్ వచ్చే ప్రమాదం :** కొంతమందికి తలనొప్పిగా ఉన్నప్పుడు టీ తాగుతారు. మరి కొంతమంది ఆకలితో తలనొప్పి వస్తుందని నిమ్మరసం తాగుతారు. అలా తాగడం వల్ల తలనొప్పి వస్తుందని కొందరు అంటున్నారు. వీరు నిమ్మరసానికి ఎంత దూరంగా ఉంటే అంత బెటర్.

**నాలుకపై పగుళ్లు :** నిమ్మరసానికి నాలుకకు అవినాభావ సంబంధం ఉంది. కొన్నిరోజుల పాటు ప్రతి రోజూ నిమ్మరసం తాగడం వల్ల నాలుక రుచి స్పందన పోతుంది. నాలుక మండుతుంది. అక్కడక్కడా పగుళ్లు ఏర్పడుతాయి. అసౌకర్యంగా అనిపిస్తుంది. దీంతో సరిగా మాట్లాడలేరు. ఈ లక్షణాలు వారంపాటు అలానే ఉంటాయి.

**కడుపులో గడబిడ :** అల్సర్లు, అసిడిటీ సమస్యలు కడపునొప్పి వస్తాయి. పేరు కూడా తెలియని కొత్త రోగాలు సంతరించుకుంటాయి. దీనివల్ల పొట్టలో వేడి, వికారం, వాంతులు వస్తున్నట్లు అనిపిస్తుంది.



II.
నమస్తే తెలంగాణ
# చింతన
[ కరీంనగర్ ]
ఆదివారం 1 డిసెంబర్ 2019

## పర్వదినాలు

- పంచమీ తీర్థం/ తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు సమాప్తి, వరంగల్ భద్రకాళీ దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా కాలసర్పయోగ శాంతి (నేడు)
- సుబ్రహ్మణ్య షష్ఠి, వరంగల్ భద్రకాళీ ఆలయంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం (2వ తేది)



## నమో నమామి

**వల్లీశ! దేవసేనేశ!!**
**భక్తపాలన తత్పర!**
**దరహాస ముఖాంభోజ!**
**సుబ్రహ్మణ్య! నమోస్తుతే!!**

'సుబ్రహ్మణ్య షష్ఠి' సందర్భంగా వల్లీ, దేవసేనల హృదయాధీశుడు, భక్తుల ఆలనా పాలనను ఆలకించే సులభ దైవం, ముఖంపై చెదరని చిరునవ్వుతో వెలుగొందే బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఈ స్తోత్రంతో వేడుకొందాం.

# కుమార సౌరభం!

## ఇలా చేద్దాం



**భారతీయ** దేవతామూర్తులలో అత్యంత సుందర స్వరూపునిగా శ్రీమహావిష్ణువునే చాలామంది భావిస్తారు. ఇంతేస్థాయిలో చూడచక్కదనంతో వెలుగొందే దేవతామూర్తి శివకుటుంబంలోనూ ఒకరున్నారు. ఆయనే కుమారస్వామి. 'సుబ్రహ్మణ్య షష్ఠి' సందర్భం ఆ బాలవీరుణ్ణి ఆరాధించే అరుదైన సమయమిది. ఆరు తలలు (షణ్ముఖుడు), పన్నెండు చేతులతో, ఇద్దరు భార్యల (వల్లీ, దేవసేన) సమేతంగా వెలుగొందే పరమశివుని చిన్న కుమారుడే ఈ కుమారస్వామి. హైందవ దేవతలందరిలోకీ విలక్షణ దైవంగా కార్తికేయుడు తనదైన ప్రత్యేకతను సంతరించుకొన్నాడు. సంస్కృత మహాకవి కాళిదాసు విరచితమైన 'కుమార సంభవం' కుమారస్వామి వైభవగాథను ఎంతో గొప్పగా, ప్రామాణికంగా ఆవిష్కరించింది. అసలు అంత చిన్న పిల్లవాడు మహాబలశాలి, ఉగ్రరాక్షస రాజైన తారకాసురుణ్ణి ఎలా సంహరించగలిగాడు? ఆయనకు ఉపకరించిన ఆ 'శక్తి' ఎక్కడిది? ఎవరిది?? శివపార్వతుల అనురాగానికి ప్రతీకగా నిలిచే ఆ బాలసుబ్రహ్మణ్యం జన్మవృత్తాంతం ఆసాంతం ఎంతో ఆసక్తికరం. ఆర్భాటపు ఆరాధనలకు అతీతంగా, తలచినదే కరుణించే దైవంగా పేరొందిన ఈ దేవసేనాని అనుగ్రహానికి పాత్రులమయ్యే అపురూప సమయం ఏడాది కొకసారి మాత్రమే వచ్చే ఈ పుణ్యదినం.

## పద్యం నేర్చుకొందాం

కొడుకుల బట్టి చంపెనని కోపము నందదు, బాలఘాతకున్
విడువు మటంచు చెప్పెడిని, వెఱ్ఱిది ద్రౌపది, వీడు విప్రుడే?
విడువగనేల? చంపుడిటు వీనిని మీరలు చంపరేని నా
పిడికిటి పోటునన్ శిరము భిన్నము చేసెద చూడుడిందఱున్!!

**- బమ్మెర పోతన (శ్రీమద్భాగవతం, 1-167)**

**ఇదీ నేపథ్యం**

# ద్రౌపది ధర్మనిష్ఠ!




రవివర్మ చిత్రాలు

**మహాభారత** సంగ్రామం దాదాపు ముగిసిన తర్వాత దుర్యోధనునికి ఇచ్చిన మాటకోసం అశ్వత్థామ నిద్రలో ఉన్న ద్రౌపది పుత్రుల (ఉపపాండవులు)ను చంపేస్తాడు. దాంతో అర్జునుడు వీరావేశంతో రథంపై అతనిని వెంబడిస్తాడు. ప్రాణభయంతో రథంపై పారిపోయిన అశ్వత్థామ గుర్రాలు అలసిపోయాక, ఇక తనకు చావు తప్పదని తెలుసుకొని, అర్జునునిపైకి 'బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని' ప్రయోగిస్తాడు. అర్జునుడు ఊరుకొంటాడా? ప్రతిగా 'బ్రహ్మాస్త్రాన్ని' వదులుతాడు. కానీ, ఆ క్షణంలోనే, ఈ రెండు శక్తులతో ఏర్పడబోయే ప్రజోపద్రవాన్ని గ్రహించిన అర్జునుడే దానిని నివారించడానికి ఆ రెండు అస్త్రాలనూ ఉపసంహరింపజేస్తాడు. అశ్వత్థామను పశువులా తాటితో బంధించి, ద్రౌపది దగ్గరకు ఈడ్చుకొస్తాడు. శ్రీకృష్ణుడు సైతం అశ్వత్థామ 'వధార్హుడనే' అంటాడు. కానీ, మహా పతివ్రత అయిన ద్రౌపది అసాధారణ ధర్మనిష్ఠను పాటిస్తుంది. అంత దు:ఖంలోనూ మనసును చలింపజేయకుండా, ప్రతీకారానికి పూనుకోకుండా, అశ్వత్థామను చూడగానే నమస్కరిస్తుంది. 'అతణ్ణి బంధవిముక్తుణ్ణి' చేయమంటుంది. ధర్మజ కృష్ణార్జున నకుల సహదేవులంతా ఆమెను కొనియాడితే, ఒక్క భీమసేనుడు మాత్రం కోపంతో ఊగిపోతాడు. అప్పుడు ఆయన నోటినుండి వెలువడిన మాటలే ఇవి. 'బాలఘాతకుడైన అశ్వత్థామను మీరంతా వదిలినా నేను వదలను' అంటూ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తాడు. ఆఖరకు అశ్వత్థామకు 'శిరోముండన' శిక్షను అర్జునుడు అమలుచేస్తాడు. పోతన పద్యరత్నాలలో ఇదొకటి.

**- ముక్తావళి**

## మంచిమాట



నా దేహమే నాకు దేవాలయం. యోగాసనాలే నేను చేసే ప్రార్థనలు.

**-బీకేఎస్ అయ్యంగార్**
ప్రపంచ ప్రసిద్ధ భారతీయ యోగా గురువు
**జయంతి:** డిసెంబర్ 14, **వర్ధంతి:** ఆగస్టు 20
**జీవితకాలం:** 1918-2014

## తత్త్వజ్ఞానం


# పరమాత్మ సాక్షాత్కారం!

■ ఆత్మసాక్షాత్కారంతోనే సాధ్యం ■ ఉపనిషత్తుల్లోనే 'బ్రహ్మానంద రహస్యం' ■ 'ముక్తిజ్ఞానం' అంటే?

**'ఆత్మసాక్షాత్కరం' అంటే 'పరమాత్మను సాక్షాత్కరించుకోవడమే'. ప్రపంచంలో మూడు తత్త్వాలు (పరమాత్మ, జీవాత్మ, ప్రకృతి) ఉన్నాయి. పరమాత్మ ఒక్కడే. సర్వజ్ఞుడు, ఆనంద స్వరూపుడూను. జీవాత్మలు అనేకం. వాటి జ్ఞానం అల్పం. ప్రకృతికీ జ్ఞానం లేదు కనుక, దాన్ని 'జడం' అంటాం. ప్రకృతి పరిణామ శీలత కలది. ఈ ప్రపంచానికి ఉపాదాన కారణం ప్రకృతి. 'ఏది పుడుతుందో అది నశిస్తుంది'. ప్రకృతి నుంచి పుట్టిన ప్రపంచం నశిస్తుంది. అంటే, కనిపించకుండా పోతుంది. ప్రకృతికి పరమాత్మ - జీవాత్మలతోపాటు ఉనికి (Existence) కూడా ఉంది. జీవులు కర్మలు చేయడం వల్ల ప్రకృతి (ప్రపంచరూప) బంధనాల్లో చిక్కుకుంటారు. పరమాత్మను ఆశ్రయిస్తేనే అవి తొలగిపోతాయి.**

**'పరమాత్మను** ఆశ్రయించడమంటే' ఆయనను సాక్షాత్కరింపజేసుకోవడం. అంటే, అనుభవంలోకి తెచ్చుకోవడం. ఎప్పుడైతే పరమాత్మ మన అనుభవంలోకి వస్తాడో అప్పుడే మనకు మోక్షం లభిస్తుంది. పరమాత్మ సాక్షాత్కారం (మోక్షసాధన)లో ఉపనిషత్తుల పాత్ర వెలగట్టలేనిది. 'ఉపనిషద్యతే, ప్రాప్యతే బ్రహ్మవిద్యా అనయా'. 'బ్రహ్మవిద్య దేని మూలంగా లభిస్తుందో' అదే ఉపనిషత్తు. 'ఉపనిషత్తుం నితరాం సమీపే ఉపవేష్టుం సమర్థా భవంతి సాధకా అనయా ఇత్యుపనిషత్'. గురువుద్వారా ఏ బ్రహ్మవిద్యను అభ్యసించి పరమాత్మకు సమీపంలో కూర్చోగలమో దానికే 'ఉపనిషత్తు' అని పేరు. ఉప= సమీపంలో, ని= బాగుగా, షత్= కూర్చోవడం. పరమాత్మకు సమీపంలో బాగుగా కూర్చునేటట్లు చేయడమే ఉపనిషత్తు పని. వేదాల తర్వాత మిక్కిలి ప్రసిద్ధి చెందినవి ఉపనిషత్తులే.

ఉపనిషత్తులను రచించిన వారి పేర్లు అన్నీ మనకు తెలియవు. భారతీయ సాహిత్యంలో 'వేదాంతమని' ప్రేమతో వీటినే పిలుచుకొంటాం. ఉపనిషత్తులు ప్రధానంగా పది. మొదటిది ఈశావాస్యోపనిషత్తు. ఇది యజుర్వేదంలోని చివరి 40వ అధ్యాయం. ఇది మొదలుకొని కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, ఐతరేయ, తైత్తిరీయ, ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులు అన్నీ పరమాత్మ సాక్షాత్కారాన్ని కలిగించడంలో ప్రధాన భూమికను కలిగి ఉన్నాయి. 'న జ్ఞానాదృతే ముక్తి:' 'పరమాత్మ తత్త్వజ్ఞానమే ముక్తి' అని దార్శనికులు పేర్కొంటారు. 'తమేవ విదిత్వా తిమృత్యుమేతి/ నాన్య: పంథావిద్యతే యనాయ'. 'పరమాత్మ సాక్షాత్కారం కంటే మోక్షానికి వేరే దారి లేదని' వేదం ఉద్బోధించిది.



ఈశావాస్యోపనిషత్తు పరమాత్మను గురించి చెప్పిన విషయం గ్రహింపదగింది. 'ఈ చరాచర జగత్తులో పరమాత్మను చూసినట్లే.. పరమాత్మలోనూ చరాచర జగత్తును చూసిన విద్వాంసుడు మోక్షానికి అర్హుడు. పరమాత్మలో ఉన్న జీవకోటిని, తన వంటి సుఖదు:ఖాలను అనుభవించేవానిగా భావించినట్లయితే శోకమనేది ఉండదు. జీవన శోకం విముక్తమవుతుంది. పరమాత్మ పాపం లేనివాడు, అది అంటనివాడుకూడా. కారణ, సూక్ష్మ, స్థూలదేహాలు లేనివాడు. సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపకుడవుతాడు. ఎవరు జడ ప్రపంచాన్ని ఉపాసిస్తారో వారు మృత్యుముఖంలో ఉండిపోతారు. చేతనోపాసన (పరమాత్మ ఉపాసన) వల్ల కలిగే పుణ్యం జడోపాసన (ప్రకృతి ఉపాసన) వల్ల కలుగదు. సత్కర్మలు, ఉపాసన ద్వారా మృత్యువును జయించవచ్చు. జ్ఞానం (విద్య)ద్వారా అమృతత్వాన్ని (పరమాత్మ)ను పొందగలం. ఎవరు ఓంకార స్వరూపుడైన పరమాత్మను భక్తితో, సత్యాచరణతో శరణు వేడతారో వారికి మోక్షానందం కలుగుతుంది'.

'మనకు మానవజన్మను ప్రసాదించింది పరమాత్మ. మనసుకు మనసు, ప్రాణానికి ప్రాణం, సర్వాధారుడు, సర్వాధీశుడూ అతడే. ఆయనవల్లే మనకు లోకాన్ని చూడగల నేత్రాలు లభించాయి. పరమాత్మ జడవస్తువు కాదు, కనుక అతడు మన నేత్రాలకు కనిపించడు. మనసుకూ అందడు. సృష్టి స్థితి లయలకు కారణభూతుడైన వానిగా పరమాత్మను తెలుసుకోవాలి' అని కేనోపనిషత్తు వెల్లడించింది. 'బుద్ధిని సారథిగా చేసుకొని, మనసు పగ్గాలు పట్టుకొని, ఇంద్రియాలనే గుర్రాలను అదుపులో పెట్టుకొంటే జీవాత్మ అనే రథికుడు పరమాత్మ లక్ష్యాన్ని చేరుకుంటాడని' కఠోపనిషత్తులో నచికేతునికి యమాచార్యుడు ఉపదేశించాడు. 'ఓం కార వాచ్యుడైన పరమాత్మను ధ్యానించినట్లయితే కలిగే లాభమేమిటి?' అనే ప్రశ్నకు 'లౌకికసుఖాన్ని లేదా పారలౌకిక సుఖాన్ని, రెండింటిలో దేన్ని కోరితే అదే లభిస్తుందని' ప్రశ్నోపనిషత్తు సమాధానమిచ్చింది. 'లోకాలు మూడు విధాలు. తిండికోసం బతికే వారిది మనుష్య లోకం. పుణ్యకర్మలు చేసేవారిది పితృలోకం. జ్ఞానంలో మోక్షాన్ని సంపాదించుకొనే వారిది దేవలోకం' అని ముండకోపనిషత్తు పేర్కొన్నది. 'పరమాత్మను అంతటా దర్శించాలనీ' ఈ ఉపనిషత్తు చెప్తున్నది (2-1-4).

'అగ్ని ర్మూర్ధా చక్షుషీచంద్ర సూర్యౌ/ దిశ:శ్రోత్రే వాగ్ వివృతాశ్చవేదా:/ వాయు:ప్రాణో హృదయం విశ్వమస్య/ పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాంతరాత్మా'. పరమాత్మ విశ్వరూపమంటే ఇదే. ధనుర్ధారి లక్ష్యాన్ని ఛేదించడానికి బాణాన్ని సంధించినట్లే, పరమాత్మ అనే లక్ష్యాన్ని చేరుకోవడానికి మనం ఓం కారాన్ని ధనుస్సుగా చేసుకొని, దానిలో ఆత్మను బాణంగా సంధించాలి. 'ప్రణవో ధను: శరోహి ఆత్మ బ్రహ్మ తల్లక్ష్య ముచ్యత్' (ముండకం: 2-2-4). 'సత్యమేవ జయతే'- 'సత్యాన్నే ఆశ్రయించాలి. సత్యమే పరమాత్మ' అనికూడా ఈ ఉపనిషత్తు అంటున్నది. ఇందులో శౌనకుడు అడిగిన ప్రశ్న అర్థవంతమైంది. 'ఏం తెలుసుకుంటే అంతా తెలుస్తుంది?'. దానికి అంగిరసుడు ' అపరవిద్య (వేదాదివిద్యలు) లౌకిక సుఖాల్నిస్తే, పరావిద్య (బ్రహ్మచర్యం, తపస్సు, సత్యభాషణ, యథార్థ జ్ఞానం) మోక్షాన్ని ప్రసాదిస్తుందని' తెలిపాడు. పరావిద్య వల్లే పరమాత్మ సాక్షాత్కారమవుతుందన్నది ఈ ఉపనిషత్తు సారం.

'జాగ్రత్ స్వప్న సుషుప్తుల వంటివే సృష్టి స్థితి లయలు. ఇవి పరమాత్మ మహిమను మూడొంతులే తెలుపుతాయి. నాల్గవ వంతు మహిమ అనిర్వచనీయం. దాన్ని సమాధి స్థితిలో మాత్రమే తెలుసుకోగలుగుతాం. దీనికి యోగోపాసన ముఖ్యసాధనం' అని మాండూక్యోపనిషత్తు ప్రబోధిస్తున్నది. 'పరమాత్మే సృష్టికాధారుడు. అతనిలోనే ఈ ప్రపంచం ఓతప్రోతమై ఉంది. సృష్టి తత్త్వం బోధపడితే సృష్టికర్త సాక్షాత్కారం కలుగుతుంది' అని ఐతరేయోపనిషత్తు ఉద్ఘాటిస్తున్నది. 'విద్యకు గురువు పూర్వరూపం. శిష్యుడు ఉత్తరరూపం. ప్రవచనం సంధానం. గురువు శిష్యుణ్ణి మోక్షమార్గంలో నడిపించాలి. సత్యం వద, ధర్మం చర' అన్నది తైత్తిరీయోపనిషత్తు ఉపదేశం. 'సృష్టి స్థితి లయలకు ఏది కారణమో అదే పరమాత్మ తత్త్వం. పరమాత్మను యోగం ద్వారా పొందినట్లయితే బ్రహ్మానందం లభిస్తుంది' అని ఈ ఉపనిషత్తు చెప్పింది. 'మంచిరాజు పొందే ఆనందం ఒక మానుషానందం. 10 రాసి దాని పక్కన 20 పూర్ణ బిందువులు (సున్నాలు) ఉంచితే ఎంత వస్తుందో అంతటిది బ్రహ్మానందం. పరమాత్మ సాక్షాత్కారం వల్ల జీవాత్మ అంతటి ఆనందాన్ని పొందుతాడు' అని ఈ ఉపరిషత్తులోని బ్రహ్మానందవల్లి తెలియజేస్తున్నది.

'అసతోమా సద్గమయా/ తమసోమా జ్యోతిర్గమయ/ మృత్యోర్మా అమృతంగమయ- అసత్తునుంచి సత్తులోకి, చీకటినుంచి వెలుగులోకి, మృత్యు ముఖం నుంచి మోక్షానికి ప్రయాణించాలి' అన్నది బృహదరణ్యకోపనిషత్తు బృహత్ సందేశం. మానవుల కర్తవ్యం అదే. మొత్తంగా 'పరమాత్మ మన హృదయంలోని దహరాకాశంలో ఉంటాడు. నిష్కామ కర్మయోగం ద్వారా అతణ్ణి ఉపాసించాలి. పరమాత్మకు సమీపంలో ఉండడమే సాక్షాత్కారం. మళ్లీ వస్తుందో రాదో తెలియని ఈ ఉత్తమ మానవ జన్మలోనే పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందాలి' అని మన ఉపనిషత్తులు ముక్తకంఠంతో ఉపదేశిస్తున్నాయి. దీనిని ఆచరణ సాధ్యం చేసుకోవడం మన చేతిలోనే ఉంటుంది మరి.



**- మసన చెన్నప్ప**
**సెల్: 98856 54381**

## మోక్షోపదేశం

చాందోగ్యోపనిషత్తులో నారదునికి సనత్ కుమారుడు చేసిన మోక్షోపదేశం తెలుసుకోదగింది. 'వేదాలు, పురాణాలు, సకల విద్యలు నేర్చిన నేను మంత్రవిదుడనయ్యానుగాని, ఆత్మవిదుడను కాలే'దంటాడు నారదుడు. 'నువు నేర్చింది శబ్ద విద్య. కానీ, తెలుసుకోవలసింది ఆత్మవిద్య (పరా విద్య). ఓంకారాతీతుడైన పరమాత్మ గురించి' అని సనత్ కుమారుడిచ్చిన సమాధానం గమనింపదగింది. ఇదే విధంగా, బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు మైత్రేయితో, 'ఆత్మా వారే ద్రష్టవ్యో, శ్రోతవ్యో, మంతవ్యో, నిధిధ్యాసితవ్య:' అంటాడు. అంటే 'పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొని, ఆయన గురించి విని, ఆలోచించి, అతనికే ఆత్మసమర్పణ చేయాలి. అప్పుడే పరమాత్మ సాక్షాత్కారం లభిస్తుంది'.

# చిన్న నీటిగుండంలో పుట్టిన నది!

# నర్మద పరిక్రమ

**తీర్థయాత్ర 31**

**మల్లాది వెంకట కృష్ణమూర్తి**

(గత సంచిక తరువాయి)

**27 అక్టోబర్ 2008, సోమవారం- తొమ్మిదవ రోజు**

పొద్దున్నే నాలుగుకి మెలకువ వచ్చిది. వెంకటేశ్వర రావు, నేను టార్చిలైటు వెలుగులో నర్మద నదికి వెళ్లి స్నానం చేశాం. నదిలో నిలబడి కొద్దిసేపు 'శివపంచాక్షరి జపం' చేశాను. సిద్ధలింగేశ్వర ఆలయంలోనూ 20 నిమిషాలసేపు జపం చేశాను. ఇక్కడి గణపతి విగ్రహానికి ఒక చేతిలో లడ్డు, ఇంకో చేతిలో జపమాల ఉన్నాయి. ఉదయం 6.40కి బస్సులో బయల్దేరాం. మా అదృష్టం కొద్దీ తేళ్లు, పాములు ఎవరినీ ఏం చేయలేదు. అసలు అవి ఎవరికీ కనపడనే లేదు. 12 గంటలకల్లా బార్‌డౌలికి చేరుకొన్నాం. సాయంత్రం 6.45కి మా బస్సు మధ్యప్రదేశ్‌లోని రెండో పెద్ద నగరం జబల్పూర్‌కి చేరుకొంది.

ఇక్కడ దిగంబర జైనులు కాలినడకన నర్మద పరిక్రమ చేస్తారు. ఒకప్పుడు జైన సాధువు ఒకరు ఇక్కడ ఉండేవారు. ప్రజలకు గోధుమలు విసిరి ఇచ్చి, అందుకు బదులుగా ఇచ్చిన డబ్బుతో ఆయన ఈ నేలను కొని, పరిక్రమ వాసులకు ఇవ్వడానికి చిన్న ఇంటిని నిర్మించారు. కాలక్రమేణా అది విస్తరించింది. 'పిసిన్ హరి' అంటే 'పిండి విసరడం'. అందుకే, దీనికి 'పిసిన్ హరి మడియా ఘాట్' అనే పేరు వచ్చింది.

ఇక్కడి వింధ్య పర్వతాల్లోని ఓ లోయలోకి మెట్లు. కింద జలపాతం, అయిదు గుహలు. వాటిలో పాండవులు వనవాస సమయంలో నివసించారని ప్రతీతి. అందుకే, ఈ ప్రాంతానికి 'పాండవా కేవ్స్' అని పేరు వచ్చింది. ఓ సన్యాసి అక్కడ నివసించే వాడు. ఆధ్యాత్మికతతో నిండిన ఆ ప్రదేశం నాకు ఎంతగా నచ్చిందంటే, అప్పట్లో నేను రాసిన నవల 'పడమట సంధ్యారాగం' క్లయిమాక్స్ ఈ లోయలో జరిగినట్లుగా పేర్కొన్నాను.

**28 అక్టోబర్ 2008, మంగళ వారం- పదవ రోజు**

ప్రసన్న గెస్ట్‌హౌజ్ ఆవరణలోని జైన దేవాలయాలు గల కొండపైకి 152 మెట్లు ఎక్కి వెళ్లాం. పైన అనేక మంది జైనులు తపస్సు చేసిన గుహలు, చాలా ప్రాచీన జైన ఆలయాలు ఉన్నాయి. గుళ్లో భక్తులు పోసిన బియ్యం గింజలు నేలమీద పడి ఉన్నాయి. మనం పువ్వులు పెట్టినట్లుగా జైనులు బియ్యాన్ని పోస్తారు. బహుశ పక్షులు తింటాయని కాబోలు. తెలుపు, నలుపు రాళ్లతో చెక్కిన జైన గురువుల నగ్న విగ్రహాలు చాలా ఉన్నాయి. ఇక్కడ జైన మతానికి చెందిన 24 గుర్తులు పెద్ద శిలలపైన చెక్కి ఉన్నాయి. కొండమీద ప్రతీ అంగుళం వదలకుండా ఉపయోగించారు. అప్పటికింకా నిర్మాణం సాగుతున్నది. ప్రీతి విద్యాసాగర్ అనే దిగంబర జైనుడు ఈ సంస్థానానికి అధిపతి. కిందికి వచ్చాక జైన ఎగ్జిబిషన్ చూశాం. స్తంభాలు, దూలాలు ఉపయోగించకుండా కట్టిన చాలా విశాలమైన గుండ్రటి హాలులో చాలా జైన విగ్రహాలు ఉన్నాయి.

ఇక్కడ నర్మద నదినుంచి ఉరికే ప్రఖ్యాత దువాధార్ జలపాతం ఉంది. దాని హోరు కొన్ని మైళ్లదూరం వినిపిస్తుంది. ఇక్కడ నది విశాలంగా పాయలుగా రాళ్ల మధ్య నుంచి పారుతున్నది. నీటి ప్రవాహవేగం బాగా అధికంగా ఉండటంతో స్నానానికి అనుకూలంగా లేదు. ఓ గంట గడిచాక బేడాఘాట్‌కు వెళ్లాం. 'బేడా' అంటే 'గొర్రె'. ఈ ఆకారాన్ని పోలి ఉంటుంది కాబట్టి, ఆ పేరు వచ్చిందని చెప్తారు. ఇక్కడ స్నానానికి అనుకూలంగా ఉంది. అది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన టూరిస్టు స్పాట్ కూడా.

దేశాయ్ మాట్లాడిన రెండు పడవల్లోకి అంతా ఎక్కాం. పడవ నర్మద నదిపై కొద్దిదూరం వెళ్లాక కొండలమధ్య ప్రవాహానికి ఎదురు వెళ్లసాగింది. ఆ కొండల మధ్యగల 20 అడుగుల వ్యాసంతో కూడిన చిన్న పాలరాతి కొండమీద ఓ శివలింగం అందంగా చెక్కి ఉంది. తిరుగు ప్రయాణంలో మా పడవలను ఆ లింగం దగ్గర ఆపితే, అంతా అక్కడికి వెళ్లి అభిషేకం చేశాం. నేను చూడలేదు కానీ, జబల్పూర్‌కి 21 కి.మీ.దూరంలో ఉన్న మేదాఘాట్ అనే గ్రామంలో చిన్నకొండమీద ఓ భక్తుడి త్యాగానికి ఫలితంగా నర్వదేశ్వరుడి రూపంలో శివుడు వెలిశాడన్న కథను ఎక్కడో చదివాను. అక్కడ నందిమీద శివపార్వతులు కూర్చున్న పాలరాతి విగ్రహం ఉంది. అలా ఆదిదంపతులు ఇద్దరూ కలిసి ఉండడం చాలా అరుదు.




**నల్లటి రాతితో చేసిన నర్మద మాత విగ్రహం. వెండికండ్లతో చూడముచ్చటగా ఉన్నది. ఆ ఆలయానికి ఎదురుగా అమరకంఠేశ్వర శివలింగం ఉంది. ఇది స్వయంభువు.**

**29 అక్టోబర్ 2008, బుధవారం- 11వ రోజు**

దేశాయ్ చెప్పినట్లు ఆ రోజు ప్రయాణానికి 13 గంటలు పట్టలేదు. పదిన్నర గంటల్లో సాయంత్రం నాలుగుకి బస్సు అమర్‌కంటక్‌కు చేరింది. మేం బస చేసే మృత్యుంజయ ఆశ్రమంలోకి బస్సు వెళ్లింది. దేశాయ్ అందరికీ గట్టిగా చెప్పారు- ''ఎవరూ ఆశ్రమం దాటి రోడ్డుమీద ఎడమవైపుకు వెళ్లవద్దు. అక్కడ రోడ్డుకింద నర్మద నది నీటిధారలు ఉన్నాయి. వాటిని దాటితే నదిని దాటినట్లు అవుతుంది. ఇక్కడ నర్మద కంటికి కనబడకుండా భూగర్భంలోనూ ఉంది''.

**30 అక్టోబర్ 2008, గురువారం-12వ రోజు**

ఉదయం ఆరుం పావుకు బయల్దేరాం. అరగంటలో మా బస్సు అడవిమధ్య రోడ్డుమీద ప్రయాణించి కపిలధార సమీపానికి చేరింది. దేశాయ్ చెప్పారు- ''అదిగో సిద్ధమాయి''. అంతా అటు చూశాం. నాకు కనపడలేదు. చాలామంది దిగి అవిడను చుట్టుముట్టారు. తర్వాత ఆమె కనిపించింది. సుమారు అయిదడుగుల అయిదంగుళాల ఎత్తు. తైలసంస్కారం లేని జుత్తు. ఆవిడ మొహంలో నాకు ఎలాంటి తేజస్సు కనపడలేదు. ఒక పేదింటి ఆడకూలీలా ఉన్నది. సన్నగా, చామనఛాయలో ఉన్న ఆవిడ వయసు అరవై పైనే అనిపించింది. ఆడవాళ్లలో చాలామందిని దగ్గరకు పిలిచి ఆలింగనం చేసుకొన్నది. మగాళ్ల తలపై చేతులు వుంచి ఆశీర్వదించింది. అందరం కలిసి సిద్ధమాయి కుటీరంలోకి వెళ్లాం.

అడవి మార్గంలో కపిలతీర్థానికి వెళ్లే దారిలో ఉందా కుటీరం. దారి వెంట అనేక వానపాములు. నేనైతే జాగ్రత్తగా వాటిని తొక్కకుండా వెళ్లాను. చెప్పులు లేని సిద్ధమాయి వేగంగా నడిచింది. ఆవిడ పక్కకు వెళ్లాలని ఎంత ప్రయత్నించినా ఆమె వేగాన్ని అందుకోలేకపోయాను.

''మీరు కపిల తీర్థానికి వెళ్లి, స్నానం చేసి అందరికంటే ముందు సిద్ధమాయి కుటీరానికి రండి. నదికి ఇవతలి పక్కవైపే ఉండండి. స్నానం చేస్తూ అవతలి వైపుకు వెళ్లవద్దు. అలా చేస్తే నదిని క్రాస్ చేసినట్టవుతుంది. నర్మద వెడల్పు అక్కడ చాలా తక్కువ'' చెప్పారు దేశాయ్.

మూడు నిమిషాల నడక తర్వాత అందరం కపిలధారకు చేరుకొన్నాం. ఈ ప్రదేశం నర్మద పుట్టిన చోటుకు 7 కి.మీ.దూరం. ఆ ప్రవాహం దాదాపు పదడుగుల ఎత్తునుంచి జలపాతంగా కిందికి దూకుతుంది. నర్మద పుట్టాక వచ్చే మొదటి జలపాతం ఇదే. జలపాతం కిందకి ఉరికిన చోట నది వెడల్పు 10-12 అడుగులు మించి లేదు. ఇక్కడ జాగ్రత్తగా స్నానం చేస్తూ, అట్టే లోతుగా లేకపోవడంతో కొంచెం అవతలి వైపుకు వెళ్లినా నదిని క్రాస్ చేసినట్లు అవుతుంది.

మార్వా జిల్లాలో నర్మద నదీజలాలు నల్లటి బసాల్ట్ శిఖరం మీదినుంచి రెండుగా కిందికి పడతాయి. దీన్నే 'కపిలధార' అంటారు. కపిల మహాముని వెయ్యేండ్లు ఇక్కడే తపస్సు చేశాడని, ఈ ప్రదేశాన్ని సందర్శిస్తే 10 అశ్వమేధ యాగాలు చేసిన పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. ఒడ్డున కపిల మహర్షి తపస్సు చేసినట్లుగా భావించే ఒక చిన్న గుహ ఉంది. అందులో ఓ శివలింగం ఉన్నది. దాని మీదికి పైనుంచి నీటి బిందువులు పడుతున్నాయి.

స్నానాలు చేసి వెనుతిరిగాం. దారిలో 'హరిహరానంద మహామండలేశ్వర్ స్వామి యోగానంద్' పేర్న ఓ ఆశ్రమం ఉంది. ఆ తర్వాత సిద్ధమాయి కుటీరానికి చేరుకొన్నాం. ఎవరో భక్తులు కట్టించి ఇచ్చిన చిన్న ఇటుక, రాళ్ల గది. కొంతభాగం రేకులు, మరికొంత భాగం ఆకులతో కప్పి ఉంది. మా బృందంలోని పలువురు సిద్ధమాయిని పలు కోర్కెలు కోరారు. నా వంతు వచ్చేసరికి, ''నీకేం కావాలి?'' అని అడిగింది. నేను నోరు తెరవబోయే లోపలే ఆమే వారించింది. ''ఇక్కడ చాలామంది వింటారు. చెప్పకు. అంతా మంచే జరుగుతుంది'' అన్నది.

'పరాయి స్త్రీలను మాతృభావంతో చూసే సంస్కారాన్ని ఇవ్వమన్నది' నా కోర్కె. గతంలో ఒకసారి ఆ భావంతో చూసిన స్త్రీ మళ్లీ గుర్తుకు రాకూడదు. కానీ, అది ఒకోసారి నాకు సాధ్యం కావడం లేదు. 'మోక్షం పొందే దాకా ఏ పురుషులకైనా స్త్రీ వాంఛ ఉంటుందని'శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు (భగవద్గీత 12.22). ఈ జన్మలో మనసు అలా దారి మళ్లినా శరీరం వెళ్లకుండా చూసుకోగలను. కానీ, తర్వాతి జన్మలో ఈ జ్ఞానం లేకపోతే? నర్మద మాత నాలోని ఈ చెడు సంస్కారాన్ని తొలగించాలన్న సంకల్పంతోనే నేను ఈ పరిక్రమను చేపట్టాను. దీనినే సిద్ధమాయికి చెప్పబోతే తాను వారించేసరికి ఊరుకున్నాను. మన మనసును నియంత్రించే శక్తి మనకు ఉండదేమో. అది ఆ పరమాత్ముడి చేతిలోనే ఉంటుంది. అందుకే, ఆయనకు సంపూర్ణ శరణాగతి చెందడం శ్రేష్ఠమని పెద్దలు చెప్తారు. తిరిగి బస్సులో మృత్యుంజయ ఆశ్రమానికి చేరుకొన్నాం. నేను తర్వాత ఎక్కడికీ వెళ్లకుండా 3 గంటలసేపు జపం చేసుకొన్నాను.

(సశేషం)

# నిపుణ

## — విద్య ఉద్యోగ సమాచారం —

**గీతం విశ్వవిద్యాలయం పలు కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే గ్యాట్‌నోటిఫికేషన్ విడుదల చేసింది.**

## నిక్‌మర్‌లో పీజీ

**పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ (నిక్‌మర్) కింది పీజీ ప్రోగ్రాముల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**
**కోర్సు: నిక్‌మర్ పీజీ ప్రోగ్రాములు- 2020**

- **విభాగాలు:** అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ ప్రోగ్రాం (ఏసీఎం), ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (పీఈఎం), రియల్ ఎస్టేట్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ (ఆర్ఈయూఐఎం) తదితరాలు.
- **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో ప్లానింగ్, ఆర్కిటెక్చర్ డిగ్రీ/ ఇంజినీరింగ్ డిగ్రీ/ ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** నిక్‌మర్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఎన్‌క్యాట్), పర్సనల్ ఇంటర్వ్యూ, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్ ఆధారంగా.
- **పరీక్ష తేదీలు:** 2020 జనవరి 13 నుంచి 18 వరకు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 18
- **వెబ్‌సైట్:** https://www.nicmar.ac.in

## గీతం గ్యాట్- 2020



- **పరీక్ష పేరు:** గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)-2020
- **కోర్సులు:** అండర్ గ్రాడ్యుయేట్ (బీటెక్, బీఫార్మసీ), పోస్టు గ్రాడ్యుయేట్ (ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్).
- **అర్హతలు:** అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఇంటర్, పీజీ కోర్సులకు డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.800/-
- **చివరితేదీ:** 2020, మార్చి 30
- **వెబ్‌సైట్:** https://www.gitam.edu

## నాబ్‌కాన్స్‌లో

**నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (నాబ్‌కాన్స్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 10
- **పోస్టులవారీగా ఖాళీలు:** సీనియర్ లెవల్ కన్సల్టెంట్-1, జూనియర్ లెవల్ కన్సల్టెంట్-9.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, ఎంబీఏ, అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2019, నవంబర్ 1నాటికి 24-50 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 6
- **వెబ్‌సైట్:** http://www.nabcons.com

## విశాఖ రిఫైనరీలో


**విశాఖపట్నంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్ ) విశాఖ రిఫైనరీలో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** టెక్నీషియన్
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఆపరేషన్స్ టెక్నీషియన్-66, బాయిలర్ టెక్నీషియన్-6 ఉన్నాయి.
- **అర్హతలు:** ఆపరేషన్ టెక్నీషియన్‌కు డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్, బాయిలర్ టెక్నీషియన్ పోస్టుకు ప్రథమశ్రేణిలో బాయిలర్ కాంపిటెన్సీ సర్టిఫికెట్ ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.
- **వయస్సు:** 2019, నవంబర్ 11 నాటికి 18-25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా
- **పరీక్ష కేంద్రాలు:** ముంబై, విశాఖపట్నం, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ.
- **జీతం:** నెలకు రూ.40,000/- (కనీసం)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 21
- **వెబ్‌సైట్:** https://hindustanpetroleum.com

epaper.ntnews.com

# అమెరికాలో మైసూరు విద్యార్థి హత్య

తుపాకీతో కాల్చిచంపిన దుండగులు



అభిషేక్ సుదేశ్ భట్ (ఫైల్)

**బెంగళూరు, నవంబర్ 30:** అమెరికాలో ఓ భారతీయుడిని గుర్తుతెలియని దుండగులు తుపాకీతో కాల్చిచంపారు. ఈ దుర్ఘటన కాలిఫోర్నియాలో గురువారం జరిగింది. కర్ణాటకలోని మైసూరుకు చెందిన అభిషేక్ సుదేశ్ భట్ అమెరికాలోని 'కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ'లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చదువుతున్నాడు. అదే సమయంలో కాలిఫోర్నియాలోని ఓ హోటల్‌లో తాత్కాలికంగా ఉద్యోగం కూడా చేస్తున్నాడు. అయితే ఈ హోటల్ వద్దనే దుండగులు అతడిని తుపాకీతో కాల్చిచంపారు. అభిషేక్ బంధువు శ్రీవాస్తవ మాట్లాడుతూ హత్య విషయాన్ని అభిషేక్‌తో కలిసి పని చేస్తున్న ఓ వ్యక్తి ఫోన్ చేసి చెప్పాడని తెలిపారు. వెంటనే తాము కర్ణాటక ప్రభుత్వంతోపాటు అమెరికాలోని భారత దౌత్య కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపామని, మృతదేహాన్ని అప్పగించడానికి సంబంధించిన న్యాయప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని కోరామని చెప్పారు. ఇప్పటికే పోలీసుల దర్యాప్తు పూర్తయ్యిందని, మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. అభిషేక్ తల్లిదండ్రులు అమెరికాకు వెళ్తారని, కాలిఫోర్నియాలోనే అతడి అంత్యక్రియలు నిర్వహిస్తారని వెల్లడించారు. దుండగులు తుపాకీతో కాల్చిచంపడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని వివరించారు.

# శాంతికోసం శౌర్యదివస్‌కు దూరం

ప్రకటించిన హిందుత్వ సంస్థలు


**లక్నో, నవంబర్ 30:** అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో శాంతి కోసం డిసెంబర్ 6న శౌర్య దివస్‌ను నిర్వహించడంలేదని హిందుత్వ సంస్థలు శనివారం ప్రకటించాయి. ప్రజలు మత సామరస్యాన్ని పెంపొందించాలని విజ్ఞప్తిచేశాయి. 1992లో బాబ్రి మసీదు కూల్చివేతను నిరసిస్తూ ఏటా డిసెంబర్ 6న ముస్లింలు సంతాపదినంగా, హిందూసంస్థలు శౌర్య దివస్‌గా జరుపుకొంటున్నాయి. 'శౌర్య దివస్ సందర్భంగా ప్రజలు ఇండ్లలో మట్టిదీపాలు వెలిగించండి. మతసామరస్య సందేశం పంపేలా దేవాలయాల వద్ద రామ హారతి పఠించండి' అని రాం జన్మభూమి న్యాస్ అధినేత మహంత్ నృత్య గోపాల్‌దాస్ కోరారు. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి మార్గంసుగమం చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఇప్పుడు శౌర్య దివస్ జరుపుకోవాల్సిన అవసరంలేదని ఓ ప్రకటనలో చెప్పారు. ఏ చిన్న అవకాశం వచ్చినా అది ఉద్రిక్తతలకు దారితీయొచ్చని, అందుకే డిసెంబర్ 6న ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలేదని ఆయన స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే తాము ఆలయ నిర్మాణంపై దృష్టిసారించామని, శిల్పాలు చెక్కే పనులను త్వరలో మరింత వేగిరం చేస్తామని పేర్కొన్నారు. డిసెంబర్ 6న శౌర్య దివస్ జరుపడంలేదని వీహెచ్‌పీ అధికార ప్రతినిధి శరద్ శర్మ తెలిపారు.



బ్రిడ్జి మీద నుంచి నదిలో పడిన వ్యాను..

# ఎనిమిది మంది మృతి

- మృతుల్లో ఐదుగురు చిన్నారులు
- మహారాష్ట్రలో దుర్ఘటన



ప్రమాదానికి గురైన వ్యాను

**ధూలే, నవంబర్ 30:** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కార్మికులతో వెళ్తున్న ఓ వ్యాన్ బ్రిడ్జి మీద నుంచి నదిలో పడిపోవడంతో ఎనిమిది మంది మరణించారు. 23 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ దుర్ఘటన శనివారం వేకువజామున ధూలే జిల్లాలోని విచూర్ గ్రామ సమీపంలో ఉన్న ఛలిసాగావ్-ధూలే రహదారిపై చోటుచేసుకుంది. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌లో ఉన్న ఓ చెరుకు పరిశ్రమలో బెల్లం తయారీ చేయడానికి మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికులు ఓ వ్యాన్‌లో బయలుదేరారు. వీరి వాహనం బోరి నదిపై ఉన్న వంతెన వద్దకు చేరుకున్న సమయంలో అక్కడ ఉన్న ఓ గొయ్యిని తప్పించే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో వ్యాను వంతెన గోడను ఢీకొని దాదాపు 40 నుంచి 50 అడుగుల లోతున్న నదిలో పడిపోయింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించగా.. ఒకరు దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. గాయపడిన 23 మందిని దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా.. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాద సమయంలో వ్యానులో 31 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌తోపాటు ఇద్దరు క్లీనర్లు ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరునెలల 'ఇండియా ఫస్ట్'!

- దేశాభివృద్ధి, ఐక్యత, సామాజిక సాధికారతే లక్ష్యంగా నిర్ణయాలు
- మోదీ 2.0 సర్కారుకు ఆర్నెళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని ట్వీట్



**న్యూఢిల్లీ, నవంబర్ 30:** మోదీ 2.0 సర్కారు శనివారంతో ఆరునెలల పాలనను పూర్తిచేసుకున్నది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ.. దేశాభివృద్ధికి, సామాజిక సాధికారతకు, దేశ ఐక్యతకు తమ ప్రభుత్వం అనేక నిర్ణయాలను తీసుకున్నదని చెప్పారు. '6మంత్స్ ఆఫ్ ఇండియా ఫస్ట్' () అనే హ్యాష్‌ట్యాగ్ జోడించి ఆయన శనివారం వరుస ట్వీట్లు చేశారు. సుసంపన్న, ప్రగతిశీల నవభారత నిర్మాణానికి రానున్న రోజుల్లో మరింతగా కృషిచేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ అన్న నినాదం స్ఫూర్తితో, 130 కోట్ల మంది ప్రజల ఆశీర్వాదంతో ఎన్డీఏ సర్కారు దేశాభివృద్ధికి, దేశ ప్రజల అభ్యున్నతికి నూతన ఉత్తేజంతో పనిచేస్తున్నదని పేర్కొన్నారు.

**కశ్మీర్‌లో కనిష్ఠస్థాయికి ఉగ్రవాదం: జవదేకర్**



ఆర్టికల్ 370 రద్దు అనంతరం కశ్మీర్‌లో ఉగ్రవాదం కనిష్ఠ స్థాయికి చేరిందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. దేశ భద్రత, అభివృద్ధే లక్ష్యంగా మోదీ 2.0 సర్కారు తొలి ఆరు నెలల పాలనను పూర్తిచేసుకున్నదని చెప్పారు. శనివారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ ఆర్థిక మందగమన ప్రభావం భారత్‌పై కొద్ది మాత్రంగానే ఉన్నదని, దాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రెండో పర్యాయం అధికారంలోకి వచ్చాక తొలి ఆరు నెలల్లో తమ ప్రభుత్వం తీసుకున్న పలు కీలక నిర్ణయాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ రద్దుతో జమ్ముకశ్మీర్‌లో శాంతికి మార్గం సుగమమైందని చెప్పారు. 'ఈ రెండు అధికరణలు రద్దు చేసిన అనంతరం ఈ నాలుగు నెలల కాలంలో కశ్మీర్‌లో ఉగ్రవాదం కనిష్ఠ స్థాయికి తగ్గింది. ఇది గణనీయమైన మార్పు. ప్రజా జీవనం ప్రస్తుతం సవ్యంగా ఉన్నది' అని ఆయన పేర్కొన్నారు. అలాగే జమ్ముకశ్మీర్ అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకున్నాయని చెప్పారు. జాతి ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. రాఫెల్ యుద్ధ విమానం స్వీకరణ, ఆయుధాల కొనుగోలుకు నిర్ణయాలు తీసుకోవడం ద్వారా దేశ భద్రతను బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. బ్యాంకుల విలీనం, పరిశ్రమల రుణాల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, కార్పొరేట్ పన్ను తగ్గింపు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. ట్రిపుల్ తలాక్ రద్దు ద్వారా ముస్లిం మహిళలకు న్యాయం చేకూర్చామని చెప్పారు.

## నెదర్లాండ్స్‌లో ముగ్గురిపై కత్తితో దాడి

నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**హేగ్, నవంబర్ 30:** నెదర్లాండ్స్‌లో ఓ వ్యక్తి ముగ్గురిపై కత్తితో దాడి చేశాడు. హేగ్‌లోని ప్రధాన షాపింగ్ ప్రాంతంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. రద్దీగా ఉన్న ఓ షాపింగ్ మాల్‌లోకి చొరబడిన ఆగంతకుడు ముగ్గురు మైనర్లను కత్తితో పొడిచి పారిపోయాడు. ఈ దాడిలో 15 ఏండ్ల వయసున్న ఇద్దరు బాలికలు, 13 ఏండ్ల వయసున్న ఓ బాలుడు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. దవాఖానలో చికిత్స అనంతరం వారిని ఇండ్లకు పంపివేసినట్లు వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితుడ్ని గుర్తించామని, అతడి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఉగ్ర దాడా అన్నది ఇప్పుడే నిర్ధారించలేమన్నారు. మరోవైపు శుక్రవారం లండన్‌లో కత్తిపోటు వల్ల ఇద్దరు మరణించిన నేపథ్యంలో ఐరోపాకు సమీప దేశమైన నెదర్లాండ్స్‌లో ఈ ఘటన జరుగడం కలకలం రేపింది.





హెచ్‌ఐసీసీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలిస్తున మంత్రి హరీశ్‌రావు

# చిరుధాన్యాలతో చక్కటి ఆరోగ్యం

- ఆహారంలో అవీ భాగంకావాలి
- ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ తోడ్పాటు
- మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిరుధాన్యాలతో చక్కటి ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. చిరుధాన్యాల ఆవశ్యకతపై శనివారం హెచ్‌ఐసీసీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్టాళ్లను సందర్శించి పల్స్ బాస్కెట్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి హరీశ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగు పెరుగాల్సిన అవసరం ఉన్నదని, వీటి ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తోడ్పాటును అందజేస్తున్నదని తెలిపారు. యోగా, ప్రాణాయామం, సేంద్రియ ఆహార పంటలపై ప్రజలు దృష్టిసారించాలన్నారు. పూర్వపు తరాలవారు వందేండ్లు బతికితే.. నేటి తరం వారు 70 ఏండ్లు కూడా బతుకడంలేదని, 40-50 ఏండ్లకే షుగర్, క్యాన్సర్ లాంటి వ్యాధులబారిన పడుతున్నారని, ప్రభుత్వం దీన్ని గుర్తించి పాఠశాలల్లో యోగా, ప్రాణాయామాన్ని తప్పనిసరిగా చేయడంతోపాటు హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రొటీన్లు కలిగిన ఆహారాన్ని అందజేస్తున్నదని చెప్పారు. గర్భిణులకు చిరుధాన్యాలు ఇవ్వడం వల్ల రక్తహీనత సమస్య ఉండదని, ప్రసవం అనంతరం తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారన్నారు. ఇలాంటి మిల్లెట్ స్టార్టప్స్ తప్పకుండా విజయవంతమవుతాయని మంత్రి హరీశ్ పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సభ్యులు రాజ్ బండారి, న్యూట్రీ హబ్ సీఈవో, శాస్త్రవేత్త బీ దయాకర్‌రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# నేరుగా ఢీకొనలేకే పాక్ పరోక్షయుద్ధం

- ఉగ్రవాదం ముసుగులో కుట్రలు
- రక్షణమంత్రి రాజ్‌నాథ్ ధ్వజం



పాసింగ్ ఔట్ పరేడ్ మాట్లాడుతున్న రాజ్‌నాథ్

**పుణె, నవంబర్ 30:** నేరుగా యుద్ధం చేసి గెలువలేమని తెలిసే పాకిస్థాన్ పరోక్ష యుద్ధానికి దిగుతున్నదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. అయితే ఈ పరోక్ష యుద్ధం వారి వినాశనానికే దారి తీస్తుందని స్పష్టంచేశారు. శనివారం పుణేలో జరిగిన క్యాడెట్ల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. భారత్‌పై సంప్రదాయ, పరిమిత యుద్ధంలో గెలువలేమని 1948 మొదలుకొని, 1965, 67, 99లో జరిగిన యుద్ధల్లో పాక్‌కు తెలిసొచ్చిందని చెప్పారు. అందుకే ఉగ్రవాదం ముసుగులో పరోక్ష యుద్ధానికి దిగుతున్నదని, అయితే దీని ద్వారా పాక్‌కు ఓటమి తప్ప మరేమీ దక్కదన్నారు. ఇతర దేశాలతో భారత్ ఎప్పుడూ సత్సంబంధాలనే కలిగి ఉన్నదని చెప్పారు. ఇతరుల భూభాగాలను ఆక్రమించుకోవాలనే ఉద్దేశం భారత్‌కు ఎన్నడూ లేదని, అయితే మన జోలికొస్తే మాత్రం ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. దేశ సార్వభౌమత్వం, భద్రతకు కట్టుబడి ఉన్నామని, మన భూభాగంలో ఎవరైనా ఉగ్ర శిబిరాలు నిర్వహించినా, ఉగ్రదాడులకు తెగబడినా వారికి ఎలా సమాధానమివ్వాలో తమకు తెలుసునన్నారు. భారత సైన్యానికి దేశ సరిహద్దులను రక్షించడమే కాకుండా సీమాంతర ఆపరేషన్లు చేపట్టే సామర్థ్యం కూడా ఉన్నదని చెప్పారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 2016లో నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్ (లక్షిత దాడులు), ఈ ఏడాది పాక్ భూభాగంలోని బాలాకోట్‌లో చేపట్టిన వైమానిక దాడులు.. భారత మిలిటరీ సామర్థ్యానికి ఉదాహరణలని వివరించారు. ఉగ్రవాదం ప్రపంచానికి పెనుముప్పుగా పరిణమించిందని చెప్పారు. 'అమెరికాలో జరిగిన 9/11 దాడులు, ముంబైలో చోటుచేసుకున్న 26/11 దాడులను మనం చూశాం. సైన్యం, సీఆర్పీఎఫ్, పోలీస్ బలగాలు అనేకమార్లు ఉగ్ర ప్రయత్నాలను భగ్నం చేశాయి. ఉగ్రవాదంతోపాటు మనం సైబర్‌వార్‌ను కూడా ఎదుర్కోవాల్సి ఉన్నది. విద్వేష భావజాలాన్ని వ్యాప్తి చేసే కుతంత్రాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉన్నది' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగినప్పుడు, మానవతా సంక్షోభం తలెత్తినప్పుడు ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం విశేష సేవలు అందించిందని కొనియాడారు. క్యాడెట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'భారత రక్షణ వ్యవస్థలో మీరు భాగమైనప్పుడు.. భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని సంకల్పం తీసుకోవాలని' సూచించారు. రాజ్యాంగ పరిరక్షణ అనేది మిలిటరీ నాయకత్వం, పౌర నాయకత్వాన్ని కలిపే బంధమని చెప్పారు. ప్రధాని మోదీ సారథ్యంలో తమ ప్రభుత్వం రక్షణ దౌత్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని, ఇందులో భాగంగా పాకిస్థాన్ ఉగ్ర చర్యలను అన్ని వేదికలపైనా ఎత్తిచూపిందని, అంతర్జాతీయంగా ఆ దేశాన్ని ఏకాకిని చేసిందని వివరించారు.

## సియాచిన్‌లో హిమపాతం

ఇద్దరు సైనికులు మృతి

**జమ్ము, నవంబర్ 30:** ఇటీవల సియాచిన్‌లో హిమపాతం కూలి నలుగురు సైనికులు, ఇద్దరు కూలీలు మరణించిన ఘటన మరువక ముందే మళ్లీ అలాంటి సంఘటన చోటు చేసుకుంది. శనివారం కూలిన హిమపాతం వల్ల ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. గస్తీ నిర్వహిస్తున్న సైనికులపై ఒక్కసారిగా హిమపాతం కూలడంతో వాళ్లంతా దాని కింద చిక్కుకుపోయారు. వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి హిమపాతం కింద చిక్కుకుపోయిన సైనికులను వెలికితీసి హెలికాప్టర్‌లో దవాఖానకు తరలించారు. ఇద్దరు సైనికులు మాత్రం హిమపాతంలో చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన సైనిక స్థావరంగా పేరొందిన లడఖ్‌లోని సియాచిన్‌లో సైనికులు తరుచుగా ఇలాంటి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా శీతాకాలంలో ఎక్కువ మంచుకుస్తుండటంతో సైనికులు శత్రువులకన్నా మంచుతోనే పోరాడాల్సి వస్తున్నది.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- నియంత్రణ చర్యలపై ఆరోగ్యక్యాలెండర్
- ముందస్తు చర్యలతో ఏటా తగ్గుతున్న స్వైన్‌ఫ్లూ బాధితులు



**రాష్ట్రంలో ఐదేండ్లలో స్వైన్‌ఫ్లూ బాధితులు**

| ఏడాది | సంఖ్య |
|---|---|
| 2015 | 2,956 |
| 2016 | 166 |
| 2017 | 2,165 |
| 2018 | 1,007 |
| 2019 | 1,129 |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా విస్తరించే సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యవిభాగాలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాయి. ఆయా సీజన్లలో విస్తరించే వ్యాధులు, అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్యవిభాగం ఆరోగ్య క్యాలెండర్‌ను రూపొందించింది. ఈ మేరకు జిల్లాల వారిగా ఈ ఆరోగ్యక్యాలెండర్ ప్రకారం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నారు. విస్తరించే వ్యాధులకు వైద్యసేవలు అందించడంతోపాటు ప్రజల్లో ఆయా వ్యాధులపై అవగాహన కల్పించడంపై దృష్టిపెట్టారు. ఏడాది మొత్తంలో నెలలవారీగా వ్యాప్తి చెందే వ్యాధులు, వాటిని అడ్డుకునే అంశాలను ఆరోగ్యక్యాలెండర్లో పొందుపరిచి అన్నిస్థాయిల వైద్య విభాగాలకు అందజేశారు. దాని ఆధారంగా జిల్లాల్లో వైద్యశాఖ ప్రత్యామ్నాయ కార్యక్రమాలను చేపడుతున్నది.

**స్వైన్‌ఫ్లూ ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు**

హెచ్1ఎన్1 (స్వైన్‌ఫ్లూ) వ్యాధిని ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందుకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 39 దవాఖానల్లో హెచ్1ఎన్1 వ్యాధికి సంబంధించిన వైద్యసేవలను అందించేందుకు 487 మంచాల సామర్థ్యంతో ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేశారు. దీంతోపాటు ఒసాల్టోవీర్ యాంటీ వైరల్ క్యాప్సుల్స్, సిరప్‌లను దవాఖానల్లో అందుబాటులో ఉంచారు. యాంటీ స్వైన్‌ఫ్లూ పిడియాట్రిక్ సిరప్, డబుల్ ప్రొటెక్షన్ మాస్కులు, హెచ్1ఎన్1 నిర్ధారణ కిట్లు, వైరల్ ట్రాన్స్‌పోర్ట్ మీడియా కిట్లు, శానిటైజర్లు వైద్యవిభాగాలకు అందజేశారు. అప్పటి అవసరాలను బట్టి మంచాల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. హె1ఎన్1 నిర్వహణకు సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందం పనిచేస్తున్నది. వైద్యవిభాగాలు చేపడుతున్న ముందస్తు చర్యల కారణంగా స్వైన్‌ఫ్లూ బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా తగ్గుముఖం పడుతున్నది.


## అనంతపురంలో ఎమ్మార్పీఎస్ నేత హత్య

అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచిన నిందితుడు

**అనంతపురం:** ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం నగరంలో అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తి ఎమ్మార్పీఎస్ నేతను దారుణంగా కత్తితో పొడిచి చంపేశాడు. శనివారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో గల పల్లవి టవర్స్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నది. ఎమ్మార్పీఎస్ నేత జగ్గుల ప్రకాశ్‌ను బుక్కపట్నం రమణ అనే వ్యక్తి అందరూ చూస్తుండగానే కత్తితో విచక్షణారహితంగా కడుపులో పొడిచాడు. ఈ భీతావహ ఘటనను చూసిన ప్రజలు భయంతో వణికిపోయారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని నిందితుడు రమణను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తుచేస్తున్నారు.

# రేపు జర్నలిస్టుల గ్రీన్‌చాలెంజ్

తరలిరావాలని మీడియా అకాడమీ చైర్మన్ పిలుపు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్క లు నాటడానికి జర్నలిస్టులు తరలిరావాలని మీడియా అకాడమీ, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం పిలుపునిచ్చాయి. సోమవారం ఉద యం 10:30 గంటలకు బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ వెల్లడించారు. 'తెలంగాణ కలం- హరితహారం' అన్న నినాదంతో జరిగే ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకుపోవడానికి తమ వంతు సహకారాన్ని అందించాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు.



మైనార్టీస్ కమిషన్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ ఖమరుద్దీన్

# 5న మైనార్టీస్ డే నిర్వహించాలి

మైనార్టీస్ కమిషన్ చైర్మన్ ఖమరుద్దీన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిసెంబర్ ఐదో తేదీన మైనార్టీస్ దినోత్సవాన్ని నిర్వహించాలని మైనార్టీస్ కమిషన్ చైర్మన్ ఖమరుద్దీన్ చెప్పారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో సభ్యులతో కలిసి ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. మైనార్టీ సంక్షేమశాఖ విడుదలచేసే జీవోలు మైనార్టీ కమిషన్‌కు అందకపోవడంతో ప్రభుత్వ పథకాల గురించి కమిషన్‌కు తెలియడంలేదని సభ్యులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం అందిస్తున్నట్టుగానే గురుద్వారా గ్రాంతీలకు కూడా వేతనం ఇవ్వాలని ఖమరుద్దీన్‌కు విజ్ఞప్తిచేశారు. మహిళలకు కూడా డ్రైవర్ ఎంపవర్మెంట్ పథకాన్ని అమలుచేయాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి తెలుసుకొనేందుకు జనవరి 11న సమావేశం నిర్వహించనున్నామని, దీనికి మైనార్టీస్ సంక్షేమశాఖ ఎండీ, కార్యదర్శి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ, వైస్ చైర్మన్, టెమ్రీస్ కార్యదర్శి హాజరవుతారని ఖమరుద్దీన్ తెలిపారు.

# విద్యార్థులకు నిరంతర కౌన్సెలింగ్ ఇవ్వాలి

- తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ అనివార్యం
- స్టూడెంట్ కౌన్సెలర్ల శిక్షణను ప్రారంభించిన విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల విద్యార్థులకు నిరంతరంగా కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పరీక్షలంటే విద్యార్థుల్లో కలిగే భయాందోళనలకు పొగొట్టేలా కౌన్సెలర్లు శిక్షణ ఇవ్వాలని సూచించారు. శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో నిర్వహించిన స్టూడెంట్ కౌన్సెలర్ల ఒకరోజు శిక్షణను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇష్టంలేని చదువులు కొనసాగుతున్నాయని, ఇష్టంలేకుండా కాలేజీలకు వచ్చి ఇబ్బంది పడుతున్న విద్యార్థులను ముందే గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినా ఫర్వాలేదని, మళ్లీ పరీక్షలు రాసుకోవచ్చంటూ విద్యార్థుల్లో భరోసా నింపాలని చెప్పారు. ఫెయిల్ అవడం, తక్కువ మార్కులు రావడం వల్ల జీవితంలో ఏమీ కోల్పోమని, విజయం సాధించడానికి అపజయాన్ని మెట్టుగా చేసుకొవాలని విద్యార్థులకు నేర్పాలని చెప్పారు. పరీక్షలంటే విద్యార్థులు భయపడకుండా ఉండేలా కౌన్సెలర్లు తీర్చిదిద్దాలని, ఆత్మహత్య చేసుకోవడం వల్ల కలిగే పర్యావసానాలను విడమరిచి చెప్పాలన్నారు. తల్లిదండ్రులు తమ కోరికలను పిల్లల ద్వారా తీర్చుకోవాలని చూస్తున్నారని, ఫలితంగా విద్యార్థులు ఆ భారాన్ని మోయలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిసేలా చూడాలని, అవసరమైన పక్షంలో తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇవ్వాలని చెప్పారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ మాట్లాడుతూ.. విద్యాబోధనతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారిలో మానసిక ఉల్లాసం కల్గించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, మానసిక వైద్యులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు పాల్గొన్నారు.

# నాలుగు ప్రధాన అంశాలే ఎజెండా

3న బోర్డు సమావేశానికి కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీతోపాటు మరో మూడు ప్రధాన అంశాలపై చర్చించేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సిద్ధమవుతున్నది. వాస్తవంగా నవంబర్ 27న జరగాల్సిన బోర్డు భేటీని డిసెంబర్ మూడో తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు బోర్డు అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే ఇప్పటివరకు రెండు రాష్ట్రాల నుంచి ఎజెండా అంశాలు రాలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో బోర్డుపరంగా ప్రధానంగా నాలుగు అంశాల్ని ఎజెండాలో చేర్చారు. ఇందులో 2019-20 నీటి సంవత్సరంలో రెండు రాష్ట్రాల మధ్య జలాల పంపిణీ విధివిధానాలతోపాటు ఇప్పటివరకు రెండు రాష్ట్రాల వినియోగం లెక్కలపై చర్చించనున్నారు. దీంతోపాటు మరో కీలకమైన అంశం.. కృష్ణాబోర్డు కార్యాలయాన్ని విజయవాడకు తరలించటంపై చర్చించనున్నారు. కార్యాలయం తరలింపునకు తమకు అభ్యంతరం లేదని ఇప్పటికే తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి బోర్డుకు తెలిపిన సంగతి విదితమే. బోర్డు వర్కింగ్ మాన్యువల్‌పైనా సమావేశంలో చర్చించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వీటితోపాటు బోర్డు నిర్వహణ, విజయవాడకు తరలింపు, టెలిమెట్రీ తదితర అంశాలకు సంబంధించి నిధులపైనా చర్చించనున్నారు.





బహ్రెయిన్‌లో దీక్షా దివస్‌లో పాల్గొన్న టీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులు

# మలేషియా, బహ్రెయిన్‌లో దీక్షా దివస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దీక్షా దివస్‌ను మలేషియా, బహ్రెయిన్‌లోనూ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ దీక్ష కీలక ఘట్టమని మలేసియా టీఆర్ఎస్ ఎన్నారైశాఖ అధ్యక్షుడు చిరుత చిట్టిబాబు అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ సాధనకు సీఎం కేసీఆర్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మలేషియాలోని లైట్ హౌస్ చిల్డ్రన్ వెల్ఫేర్ హోం అసోసియేషన్‌ను సందర్శించారు. అక్కడి చిన్నారులకు కావాల్సిన స్టేషనరీ, పండ్లు పంపిణీచేశారు. సంస్థ ఆర్థిక అవసరాల నిమిత్తం 100 రింగెట్లు (రూ.20 వేలు) నగదు అందించారు. ఈ కార్యక్రమంలో మలేషియా టీఆర్ఎస్ ఎన్నారైశాఖ ఉపాధ్యక్షుడు మారుతి కుర్మ, కార్యదర్శి గుండా వెంకటేశ్వర్లు, కోర్ కమిటీ సభ్యులు మునిగల అరుణ్, బొయిని శ్రీనివాస్, బొడ్డు తిరుపతి, గద్దె జీవన్‌కుమార్, రమేశ్ గౌరు, సందీప్‌కుమార్ లగిశెట్టి, సత్యానారాయణరావు నడిపెల్లి, రవితేజ తదితరులు పాల్గొన్నారు. బహ్రెయిన్ టీఆర్ఎస్ ఎన్నారై శాఖ ఆధ్వర్యంలో దీక్షా దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. పదేండ్ల కిందట 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో తలపెట్టిన దీక్ష తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక ఘట్టమన్నారు. ఉద్యమ నాయకుడే నేడు సేవకుడిగా మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములమవుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శులు లింబాద్రి పుప్పల, రాజేందర్ మగ్గిడి, చెన్నమనేని రాజేందర్, సెక్రటరీలు ప్రమోద్ బొలిశెట్టి, దేవన్న బాల్కొండ, ఉతకం కిరణ్, చిలువేరు గంగాధర్, సొన్న గంగాధర్, ఆకునూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

IV.

నమస్తే తెలంగాణ

# చిత్రం

[ కరీంనగర్ ]

ఆదివారం 1 డిసెంబర్ 2019


'దర్బార్' చిత్రంలో రజనీకాంత్

## నలుపు రంగు సింహం వచ్చేసిందు!

రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'దర్బార్'. మురుగదాస్ దర్శకుడు. సుభాస్కరన్ నిర్మాత. నయనతార కథానాయిక. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకులముందుకురానుంది. నిర్మాత ఎన్వీప్రసాద్ ఉభయ తెలుగురాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రంలోని 'దుమ్ము ధూళి..' అనే పాట ఇటీవలే విడుదలై సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. తెలుగు, తమిళ భాషల్లో ఇప్పటికే ఎనిమిది లక్షల వ్యూస్ వచ్చాయి. అనిరుధ్ రవిచంద్రన్ స్వరపరచిన ఈ గీతానికి అనంతశ్రీరామ్ సాహిత్యాన్నందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' 'నలుపు రంగున్న సింహం వచ్చేసిందు'..'ఇనుపరాడ్ అల్లే చేతులు కట్టుకు కూర్చుంటే తుప్పు పట్టిపోతావోయ్..అదే కనుక పనిచేస్తుంటే నాలా ఎప్పుడూ యంగ్‌గా ఉంటావ్' అంటూ ఈ పాటలో ప్రయోగాలు చేశాను. సందేశాత్మకంగా సాగే ఈ మాటలు రజనీ అభిమానుల్ని ఉర్రూతలూగిస్తున్నాయి' అన్నారు. ఈ సినిమాలో రజనీకాంత్ శక్తివంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు.


రాగూర్ మధు, సంతోష్, లావణ్యత్రిపాఠి, నిఖిల్, రాజ్‌కుమార్

## సురవరం స్ఫూర్తితో తీశాం!

నిఖిల్, లావణ్యత్రిపాఠి నాయకానాయికలుగా నటించిన చిత్రం 'అర్జున్ సురవరం'. టి.సంతోష్ దర్శకుడు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. నిఖిల్ మాట్లాడుతూ 'విడుదలైన అన్ని కేంద్రాల్లో చక్కటి ఆదరణ లభిస్తున్నది. తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా 4.1కోట్ల గ్రాస్ వసూలు చేసింది. సినిమాలో ఉన్న సందేశంతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతున్నారు. నేను కొంత గ్యాప్ తర్వాత ప్రేక్షకులముందుకు వచ్చినా సరే మంచి ఆదరణ కనబరిచారు. దర్శకుడి టేకింగ్, ఉన్నతమైన నిర్మాణ విలువలు ఆకట్టుకుంటున్నాయి' అన్నారు. ఎన్నో అవాంతరాలను అధిగమించి సినిమాను విడుదల చేశామని, విజయం కొత్త ఉత్సాహాన్నిచ్చిందని నిర్మాత రాజ్‌కుమార్ ఆకెళ్ల తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'నిజాయితీ జర్నలిస్ట్ ప్రయాణాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించాం. టైటిల్ విషయంలో ప్రసిద్ధ పాత్రికేయుడు సురవరం ప్రతాపరెడ్డిగారిని స్ఫూర్తిగా తీసుకోవడం జరిగింది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## నానికి జోడీగా..

'ఎవడే సుబ్రహ్మణ్యం' 'పెళ్లిచూపులు' చిత్రాల ద్వారా యువతరంలో మంచి గుర్తింపును సంపాదించుకుంది హైదరాబాదీ సుందరి రీతూవర్మ. ప్రస్తుతం తమిళ చిత్రసీమ బిజీగా ఉందీ భామ. తాజాగా ఈ సొగసరి నాని సరసన కథానాయికగా నటించనుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో నాని కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్‌పెద్ది నిర్మించనున్నారు. ఇందులో రీతూవర్మ నాయికగా ఖరారైంది. డిసెంబర్ నెలలో ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించి జనవరిలో సెట్స్‌మీదకు తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు.



రీతూవర్మ


రామ్‌గోపాల్‌వర్మ

## రివైజింగ్ కమిటీకి 'అమ్మరాజ్యంలో..'

హైకోర్టు ఆదేశాల మేరకు 'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' చిత్ర టైటిల్‌ను'అమ్మరాజ్యంలో కడప బిడ్డలు'గా మార్పు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 29న విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్యల వల్ల వాయిదా పడింది. శనివారం ఈ చిత్రాన్ని వీక్షించిన సెన్సార్ బోర్డ్ అవసరమైన మార్పుల్ని సూచించాలని కోరుతూ కేంద్ర రివైజింగ్ కమిటీకి సిఫార్స్ చేసింది. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా తెలియజేశారు రామ్‌గోపాల్‌వర్మ. 'మా చిత్రాన్ని సెన్సార్ వారు చూశారు. మార్పుల కోసం రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నట్లు తెలిపారు' అని వర్మ పేర్కొన్నారు. రివైజింగ్ కమిటీ తీసుకునే నిర్ణయం అనంతరమే ఈ సినిమా విడుదల తేదీపై స్పష్టత రానున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి సిద్ధార్థ తాతోలు దర్శకత్వం వహించారు.

## 'వీరశాస్త అయ్యప్ప కటాక్షం' గీతాలు


కల్యాణ్, సుమన్, తెన్నేటి, వేణుగోపాల్

సుమన్ కీలక పాత్రలో నటిస్తున్న భక్తిరసప్రధాన చిత్రం 'వీరశాస్త అయ్యప్ప'. రుద్రాభట్ల వేణుగోపాల్ దర్శకుడు. వీఎస్పీ తెన్నేటి, టి.ఎస్.బద్రీష్‌రామ్ నిర్మాతలు. వి.ఎస్.ఎల్.జయకుమార్ స్వరపరచిన ఈ చిత్ర గీతాలు శనివారం విడుదలయ్యాయి. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, శంకర్‌మహదేవన్, మనో వంటి ప్రముఖ గాయకులు గీతాలాపన చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'భక్తితో పాటు మానసిక శక్తిని సవ్యదిశలో పెంచి సానుకూల దృక్పథాన్ని కలిగించే విధంగా ఈ సినిమాను తీర్చిదిద్దాం. పాటలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి' అన్నారు. రమాప్రభ, జ్యోతి, ఆకెళ్ల, చలపతి, మాస్టర్ హరీంద్ర, అశోక్‌కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వేణు మురళీధర్, వడ్నాల, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు: వీఎస్పీ తెన్నేటి, దర్శకత్వం: రుద్రాభట్ల వేణుగోపాల్ (ఆర్.వి.జి).





